# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..


23.11.2025 ఆదివారం Sunday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 149 | పేజీలు : 8 Pages : 8 | వెల రూ.2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789




# ఖరీదైన ‘పందికొక్కులు’!

## రూ.10 వేల కోట్ల ‘సీఎమ్ఆర్’ పక్కదారి





నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

తెలంగాణ రాష్ట్రంలోని 3000 రైస్ మిల్లుల్లో..'ఖరీదైన పందికొక్కులు' తిష్టవేసి రూ.10 వేల కోట్ల విలువైన బియ్యాన్ని కడుపారా బుక్కేసారు.! ప్రతీ యేటా రెండు సీజన్లలో 'సీఎంఆర్–బియ్యం'..'సివిల్ సప్లై గోదాం'లకు చేరాల్సి ఉండగా పక్కదారి పట్టింది.! రాష్ట్ర వ్యాప్తంగా 800 మంది రైస్ మిల్లర్లు ఈ 'బియ్యం బుక్కినట్టు' .. 'విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్' అధికారులు తనిఖీలు వారి బండారాన్ని బయట పెట్టారు.వారు గుర్తించిన రైస్ మిల్లర్లను 'ప్రభుత్వం డిఫాల్టర్లుగా గుర్తించారు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 'డిఫాల్టర్ రైస్ మిల్లర్ల'కు మళ్లీ ఏ సీజన్‌లోనూ సీఎంఆర్ ధాన్యం కేటాయించకూ డదు..పైగా 'నేరస్తులు'గా గుర్తించి కేసులు పెట్టాల్సి ఉంటుంది. కాగా.. అధికారులు తాము చెప్పి 'అగ్రిమెంట్' చేయించుకున్న నిబంధ ఒనలను తామే తుంగలో తొక్కి ఈ సీజన్లోనూ ధాన్యం కేటాయించడం వెనక 'ఈ టోటల్–అక్రమ దందా'లో అందరూ కీలక భాగస్వాములేనన్నది తేట తెల్లమైంది.ఇందులో భాగంగానే 'సమాచార హక్కు'చట్టం ద్వారా ఏ రైస్ మిల్లర్ ఎన్ని కోట్ల 'బియ్యం బుక్కింద్రో' అధికారిక సాక్ష్యం లభించింది. ఆ 'స.హ.చట్టం' ద్వారా అందిన వివరాలు 'నేటి సాక్షి' ద్వారా మీకోసం...


వివరాలు 5, 6వ పేజీల్లో


- ఒక్క జగిత్యాల జిల్లాలోనే రూ.వెయ్యి రెండు కోట్ల బియ్యం మాయం
- 'సమాచారహక్కు చట్టం' ద్వారా వెలుగులోకి..
- 'సివిల్ సప్లై' ధాన్యానికి 'బియ్యం' గడువులోగా ఇవ్వకుంటే 'డిఫాల్ట్ రైస్ మిల్లు'గా గుర్తింపు
- ఆర్ఆర్ కేసు.. క్రిమినల్ కేసు.. రైస్ మిల్లు.. ఆస్తుల సీజ్.. బ్యాంకు అకౌంట్‌ల ఫ్రీజ్
- కానీ, జగిత్యాల జిల్లాలో విరుద్ధం - 'విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్' దాడుల్లో ధాన్యం మాయమైనట్టు గుర్తించినా చర్యలు శూన్యం
- మళ్లీ అవే 'అక్రమాలకు' పాల్పడుతున్న రైస్ మిల్లులకు 2025 ఖరీఫ్ ధాన్యం కేటాయింపులు
- జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనూ 'డీ ఫాల్టర్ల' రికార్డులు లేవంట?
- రూపాయి 'పెట్టుబడి' పెట్టకుండా కోట్ల విలువైన 'అక్రమ దందా'
- 'రైస్ మిల్లర్లు'-'సివిల్ సప్లై అధికారులు' అందరూ కుమ్మక్కే.!
- అడపాదడపా వచ్చే 'తనిఖీ' అధికారుల 'జేబులూ-బరువు'తోనే వెళ్తాయి
- ఈ 'సీఎంఆర్' అక్రమ దందాలో 'పాత్రధారులు' రైస్ మిల్లర్లైతే.? మరి 'సూత్రధారులె'వరు.!?
- విస్తుపోయే వివరాలతో 'నేటి సాక్షి'.. 'ఎక్స్‌క్లూజివ్' కథనాలు 'మొదటి ఎపిసోడ్ మీకోసం

# 37మంది మావోలు లొంగుబాటు

### వీరిలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఆజాద్, అప్పాసి నారాయణ, సోమడా

- మిగతా వారిలో డీవీసీఎం-3, ఏసీఎం-9, పార్టీ సభ్యులు-22 మంది
- తెలంగాణ డీజీపీ ఎదుట ఆయుధాల అప్పగింత
- ఇంకా అజ్ఞాతంలో 59మంది తెలంగాణవాసులు
- సెంట్రల్‌కమిటీలోని ఐదుగురు లొంగిపోవాలి : డీజీపీ


వివరాలు 2వ పేజీలో




# లైన్‌క్లియర్



- పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు
- 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు
- రొటేషన్ పద్ధతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్లు

## జీవో 46తో కొత్త మార్గదర్శకాలు

**గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభు త్వం శనివారం జీవో 46ను విడుదల చేసింది. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల విధివిధానాలు ఖరారు చేసింది. రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా మార్గదర్శకాలు జారీ చేసింది.**

**హైదరాబాద్:** తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల కేటాయింపుకు ప్రభుత్వం కీలకమైన జీవో 46ని జారీ చేసింది. ఈ ఉత్తర్వుల్లో మొత్తం రిజర్వేషన్లు ఎప్పటికీ 50శాతం దాటకూడదనే నిబంధనను స్పష్టంగా పేర్కొన్నది. ఈ నియమం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళల రిజర్వేషన్ల మధ్య సమతుల్యత నెరవేరనున్నది. ఈ చర్యతో గ్రామీణ పాలనలో న్యాయమైన ప్రాతినిధ్యం లభిస్తుందని అధికారగణం భావిస్తున్నది.


మిగతా 2 లో


# పెన్నే కదాని తృణీకరిస్తే గన్నై కూల్చింది

- కవులు, కళాకారులతోనే తెలంగాణ సాకారం
- అందెశ్రీ రాష్ట్ర గీతం అందించిన ఘనుడు
- అందెశ్రీ సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి


3




నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# తెలీదు.. గుర్తులేదు.. మర్చిపోయా

**పోలీసుల విచారణలో సహకరించని రవి ● ముగిసిన విచారణ**



**హైదరాబాద్, నవంబరు 22:** సినిమాల పైరసీ కేసులో ఐ బొమ్మ ఇమంది రవి పోలీసుల విచారణ శనివారం మూడో రోజు ముగిసింది. ఐదు రోజుల కస్టడీలో భాగంగా ఇమంది రవికి ఏజెంట్లు, గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా తీశారు. పైరసీకి ఎవరు సహకారం అందిస్తున్నారు.. తెర వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారనే విషయాలపై పోలీసులు ప్రశ్నించారు. సైబర్ నేరాలకు ఐ బొమ్మ సైట్‌ను నేరగాళ్లు వేదికగా మలుచుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సినిమాల సేకరణ, సైట్‌లో అప్‌లోడ్‌కు సంబంధించిన వివరాలను పోలీసులు అడిగి తెలుసుకున్నారు. అయితే, విచారణలో పోలీసులకు రవి సహకరించడం లేదని సమాచారం. పోలీసులు అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు చెబుతున్నాడని తెలిసింది. యూజర్ ఐడీ, పాస్‌వర్డులు అడిగితే గుర్తు లేదు.. మరిచిపోయానని రవి సమాధానం చెప్పినట్లు సమాచారం. ఎథికల్ హ్యాకర్ల సహాయంతో హార్డ్‌డిస్క్‌లు, పెన్ డ్రైవ్‌లను పోలీసులు ఓపెన్ చేస్తున్నారు. ఫ్రాన్స్, నెదర్లాండ్‌లో మెయిన్ సర్వర్లు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. బ్యాంక్ ఖాతాల విషయంలోనూ రవి నోరువిప్పలేదని.. రవి అకౌంట్ల వివరాలు ఇవ్వాలని పలు బ్యాంకులకు పోలీసులు మెయిల్ పంపారు. ప్రతీరోజూ 20 రోజులకు ఒక్కో దేశానికి రవి వెళ్లాడని.. దీనిపై ప్రశ్నిస్తే తనకు విదేశీ పర్యటనలంటే ఇష్టమని.. అందుకే వెళ్లాలని రవి చెప్పినట్లు తెలియవచ్చింది. రవి పర్యటించిన దేశాల్లో పైరసీ లింకుల కూపీ లాగుతున్నారు పోలీసులు.

# అల్పపీడనంతో వర్ష సూచన



**హైదరాబాద్, నవంబరు 22:** తెలంగాణలో రాగల రెండురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మలక్కా జలసంధిలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం ఉదయం 8.30 గంటలకు దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణశాఖ తెలిపింది. పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఆ తర్వాత పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ తర్వాతి 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే ఛాన్స్ ఉందని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో ఆదివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. పలుచోట్ల పొగమంచు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం సైతం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని వివరించింది. మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పొడి వాతావరణం ఉంటుందని వివరించింది.

# 9మంది నాన్ కేడర్ ఎస్పీల బదిలీ

**హైదరాబాద్,నవంబరు 22:** తెలంగాణలో తొమ్మిది మంది నాన్ క్యాడర్ ఎస్పీలను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటెలిజెన్స్ ఎస్పీలుగా పీ కరుణాకర్, ఎస్వీఎన్ శివరామ్, ఆర్ జగదీశ్వర్‌రెడ్డిని బదిలీ చేసింది. సైబరాబాద్ ఎస్‌బీ డీజీపీగా వైవీఎస్ సుధీంద్ర, సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీగా సాయిశ్రీ నియామకమయ్యారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీగా వి అరవింద్ బాబు, వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా ధార కవిత, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా ఎం రవీందర్‌రెడ్డి, సీఐడీ ఎస్పీగా ఎన్ అశోక్ కుమార్ బదిలీ నియామకమయ్యారు. ఇదిలా ఉండగా శుక్రవారం ప్రభుత్వం 32 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఉన్నతాధికారుల బదిలీలు చేపట్టింది. 32 మంది అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# డీసీసీ అధ్యక్షుల నియామకాలు

**ఎమ్మెల్యేలకు పలుచోట్ల పార్టీ అధ్యక్ష బాధ్యతలు**



**న్యూఢిల్లీ, నవంబర్ 22:** తెలంగాణలో స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న వేళ కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. ఖాళీగా ఉన్న డిసిసి పదవులను భర్తీ చేసింది. క్షేత్రసత్యాయిలో ప్రజలను సమీకరించేందుకు ఎమ్మెల్యేలకు పలుచోట్ల బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలో తెలంగాణ డీసీసీలకు కొత్త అధ్యక్షులను ఏఐసీసీ ప్రకటించింది. 30 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను నియమించి వారి పేర్లను విడుదల చేసింది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పరిధిలోని జిల్లాల కాంగ్రెస్ కమిటీలకు నూతన అధ్యక్షులను నియమిస్తూ వారి పేర్లు వెల్లడించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడి ఆమోదం మేరకు ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. ఇందులో ఆదిలాబాద్ - డాక్టర్ నరేష్ జాదవ్,ఆసిఫాబాద్ - ఆత్రం సుగుణ, భద్రాద్రి కొత్తగూడెం -దేవి ప్రసన్న, భువనగిరి - బీర్ల ఐలయ్య, గద్వాల - రాజీవ్ రెడ్డి, హన్మకొండ - ఇనిగాల వెంకట్రామి రెడ్డి, హైదరాబాద్ - సయ్యద్ ఖలీద్ సహిఫుల్ల జగిత్యాల - నందయ్య, జనగాం - ధన్వంతి, జయశంకర్ - భూపాల పల్లి కరుణాకర్,కామారెడ్డి - మల్లికార్జున ఆలెలను నయిమించారు. ఇందులో కొందరు కార్పోరేషన్ ఛైర్మన్లు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

## ఎంబీఏ ఫలితాలు విడుదల

**హైదరాబాద్,నవంబరు 22:** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.


# మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్

- వరుస ఎన్‌కౌంటర్ల తరవాత 37మంది లొంగుబాటు
- లొంగిపోయిన వారిలో కేంద్రకమిటీ సభ్యులు ఆజాద్
- గణపతి తదితరులంతా అజ్ఞాతం వీడి రావాలన్న డీజీపీ



**హైదరాబాద్, నవంబర్ 22:** మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. వరుస ఎన్‌కౌంటర్ల తరవాత తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 25 మంది మహిళా మావోలు ఉండగా.. 12 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు వంటి పలువురు అగ్రనేతలు ఉన్నారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టుల నుంచి పోలీసులు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 303 రైఫిల్స్, జీ-3 రైఫిల్స్, ఎకె47లు, భారీగా బు÷-లలెట్స్ స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్ర ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు. మిగతా 34 మంది మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని తెలిపారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు చెప్పారు. అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు వీరంతా జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకొచ్చినట్లు డీజీపీ వెల్లడించారు. లొంగిపోయిన వారంతా తమ ఆయుధాలను కూడా అప్పగించినట్లు తెలిపారు. 37 మందికి తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు అందజేశారు. ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాస్ నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉంది. వీరితోపాటు లొంగిపోయిన మావోయిస్టులందరిపైనా కలిపి మొత్తం రూ.1.41కోట్ల రివార్డు ఉంది. ఆ మొత్తాన్ని వారికే అందజేస్తాం అని తెలిపారు. తెలంగాణకు చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తాం. మిగతావాళ్లు కూడా తొందరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అన్నారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పాక హనుమంతు అలియాస్ గణేలిశ్,బడె చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నారు. అంతేకాకుండా రాష్ట్ర కమిటీలో 10 మంది ఉన్నారు. వీళ్లంతా వీలైనంత త్వరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. మావోల లొంగుబాటు సందర్భంగా ఆయన పలు అంశాలు వివరించారు. ఏ రకంగా బయటికి వచ్చినా.. మావోయిస్టులను అన్ని విధాలుగా ప్రభుత్వం చూసుకుంటుందని డీజీపీ అన్నారు. మీడియా ద్వారా వచ్చినా, ప్రభుత్వ ఉద్యోగులు ద్వారా వచ్చినా, రాజకీయ నాయకుల ద్వారా వచ్చినా తాము స్వాగతిస్తామని డీజీపీ పేర్కొన్నారు. మావోయిస్టులు పార్టీ పరంగా విబేధాలు, ఆరోగ్య కారణాలు, ఇలా అనేక కారణాలతో బయటికి వస్తున్నారని డీజీపీ తెలిపారు. 'తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఉన్న ఆజాద్ 30 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నాడు. ములుగు జిల్లాకు చెందిన ఆజాద్ మీద రూ.20లక్షల రివార్డ్ ఉంది. అప్పాసి నారాయణ మీద రూ.20లక్షలు రివార్డ్ ఉంది. మిగతా వారికి రూ.25 వేలు చొప్పున ఇస్తున్నామని డీజీపీ తెలిపారు. 11 నెలల్లో 465మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరిలో 59మంది తెలంగాణకు చెందిన వారని డీజీపీ వెల్లడించారు.

# పంచాయతీకి లైన్ క్లియర్




**హైదరాబాద్,నవంబరు 22:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చకు రేవంత్ సర్కార్ తెర దింపింది. తాజాగా ఇందుకు సంబంధించిన జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా మార్గదర్శకాలు జారీ చేసింది. రిజర్వేషన్ల ఖరారు కోసం పంచాయతీ రాజ్ శాఖ జీవో విడుదల చేసింది. పంచాయతీరాజ్ జీవో ప్రకారం రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్లు ఖరారు చేయనున్నారు. 50శాతం రిజర్వేషన్లు దాటకుండా ఎస్సీ , ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన ఈ జీవో ప్రకారం బీసీలకు సర్పంచ్, వార్డు స్థానాల్లో 23 శాతం రిజర్వేషన్లు దక్కనున్నాయి. ఇదిలావుంటే వచ్చే వారంలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలో ఎన్నికల ఏర్పాట్లు, అధికారులు చేపట్టాల్సిన బాధ్యతలు, భద్రతా చర్యలు, పోలింగ్ ఏర్పాట్లపై ఈ సమావేశంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఈసీ చర్యలు అధికార యంత్రాంగాన్ని ఉత్సాహపరుస్తున్నాయి. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సన్నాహాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ రాణి కుమిదిని, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ.. గత ఎన్నికల నిర్వహణలో ఎదురైన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, శాంతిభద్రతల నిర్వహణ సులభతరం చేయడానికి ప్రతి జిల్లాలో ఎన్నికలను మూడు దఫాలుగా నిర్వహించాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా ఒక ప్రాంతంలోని ఎన్నికలు పూర్తయిన తర్వాత, మరొక ప్రాంతంలో ఎన్నికలకు మధ్యలో రెండు రోజుల విరామం ఉండాలని డీజీపీ అభిప్రాయపడ్డారు. ఈ విరామం వలన సిబ్బందికి, భద్రతా బలగాలకు తగిన సమయం లభిస్తుందని, బందోబస్తు నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికలు పూర్తయిన రోజు ఫలితాలు సాయంత్రం ప్రకటిస్తున్న నేపథ్యంలో ర్యాలీలు నిర్వహించే అవకాశం ఉన్నందున రెండు రోజుల విరామం అవసరమని స్పష్టం చేశారు.

# అంతర్జాతీయ స్థాయి ఉత్సవంలా

**తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు భారీ ఏర్పాట్లు**

**ఫ్యూచర్ సిటీలో సువిశాల ప్రాంగణం.. భారీ వేదిక**

**తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ కు తుది మెరుగులు**

**25వ తేదీ నుంచి విభాగాల వారీగా సమీక్ష సమావేశాలు**

**గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై అధికారులతో సీఎం రేవంత్**



**హైదరాబాద్, నవంబర్ 22:** డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ ఏరియాలో నిర్వహించే రెండు రోజుల వేడుకలను రెండేండ్ల విజయోత్సవాలుగా జరపాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సీఎంవో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్తో సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు సీఎంవో అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినందున, రెండేండ్ల విజయోత్సవాలను ప్రతిబింబించేలా ఫ్యూచర్ సిటీలో విశాలమైన ప్రాంగణంలో భారీ వేదిక ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ అందరినీ ఆకట్టుకునే అంతర్జాతీయ స్థాయి ఉత్సవాన్ని తలపించాలని అన్నారు. డిసెంబర్ 8వ తేదీ, తొలి రోజున ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విజయాన్ని చాటి చెప్పాలన్నారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు జరగాలన్నారు. 9వ తేదీన రెండో రోజున తెలంగాణ భవిష్యత్తు దార్శనికతను, భవిష్యత్తు ప్రణాళికలను పొందుపరిచిన తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ను ఆవిష్కరించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇదే ప్రాంగణంలో తెలంగాణలో పారిశ్రామిక విధానాన్ని, పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెప్పేలా రౌండ్ టేబుల్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాలు తమ భవిష్యత్తు లక్ష్యాలన్ని కళ్లకు కట్టించే ఆడియో వీడియో ప్రదర్శనలు, ప్రజంటేషన్లు తయారు చేసుకోవాలని సీఎం సూచించారు. దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, అన్ని రంగాల్లో పేరొందిన పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు. వేడుకలకు వచ్చిన అతిథులకు తగిన వసతి సదుపాయాలతో పాటు అత్యున్నత భద్రత కల్పించాలని సీఎం ఆదేశించారు. ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలని, అన్ని విభాగాలు సమన్వయంతో ఈ వేడుకలను విజయవంతం చేయాలని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దటంతో క్రియాశీల పాత్ర పోషించాల్సిన అన్ని విభాగాలు గ్లోబల్ సమ్మిట్లో కీలకంగా పాలుపంచుకోవాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకోవటం, రైజింగ్ డాక్యుమెంట్లో పొందుపరిచే ప్రతి అంశంపై లోతైన అధ్యయనం చేసుకోవాలని అధికారులను సీఎం అప్రమత్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను దిశానిర్దేశం చేసే ఈ డాక్యుమెంట్లో పొందుపరిచిన అంశాలపై సంబంధిత విభాగాలతో ఈనెల 25 నుంచి వరుసగా సమీక్షలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. అభివృద్ధిలో కీలకమైన రంగాలు, అందులో పాలుపంచుకునే అనుసంధాన విభాగాలన్నింటితో ఒక్కో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లతో పాటు రెండేండ్ల ప్రగతి, తెలంగాణ రైజింగ్ 2047లో ఆయా విభాగాల పాత్రపై ప్రధానంగా సమీక్ష జరుపుతామన్నారు. ఇప్పటికే ప్రజల అభిప్రాయాలు, సలహాలు సూచనలతో పాటు అన్ని రంగాల్లోని నిపుణుల దూరదృష్టితో తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ 2047 రూపకల్పన జరిగిందని సీఎం తెలిపారు. వివిధ విభాగాల అధికారులతో నిర్వహించే సమీక్షల్లో వచ్చే విలువైన సలహాలు, నిర్దిష్టమైన సూచనలను పొందుపరిచి డాక్యుమెంట్ కు తుదిరూపం ఇస్తామని అభిప్రాయపడ్డారు.



# చెక్ డ్యామ్ పేల్చివేత

**ఇసుక అక్రమార్కుల దుశ్చర్య**

**రూ.3కోట్ల ఆస్తి నష్టం ● పెద్దపల్లి జిల్లాలో దారుణం**


**పెద్దపల్లి, నవంబర్22:** ఇసుక అక్రమార్కులు తమ వ్యాపారం కోసం దుశ్చర్యకు పాల్పడ్డారు. ఇసుక అక్రమ రవాణా కోసం అడ్డుగా ఉన్న చెక్ డ్యామ్ ను కూల్చివేశారు. పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం గుంపులలో 23 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న చెక్ డ్యామ్ బాంబులు పెట్టి శనివారం ఉదయం పేల్చివేశారు. మానేరు వాగుపై నిర్మిస్తున్న చెక్ డ్యామ్ వల్ల నీరు నిలిచి ఉండడంతో ఇసుక అక్రమ రవాణాకు వీలుపడటం లేదని భావించిన అక్రమార్కులు బాంబులు పెట్టి చెక్ డ్యామ్ ను పేల్చివేశారు. ఈ ఘటనలో మూడు ప్యానల్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వీటిని విలువ మూడు కోట్లకు పైగా ఉంటుందని నీటిపారుదల శాఖ అధికారులు తెలియజేశారు. రూ.23కోట్లతో మానేరు వాగుపై నిర్మిస్తున్న చెక్ డాం పనులు పూర్తి కావడంతో అధికారులు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసే సమయంలో ఇసుక అక్రమార్కులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న నీటిపారుదల శాఖ అధికారులతో పాటు పోలీసు అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్నారు.



నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
ఆదివారం 23 నవంబర్ 2025 కరీంనగర్ 3

# పెన్నే కదాని తృణీకరిస్తే.. గన్నై కూల్చింది

- కవులు, కళాకారులతోనే తెలంగాణ సాకారం
- ఉద్యమకారులను నాటి పాలకులు విస్మరించారు
- అందెశ్రీ రాష్ట్ర గీతం అందించిన ఘనుడు
- ఆయన లేకుండా ఉద్యమసభలు లేవు
- అందెశ్రీ సంస్మరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి






**హైదరాబాద్, నవంబర్ 22:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారే ముందుండి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లారని అన్నారు. వారు లేకుంటే తెలంగాణ లేదని అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన అందెశ్రీ సంతాప సభలో సీఎం ప్రసంగించారు. ఉద్యమానికి కవులు, కళాకారులు ఇచ్చిన ఊపుతోనే తెలంగాణ సాకారమైందని, ఇది ఎవరూ కాదనలేని నిజమన్నారు. అంతేగాకాకుండా వారే తెలంగాణ ఉద్యమాన్ని భుజాన వేసుకుని మోసారని అన్నారు.. ఎన్నడూ బడికి వెళ్లని అందెశ్రీ అద్భుతమైన జయజయహే తెలంగాణ పాట రాశారు. బడికి వెళ్ళని అందె శ్రీ రాసిన జయ జయ హే తెలంగాణ గీతం రాసిన చరిత్ర తెలంగాణకు ఉంది అని రేవంత్ తెలిపారు. బాధతో.. ఉద్వేగంతో చెప్తున్నా.. తెలంగాణ రాష్ట్ర ప్రజలు జయ జయ హే తెలంగాణ పాటకు గౌరవం దక్కాలని కోరుకున్నారు. తెలంగాణ గీతం స్ఫూర్తి నింపిన కవులు, రచయితలను కించపరిచే విధంగా గత పాలకుల చర్యలు ఉన్నాయని సీఎం రేవంత్ అన్నారు. అందెశ్రీ పాట లేకుండా తెలంగాణ ఉద్యమంలో ఒక్క సభ కూడా జరగలేదని గుర్తు చేశారు. ఊరూరా పాటలతో అందెశ్రీ ఉద్యమానికి ఊపిరిలూదారని అన్నారు. కానీ, తెలంగాణ సాకారమైన తర్వాత ఆ పాట మూగబోయింది. ఆయనను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పాలకుల దృష్టిలో పదేళ్లు మూగబోయి ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల గుండెల్లో నిత్యం గానమై నిలిచిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వారిని కనుమరుగు చేసే ప్రయత్నం ఆనాడు జరిగిందన్నారు. కవి రాసే పెన్నుల మీద మన్ను కప్పితే.. అవి గన్నులై మొలకెత్తుతాయ్.. మీ గడీలను కుప్పకూలుస్తాయ్ అన్న నినాదాన్ని అందెశ్రీ నిజం చేశారని సిఎం రేవంత్ అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వారి కుటుంబాలకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నాం. వారి కుటుంబాలకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 9 మంది ఉద్యమకారులను గుర్తించడం జరిగింది. అంతేకాకుండా రాబోయే రోజుల్లో ఫ్యూచర్ సిటీలో వారి కుటుంబానికి ఇళ్లను నిర్మించి అండగా నిలుస్తాం. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర తెలంగాణ ఉద్యమకారులది. దేశంలో ఎస్సి వర్గీకరణ అమలు చేసిన చరిత్ర తెలంగాణ రాష్ట్రానిది. వర్గీకరణ అనేది ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యేలా ఉండాలి.. అలాగే సమాజాన్ని ముందుకు నడిపించాలానే ఉద్దేశంతో నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రమంత్రి వర్గంలో దళితులకు పెద్ద పీట వేయడం అనేది సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆకాంక్షల మేరకే నిర్ణయాలు తీసుకున్నాం.' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో ఎన్ని వజ్రాలు ఉన్నా కోహినూర్ వజ్రనిదే అసలైన గొప్పతనం.. అలాగే కళాకారులు ఎంతమంది ఉన్నా అందె శ్రీ అన్న.. కోహినూర్ వజ్రంలా నిలుస్తాడు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఆచార్య కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంతరావు పలువురు కవులు, గాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటం వద్ద అందరూ నివాళి అర్పించారు. జయజయహేతో సభ మార్మోగింది. అందెశ్రీ అమర్ రహే అన్న నినాదాలు మిన్నంటాయి.

# 5లక్షల కోట్ల భూములకు రెక్కలు

## 5వేల కోట్లకే అస్మదీయులకు కట్టబెట్టే కుట్ర

## ప్రభుత్వ తీరును తప్పుపట్టిన హరీష్ రావు



**హైదరాబాద్,నవంబర్22:** పారిశ్రామిక అవసరాల కోసం 50-60 ఏళ్ల కిందట కేటాయించిన భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో.. అజామాబాద్ పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరించినప్పుడు.. ఎస్ఆర్ఓ రేట్ల కంటే 100శాతం నుంచి 200 శాతం అధికంగా వసూలు చేయాలని ఒక చట్టం చేశాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 30 శాతానికే అప్పగించాలని చూస్తోంది. 7 రోజుల్లో దరఖాస్తులు 7 రోజుల్లో ఆమోదాలు 45 రోజుల్లో పూర్తి క్రమబద్ధీకరణ ఎవరికి లాభం చేకూర్చడానికి ఈ వేగవంతమైన పక్రియ అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం చేస్తున్నారు. రూ.5లక్షల కోట్లు రావాల్సిన భూములకు కేవలం రూ.5వేల కోట్లు మాత్రమే ఎలా వస్తాయి? రెండు సంవత్సరాల బ్జడెట్‌కు సరిపడా నిధులు వచ్చే నిర్ణయాన్ని ఏకపక్షంగా ఎలా తీసుకుంటారని నిలదీసారు. మంత్రిమండలి, అసెంబ్లీలో చర్చించకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారు? రూ.లక్షల కోట్ల విలువైన భూములను ఆగమేఘాల మీద ఎలా అప్పగిస్తారు? రెండు నెలల్లోనే పక్రియ అంతా పూర్తి చేయటం వెనుక కుట్ర ఏమిటి? భూములను బహిరంగ మార్కెట్‌లో వేలం వేస్తే.. రూ.5లక్షల కోట్లు వస్తాయి. ప్రభుత్వ అవసరాలకు కూడా భూమి లేకుండా ఎలా విక్రయిస్తున్నారు. కాలుష్య కారక పరిశ్రమలను మాత్రమే ఓఆర్ఆర్ అవతలకు పంపించాలనేది పాలసీ. కానీ, ఈ ప్రభుత్వం గ్రీన్ ఇండస్ట్రీలను కూడా బయటికి పంపిస్తోంది. 9,290 ఎకరాల భూముల ద్వారా కాంగ్రెస్ నేతలు జేబులు నింపుకొంటున్నారు. పరిశ్రమల కోసం ఇచ్చిన భూములను మల్టీపర్పస్ అవసరాలకు ఎలా అనుమతిస్తారు. భారీ కుంభకోణంపై కేంద్రంలోని భాజపా ఎందుకు స్పందించటం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# నకిలీ లేడీ ఖాకీ పట్టివేత

## పోలీస్ డ్రెస్‌లో ఏకంగా వీఐపి డ్యూటీ

**హైదరాబాద్, నవంబర్ 22:** హైదరాబాద్‌లో నకిలీ ఖాకీ వ్యవహారం వెలుగుచూసింది. జీడిమెట్ల పోలీసు పరిధిలో నకిలీ లేడీ కానిస్టేబుల్‌గా వ్యవహరించిన ఉమాభారతి అనే మహిళను పోలీసులు అరెస్టు చేశారు. కానిస్టేబుల్ పోస్టుకి సెలెక్ట్ కాలేకపోయినా, తాను పోలీసు సిబ్బందిలోనే పనిచేస్తున్నట్లు చాటుకునేలా ఖాకీ డ్రెస్ కొనుగోలు చేసి, పలు వీఐపీ కార్యక్రమాలకు బందోబస్తు డ్యూటీలు చేసిన విషయం బయటపడింది. తెలంగాణ పోలీసు కానిస్టేబుల్ అర్హత పరీక్షలకు ప్రిపేర్ అవుతూ, పోలీసులలో పనిచేయాలనే కోరికతో ఉమాభారతి ముందుగా డ్రెస్ కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం హైదరాబాదులో జరిగిన కీలక వీఐపీ కార్యక్రమాల్లో.. సచివాలయంలో జరిగిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ఖైరతాబాద్ గణెశ్ ఉత్సవాల ఊరేగింపు వంటి ఈవెంట్లలో బందోబస్తుల పేరుతో తిరిగినట్లు వెల్లడైంది. సైబరాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కి కూడా వెళ్లి, అక్కడి క్యాంటీన్‌లో గడిపి వెళ్లిపోయిన విషయం విచారణలో బయటపడింది. అంతేకాకుండా పలు కాలేజీల్లోకి వెళ్లి 'సైబర్ క్రైమ్ అవేర్‌నెస్' పేరుతో లెక్చర్లు ఇచ్చిందని కూడా పోలీసులు గుర్తించారు. ఒక దశలో ఉమాభారతి ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు ఆమెను ప్రశ్నించడంతో మొత్తం నకిలీ ఖాకీ డ్రామా బట్టబయలైంది. అసలు పోలీసు ఉద్యోగం లేకపోయినా, అధికారులు, సిబ్బంది తెలియకుండా వీఐపీ డ్యూటీలను కూడా ఎలా చేసిందన్న దానిపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# అన్నపూర్ణ స్టూడియోను సందర్శించిన భట్టి

## ఫల్మ్, మీడియాలో విద్యార్థుల సృజనాత్మకతకు ఫిదా

## అక్కినేని నాగార్జున దంపతుల పట్టుదలకు అభినందన



**హైదరాబాద్,నవంబరు 22:** 2047నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ లక్ష్యంలో చిత్ర పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ భవిష్యత్తును నిర్మించడంలో చిరంజీవి, అక్కినేని నాగార్జున వంటి సీనియర్ సినీ దిగ్గజాల మద్దతు కోసం వేము ఎదురుచూస్తున్నామని అన్నారు.మంగళవారం అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ / మీడియాను సందర్శించి విద్యార్థుల సృజనాత్మకతను ప్రశంసించారు. 1970లో కనీస మౌలిక సదుపాయాలు లేని ఈ ప్రాంతంలో దిగ్గజ అక్కినేని నాగేశ్వరరావు అన్నపూర్ణ స్టూడియోలను ఎలా స్థాపించారో, అప్పటి నుండి అది హైదరాబాద్‌లోని అత్యంత ముఖ్యమైన సాంస్కృతిక మరియు సినిమాటిక్ ల్యాండ్‌మార్క్‌లలో ఒకటిగా ఎలా ఎదిగిందో గుర్తుచేసుకుంటూ, సంస్థ యొక్క గొప్ప వారసత్వాన్ని భట్టి విక్రమార్క ప్రశంసించారు. అన్నపూర్ణ కళాశాలలో ప్రపంచ స్థాయి చలనచిత్ర విద్య ద్వారా ఈ దార్శనికతను ముందుకు తీసుకెళ్లడంలో నాగార్జున అక్కినేని, అమల అక్కినేని విజన్ ను ఆయన అబినందించారు. అన్నపూర్ణ కళాశాల విద్యార్థులు రూపొందించిన రోల్ నంబర్ 52ని నేను చూశాను. నాకు ఎంతగానో నచ్చింది, మనసుని హత్తుకునే మంచి సినిమా తీసినందుకు దర్శకుడిని వారి టీమ్ ను అభినందిస్తున్నాను. అన్నపూర్ణ కళాశాలలో ఎందరో ప్రతిభావంతులు, వారి ప్రతిభ గురించి అక్కినేని నాగార్జున స్వయంగా నాతో మాట్లాడారు, అదే నన్ను ఇన్స్పైర్ చేసింది. మీ అందరిని కలవడానీకే ఇక్కడికి వచ్చానని అన్నారు. అక్కినేని నాగార్జున మాట్లాడుతూ ' నా తండ్రి తెలుగు చిత్ర పరిశ్రమను చెన్నై నుండి హైదరాబాద్‌కు తరలి వచ్చినపుడు ఆయన విజన్ కు అనుగునంగా అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించబడింది. నేడు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో భారతదేశంలోని అత్యుత్తమ సంస్థలలో అన్నపూర్ణ స్టూడియోస్ ఒకటిగా నిలిచింది. అన్నపూర్ణ కళాశాల భవిష్యత్ కథకులను పెంపొందించాలనే తన కలను కొనసాగిస్తోంది. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ రోజు మా స్టూడియోస్ ను సందర్శించడం మాకు గౌరవంగా ఉంది. ప్రపంచ సినిమాలో తెలంగాణ వృద్ధికి మద్దతు ఇవ్వడానికి మేము ఎప్పుడు రెడీగా ఉంటామమని అన్నారు. అనంతరం డిప్యూటీ ముఖ్యమంత్రి అన్నపూర్ణ స్టూడియోస్, సౌండ్ / విజన్ భారతదేశంలో మొట్టమొదటి డాల్బీ ఫెసిలిటీ సినిమాను కూడా సందర్శించారు. ప్రపంచ స్థాయి సౌకర్యాలు మరియు అత్యాధునిక సాంకేతికత వివరాలు అడిగి తెల్సుకుని నాగార్జునను మెచ్చుకున్నారు.



# రాష్ట్రపతికి గవర్నర్, సీఎం వీడ్కోలు

## రేవంత్‌తో మధ్యప్రదేశ్ సీఎం యాదవ్ భేటీ

**హైదరాబాద్,నవంబర్ 22:** హైదరాబాద్‌లో రాష్ట్రపతి ముర్ము పర్యటన ముగిసింది. ఒకరోజు పర్యటన కోసం వచ్చిన ఆమె శనివారం మధ్యాహ్నం ఇక్కడి నుంచి పుట్టపర్తికి బయలుదేరి వెళ్లారు. బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డిలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సీఎం జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మేయర్ విజయలక్ష్మి కూడా పాల్గొన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌ను మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ కలుసుకున్నారు. మర్యాదపూర్వకంగానే కలిసినట్లు తెలిపారు. యాదవ్‌ను సీఎం సాదరంగా ఆహ్వానించారు.

# పెళ్లి కాకముందే తల్లయిన యువతి

## పుట్టిన బిడ్డను అమ్మేందుకు యత్నించి భంగపాటు



**కరీంనగర్, నవంబర్ 22:** ఈ మధ్య కాలంలో శిశువు విక్రయాలు ఎక్కువయ్యాయి. అక్రమ సంబంధం ద్వారా పుట్టిన బిడ్డను అమ్మేసేందుకు ప్రయత్నిస్తుంటారు కొందరు మహిళలు. మరికొన్ని చోట్ల బిడ్డను పోషించే స్థోమత లేక అమ్మకానికి పెట్టేస్తున్నారు. ఇఓ మహిళ కూడా ఇలాంటి దారుణానికే పాల్పడింది. అప్పుడే పుట్టిన బిడ్డను విక్రయించేందుకు ప్రయత్నించి చివరకు ఊచలులెక్కబెడుతోంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో యువతి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ యువతి ఓ వ్యక్తిని ప్రేమించింది. ప్రేమికుడి కారణంగా గర్భవతి అయిన యువతి.. మగబిడ్డకు జన్మనిచ్చింది. కానీ అతడు మోసం చేయడంతో బిడ్డను ఎలా పోషించాలో తెలియక దారుణ నిర్ణయిం తీసుకుంది. తనకు పుట్టిన బిడ్డను అమ్మకానికి పెట్టింది. ఏకంగా ఆరు లక్షలకు శిశువును విక్రయించేందుకు బేరం కుదిరింది. బిడ్డను విక్రయించేందుకు కొంతమంది మధ్యవర్తులుగా వ్యవహరించారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చాకినివానిపల్లెకి చెందిన రాయమల్లు, లత దంపతులకు శిశువు విక్రయానికి ఒప్పందం కుదిరింది. విషయం తెలిసిన బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన కరీంనగర్ టూ టౌన్ పోలీసులు.. శిశువు విక్రయాన్ని అడ్డుకున్నారు. శిశువును అమ్మేందుకు సహకరించిన 15 మందిని అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మరోమారు షాక్ ఇచ్చిన బంగారం

## ఒక్కరోజే పది గ్రాములపై 1800 పెరుగుదల

**హైదరాబాద్,నవంబర్22:** బంగారం ధరలుగతం పోల్చుకుంటే శనివారం భారీగా పెరిగాయి. ఒక్క రోజులోనే ఏకంగా పది గ్రాములపై 1800 రూపాయలు పెరిగింది. శుక్రవారం పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,23,980 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 22 క్యారెట్ల బంగారం ధర 1,13,650 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 18 క్యారెట్ల ధర 92,900 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బంగారం ధరలు ఇలా ఉన్నాయి..పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,25,840 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల ధర 1,15,350 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 18 క్యారెట్ల బంగారం ధర 94,380 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక, వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. 100 గ్రాములపై 300, కేజీపై 3 వేల రూపాయలు పెరిగింది. నిన్న(శుక్రవారం) 100 గ్రాముల వెండి ధర 16,100 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,61,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో 100 గ్రాముల వెండి ధర 16,400 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ ధర 1,64,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది.

# పుట్టపర్తి చేరుకున్న రాష్ట్రపతి

**పుట్టపర్తి,నవంబర్22 :** సత్యసాయి బాబా శత జయంతోత్సవాలలో పాల్గొనడానికి శనివారం ఉదయం పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా, ఐటీ శాఖ మంత్రి లోకేష్, మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రి సత్యకుమార్ యాదవ్, మంత్రి ఎస్.సవిత, మంత్రి కందుల దుర్గేష్, హిందూపురం ఎంపీ బికే. పార్థసారథి, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, పుట్టపర్తి ఎమ్మెల్యే లు కలిసి రాష్ట్రపతికి సాదర స్వాగతం పలికారు. అనంతరం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ఉన్న సత్యసాయి బాబా మహాసమాధికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి లోకేష్, తదితరులు నివాళు లర్పించారు. ప్రశాంతి నిలయంలోని ఆలయంలో రాష్ట్రపతి ప్రార్థించారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..





సంపాదకీయం

# సుప్రీం తీర్పు.. గవర్నర్ల వ్యవహారం!

పదవీ విరమణ చేయబోతున్న సమయంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ బుధ, గురు వారాల్లో రెండు రాజ్యాంగ ధర్మాసనాలకు నేతృత్వం వహించి తీర్పులిచ్చారు. రాష్ట్రపతి న్యాయ సలహా కోరిన అంశంపై గురువారం ఏకాభిప్రాయంతో తీర్పు సంచలనంగానే పేర్కొనాలి. ఎందుకంటే తమిళనాడు కు సంబంధించిన పలు బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా తొక్కిపెడుతుండటంతో అక్కడి ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు గవర్నర్‌ను ఆదేశించింది. బిల్లులను తొక్కిపట్టే విధానాన్ని తప్పుబట్టింది. అయితే, గవర్నర్ మాత్రం బిల్లులను ఆమోదించలేదు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు ద్విసభ్య బెంచ్ ఈ ఏడాది ఏప్రిల్ 8న సంచలన తీర్పు వెలువరించింది. గవర్నర్ రాజ్యాంగ విరుద్ధంగా పది బిల్లులను నిరవధికంగా తొక్కిపట్టారని ప్రకటించింది. రాజ్యాంగ విధుల్లో విఫలయ్యారని, రాజ్యాంగబద్ధ పాలన కూలిపోయే పరిస్థితి కల్పించారని మండిపడింది. బిల్లులు తిప్పిపంపకుండా దగ్గర పెట్టుకోవడం కుదరదని చెప్పింది. తిప్పి పంపిన తర్వాత మళ్లీ శాసనసభ ఆమోదిస్తే గవర్నర్ ఆమోదించాల్సిందేనని స్పష్టం చేసింది. గవర్నర్‌కు పంపిన బిల్లులు ఆమోదం పొందినట్లుగా పరిగణిస్తున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మే 13న రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టును 14 ప్రశ్నలతో న్యాయ సలహా కోరింది. వాటికి సుప్రీంకోర్టు గురువారం సమాధానం ఇచ్చింది. వాదనల సమయంలో ఏప్రిల్ 8 నాటి సుప్రీంకోర్టు తీర్పును తోసిపుచ్చే ఉద్దేశం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పదేపదే చెప్పారు. గురువారం నాటి తీర్పు కాపీలోనూ... మరో తీర్పును తోసిపుచ్చేందుకు రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సలహా కోరడాన్ని ఉపకరణంగా వాడటం కుదరదని పేర్కొంది. ప్రత్యేకించి కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు ఆయా ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కొంత పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రధానంగా బిల్లుల ఆమోదం విషయంలో వారు సకాలంలో నిర్ణయం తీసుకోవడం లేదు. లేదా తిప్పి పంపడం లేదు. ప్రధానంగా బెంగాల్, తమిళనాడు, తెలంగాణల్లో ఇలాంటి పరిస్థితులను చూశాం. అయితే రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లుల ఆమోదంలో గడువు విధించడం తగదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఇటీవలే తేల్చిచెప్పింది. ఈ తీర్పుతో ఇప్పుడు గవర్నర్ల వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉన్నా ప్రశ్నించే అవకాశం లేకుండా పోయింది. అలాగే బిల్లులను సకాలంలో పంపాలన్న నిబంధన లేకపోతే వారు రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనం చెలాయిస్తారని తమిళనాడు, బెంగాల్ తదితర రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో పార్లమెంట్ దీనిపై చర్చించాల్సి ఉంది. గవర్నర్లకు ఉండే వెసలుబాటులోనూ సమయాభావన ఉండాలన్న దానిపై చర్చించాలి. అవసరమైతే చట్టపరంగా మార్పులకు శ్రీకారం చుట్టాలి.అప్పుడే రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలకు ఆమోదం దక్కుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లుల ఆమోదంలో గవర్నర్ సొంత విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చని కూడా స్పష్టం చేసింది. అయితే, గవర్నర్ ఎటువంటి కారణం చెప్పకుండా నిరవధికంగా ఆలస్యం చేయడం తగదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చంద్రశేఖర్ సభ్యులుగా ఉన్న ధర్మాసనం అభిప్రాయ పడింది. ఒక బిల్లు గవర్నర్ దగ్గరికి వచ్చినప్పుడు అన్నీ పరిశీలించి సమ్మతి తెలియ జేయడం లేదా ఏదైనా సహేతుకమైన కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం చేయాలి. లేదా బిల్లును తిరస్కరించి తిరిగి అసెంబ్లీకి పంపడం చేయాలి. కానీ చాలా సందర్భాల్లో అలా జరగడం లేదు. తమిళనాడు గవర్నర్ రవి ఇలాంటి నిబంధనలు పక్కన పెట్టారు. తెలంగాణ గవర్నర్‌గా ఉన్న సమయంలో తమిళసై సైతం ఇదే ధోరణితో ఉన్నారు. ప్రభుత్వాలు ఏదైనా నిర్ణయం తీసుకుంటే సకాలంలో ఔనని లేదా కాదని చెబితే బాగుండేది. కానీ దానిపై సమాధానం ఇవ్వక పోవడం అన్నది, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేదే తప్ప మరోటి కాదు. అయితే ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో రాజ్యాంగంలోని 200 నిబంధన కింద గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారని, అటువంటి సమయంలో న్యాయస్థానాలు గడువు విధించడం సరికాదని సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయ పడింది. ఇకపోతే తన పరిశీలనకు వచ్చిన ప్రతి బిల్లుపై రాష్ట్రపతి రాజ్యాగంలోని 143వ అధికరణం కింద సుప్రీంకోర్టు సలహా కోరనవసరం లేదు. గవర్నర్లు నిరవధికంగా ఒక బిల్లును తమ వద్ద ఉంచుకోరాదు అనేదే ప్రధానం. అందువల్ల పరిమితమైన న్యాయ సమీక్ష ఉండవచ్చని రాజ్యాంగ ధర్మాసనం తన ఏకగ్రీవ తీర్పులో అభిప్రాయపడింది. రాజ్యాంగంలో బిల్లును సాధ్యమైనంత త్వరగా ఆమోదించాలని ఉన్నప్పటికీ దాన్ని గవర్నర్లకు, రాష్ట్రపతికి డెడ్‌లైన్ పెట్టేందుకు రాజ్యాంగం ఇచ్చిన అనుమతిగా భావించనక్కరలేదని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. డెడ్‌లైన్ పెట్టి, ఆలోగా ఆమోదం ఇవ్వకపోతే లభించినట్లుగానే భావించడం రాజ్యాంగంలోని అధికారాల విభజన సూత్రానికి భంగం కలిగిస్తుందని తెలిపింది. మొత్తంగా గవర్నర్లకు ఇప్పుడు విచక్షణ ఉందని తేల్చింది. అంటే బిల్లులను ఎంతకాలమైనా పెండింగ్‌లో పెట్టుకునే అవకాశం ఉంది. అయితే అది ఎంతకాలం అన్న చర్చ జరగాలి. లేదా దానికి కూడా పరిమిత కాలం అంటూ ఉండాలి. అప్పుడే గవర్నర్ల పెత్తనం అతిగా ఉండదు. తమిళనాడు వ్యవహారం, సుప్రీం తీర్పు నేపథ్యంలో గవర్నర్లకు సంబంధించి తప్పకుండా చర్చచేయాల్సి ఉంది. ఇందుకు పార్లమెంట్ పూనుకోవాలి. ఇలాంటి విషయాల్లో విపక్షపార్టీ సభ్యులు చర్చకు పట్టుబట్టాలి. అప్పుడు సమస్యకు మార్గం దక్కగలదు.

# ప్రపంచ సంరక్షుడిగా హిందూ సమాజం

- హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచానికే ప్రమాదం
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్





**ఇంఫాల్, నవంబర్ 22:** ప్రపంచాన్ని నిలబెట్టడంలో హిందూ సమాజం కీలకమని రాష్ట్రీ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచానికే ఉనికి ఉండదని పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రతి దేశం అన్ని రకాల పరిస్థితులను చూసిందని, యునాన్ (గ్రీస్) మిస్ర్ (ఈజిప్టు), రోమ్ వంటి సామ్రాజ్యాలు, నాగరికతలు కనుమరుగైనా హిందూ సమాజం చెక్కుచెదరలేదని చెప్పారు. జాతుల మధ్య ఘర్షణలతో ఇటీవల కాలంలో అట్టుడికిన మణిపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మోహన్ భాగవత్ మాట్లాడుతూ, హిందూ సమాజం ధర్మానికి ప్రపంచ సంరక్షుడిగా ఉందన్నారు. భారత్ అంటే అమర నాగరికతకు పేరని, సమాజంలో అలాంటి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నందునే హిందూ కమ్యూనిటీ చెక్కుచెదరకుండా ఉందని, హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచమే ఉనికి కోల్పోతుందని అన్నారు. ఇండియాలో ఉన్నవారంతా హిందువులేనని, హిందూ వారసత్వానికి చెందినవారే ముస్లింలు, క్రిస్టియన్లని చెప్పారు. దేశ పటిష్టతకు ఆర్థిక స్వావలంభన చాలా కీలకమని మోహన్ భాగవత్ అన్నారు. దేశ నిర్మాణంలో మిలటరీ సామర్థ్యం, నాలెడ్జ్ కెపాసిటీకి సమ ప్రాధాన్యత ఉందని చెప్పారు. దేశ నిర్మాణం జరగలాంటే బలం కావాలని, బలం అంటే ఆర్థిక సామర్థ్యమని చెప్పారు. ఆధిపత్యం అనే పదానికి ఒక్కోసారి విపరీత అర్థం వస్తుందన్నారు. అయితే మన దేశ ఆర్థిక వ్యవస్థ ఎవరిపైనా ఆధారపడకూడదని అన్నారు. ఇదేమంత కష్టమైన పని కూడా కాదని చెప్పారు. నక్సలిజం తగ్గుముఖం పట్టడంపై మాట్లాడుతూ, నక్సలిజాన్ని ఇంకెంత మాత్రం సహించేది లేదని సమాజం నిర్ణయించుకోవడమే ఇందుకు కారణమని అన్నారు. బ్రిటిష్ వారిపై జరిగిన స్వాతంత్ర్య పోరాటాన్ని ఈ సందర్భంగా ఆయన ఉదహరించారు. 'బ్రిటిష్ సామాజ్యంలో రవి అస్తమించడు. కానీ ఇండియాలో వారి సూర్యుడు అప్పటికే అస్తమించాడు. 90 ఏళ్లపాటు ప్రయత్నాలు సాగించాం. అణచివేతకు ఎన్నడూ తలవంచలేదు. కొన్నిసార్లు మన గళం బలహీనంగా ఉండి ఉండవచ్చు, కొన్ని సార్లు బలంగా వినిపించి ఉండవచ్చు. కానీ మన గళం ఎన్నడూ మూగవోలేదు' అని మోహన్ భాగవత్ వివరించారు.

# దేశంలో పేలుళ్లకు జైషే కుట్రలు

**ఆత్మాహుతి బాంబర్ ఉమర్‌కు నిధులు**

**డాక్టర్లే నిధులు సమకూర్చారని గుర్తింపు**



**న్యూఢిల్లీ, నవంబర్ 22:** ఢిల్లీ పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరమవుతున్న కొద్దీ పలు కీలక విషయాలు వెలుగు చూస్తున్నాయి. జైషే ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ దేశవ్యాప్తంగా దాడులకు 2023 నుంచి కుట్రలు పన్నుతున్నట్టు సమాచారం ఇప్పటికే వెలుగులోకి రాగా, ఢిల్లీ పేలుడు కేసులో నిందితులుగా ఉన్న డాక్టర్లే స్వయంగా సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్‌కు నిధులు సమకూర్చినట్టు తాజాగా వెలుగుచూసింది. కేసులో నిందితులైన డాక్టర్లంతా కలిసి రూ.26 లక్షలు సమకూర్చినట్టు తెలుస్తోంది. డాక్టర్ ముజమ్మిల్ రూ.5 లక్షలు, డాక్టర్ అదిల్ అహ్మద్ రాథర్ రూ.8 లక్షలు, డాక్టర్ ముఫర్ అహ్మత్ రాథర్ రూ.6 లక్షలు, డాక్టర్ ఉమర్ రూ.2 లక్షలు, డాక్టర్ షహీన్ సాహిద్ రూ.5 లక్షలు కంటిబ్యూట్ చేసినట్టు చెబుతున్నారు. పోగుచేసిన మొత్తం సొమ్మును పేలుడు సామగ్రిని సమకూర్చేందుకు డాక్టర్ ఉమర్‌కు వీరు అందజేశారని దర్యాప్తు అధికారుల సమాచారం. అమ్మోనియం నైట్రేట్, యూరియా, ఇతర కీలక సామగ్రిని డాక్టర్ ముజమ్మిల్ సేకరించాడు. రూ.3 లక్షలతో ఎన్‌పీకే ఫెర్టిలైజర్‌ను కొనుగోలు చేశాడు. ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఫరీదాబాదాలోని రెండు మార్కెట్ల నుంచి కొన్నాడు. ఆ ఫెర్టిలైజర్‌ను పేలుడు పదార్థాలుగా డాక్టర్ ఉమర్ మహమ్మద్ మార్చాడు. పేలుడుకు అవసరమైన రసాయనాలు, రిమోట్లు, అవసరమైన పరికరాలను సమకూర్చే బాధ్యత డాక్టర్ ఉమర్ తీసుకున్నాడు. మరోవైపు, అల్-ఫయిదా యూనివర్శిటీ వ్యవహారంపై విస్తృతంగా జరిపిన ఇన్వెస్టిగేషన్‌లో ల్యాబ్ నుంచి స్టూడెంట్ ప్రాజెక్టుల పేరుతో పలు కెమికల్స్, గ్లాస్‌వేర్ చోరీ అయినట్టు తెలుస్తోంది. అమ్మోనియం నైట్రేట్, టెస్టింగ్ కిట్లు మాయమైనట్టు గుర్తించారు. నిందితులు చిన్న చిన్న మొత్తాల్లో వీటిని బ్యాగులు, వాహనాల్లో యూనివర్శిటీ నుంచి తరలించినట్టు గుర్తించారు.

# నేడు భారత్ బంద్

**మావోయిస్టుల పిలుపు.. • అప్రమత్తం అయిన పోలీసులు**



**విజయవాడ, నవంబరు 22:** మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మాద్వి హిడ్మా ఎన్‌కౌంటర్‌కి నిరసనగా ఆదివారం దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తూ పార్టీ ప్రతినిధి అభయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన రాసిన లేఖలో.. నిరాయుధులైన హిడ్మా, అతడి భార్య రాజే సహా ఆరుగురు మావోయిస్టులను ఏపీ పోలీసులు విజయవాడలో అదుపులోకి తీసుకుని ఆ తరువాత మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో కాల్చి చంపి, దానిని ఎన్‌కౌంటర్‌గా చెప్పుకున్నారని ఆరోపించారు. అనారోగ్యంతో ఉన్న హిడ్మా చికిత్స కోసం విజయవాడకు వచ్చారని, విప్లవ ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఎస్ఐబీ పోలీసులు అతన్ని పట్టుకుని.. 15న అరెస్ట్ చేసి, 18వ తేదీన హిడ్మాను బుటకపు ఎన్ కౌంటర్ చేశారని మావోయిస్ట్ పార్టీ ప్రతినిధి అభయ్ ఆరోపించారు. అలాగే, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆదివాసీ సంఘం సీనియర్ నాయకుడు మనీష్ కుంజా కూడా ఈ ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండించారు. తాడిమెట్ల, జీరంఘాట్ ఘటనల్లో మాద్వి హిడ్మా ప్రమేయం లేదని పేర్కొన్నారు. ఆంధ్రాకు చెందిన కొంత మంది పార్టీకి చెందిన నాయకులే హిడ్మా కదలికలపై పోలీసులకు సమాచారం ఇచ్చారు.. ఈ ఎన్‌కౌంటర్‌లో దేవ్‌జీ పాత్ర ఉందని తెలుస్తుందని చెప్పుకొచ్చారు. కాగా, ఈ ఎన్ కౌంటర్ ని వ్యతిరేకిస్తూ మావోయిస్టులు పెద్ద ఎత్తున నిరసనకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే భారత్ బంద్‌కి పిలుపునివ్వడంతో.. భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో పలుచోట్ల పోలీసు బందోబస్తు కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా రంపచోడవరం ఏజెన్సీ ఏరియాలో పోలీసులు అలర్ట్ అయ్యారు. ప్రజా ప్రతినిధులు ఏజెన్సీ ప్రాంతాలను విడిచి మైదాన ప్రాంతాలకు వెళ్లాలని పోలీసులు సూచనలు చేశారు.

## పార్టీకి తెలయచేసి లొంగిపోయాం

**ఇప్పుడున్న స్థితిలో ఇక ఉద్యమించలేం: ఆజాద్**

**హైదరాబాద్,నవంబరు 22:** మేం పార్టీకి చెప్పే లొంగిపోయామని మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు సాంబయ్య అలియాస్ ఆజాద్ తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో జనజీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టు పార్టీ పిలుపునిస్తుందని పేర్కొన్నారు. స్టేట్ కమిటీలో ఉన్న ఇంకా ఇద్దరు అగ్రనేతలు కూడా లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. తామంతా జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని నిర్ణయం తీసుకున్నామని దండకారణ్యం స్పెషల్ జోన్ సభ్యుడు ఎర్రా తెలిపారు. మారుతున్న పరిస్థితుల్లో ఉద్యమాన్ని నడిపించడం కష్టమని పేర్కొన్నారు. మా ఆరోగ్య పరిస్థితులు కూడా సహకరించడం లేదని చెప్పారు. మిగతా మావోయిస్టులు కూడా లొంగిపోవడం మంచిదని పిలుపునిచ్చారు.



# ఢిల్లీ పేలుళ్ల కేసులో ముమ్మర దర్యాప్తు

**శ్రీనగర్‌లో మరొకరి అరెస్ట్**

శ్రీనగర్, నవంబర్ 22: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ పేలుడు ఘటనలో దర్యాప్తు బృందాల అరెస్టుల పర్వం కొనసాగుతోంది. జైషే ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కేసుకు సంబంధించి శ్రీనగర్ నివాసి ఒకరిని జమ్మూకశ్మీర్ పోలీస్ స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ శనివారంనాడు అరెస్టు చేసింది. బతమలూ ఏరియాకు చెందిన ఇతనిని త్గు÷ల్ నియాజ్ భట్‌గా గుర్తించారు.గత అక్టోబర్‌లో నౌగామ్‌లోని బన్‌పోరలో పోలీసులు, భద్రతా సిబ్బందిని బెదిరిస్తూ పోస్టర్లు వెలిసాయి. దీనిపై శ్రీనగర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించడంతో వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ వెలుగు చూసింది. శ్రీనగర్ సీనియర్ ఎస్పీ డాక్టర్ జీవీ సుందీప్ చక్రవర్తి ఈ విచారణను పర్యవేక్షించి, సీసీటీవీ అనాలసిస్ చేపట్టడంతో మొదటి ముగ్గురి అనుమానితులు పట్టుబడ్డారు. ఆరిఫ్ నసీర్ దర్ అలియాస్ సాహిల్, యాసిర్ ఉల్ అష్రాఫ్, మక్సూద్ అహ్మద్ దర్ అలియా షాహిద్‌లను అరెస్టు చేశారు. వీరిని విచారించిన దర్యాప్తు సంస్థలు ఇర్ఫాన్ అమ్మద్ అనే మరో వ్యక్తిని పట్టుకున్నారు. అతను గతంలో పారామెడిక్‌గా పనిచేసి ఇమామ్‌గా మారాడని, పోస్టర్లు సరఫరా చేయడంతో పాటు డాక్టర్లను రాడికల్స్‌గా మార్చినట్టు గుర్తించారు. క్రమంలోనే ఫరీదాబాద్‌లోని అల్ ఫయిదా యూనివర్శిటీలో సోదాలు నిర్వహించారు. డాక్టర్ ముజఫర్ గనాయే, డాక్టర్ షహీన్ సయీద్‌లను అరెస్టు చేసి 2,900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ గనాయ్, కారు పేలుడులో చనిపోయిన సూసైడ్ బాంబర్ ఉమర్ నబి, ముజఫర్ రాథెర్‌లతో కూడిన కోర్ గ్రూప్ ఈ పేలుడు కుట్రకు ప్రధాన కారణమని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ముజఫర్ రాథెర్ పరారీలో ఉన్నాడు.







# ఖరీదైన 'పందికొక్కులు'!

## తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రూ.10 వేల కోట్ల 'సీఎమ్ఆర్' పక్కదారి

- ఒక్క జగిత్యాల జిల్లాలోనే రూ.వెయ్యి రెండు కోట్ల బియ్యం మాయం
- 'సమాచారహక్కు చట్టం' ద్వారా వెలుగులోకి..
- 'సివిల్ సప్లై' ధాన్యానికి 'బియ్యం' గడువులోగా ఇవ్వకుంటే 'డిఫాల్ట్ రైస్ మిల్లు'గా గుర్తింపు
- ఆర్ఆర్ కేసు.. క్రిమినల్ కేసు.. రైస్ మిల్లు.. ఆస్తుల సీజ్.. బ్యాంకు అకౌంట్ల ఫ్రీజ్
- కానీ, జగిత్యాల జిల్లాలో విరుద్ధం - 'విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్' దాడుల్లో ధాన్యం మాయమైనట్టు గుర్తించినా చర్యలు శూన్యం
- మళ్లీ అవే 'అక్రమాలకు' పాల్పడుతున్న రైస్ మిల్లులకు 2025 ఖరీఫ్ ధాన్యం కేటాయింపులు
- జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనూ 'డీ ఫాల్టర్ల' రికార్డులు లేవంట?
- రూపాయి 'పెట్టుబడి' పెట్టకుండా కోట్ల విలువైన 'అక్రమ దందా'
- 'రైస్ మిల్లర్లు'-'సివిల్ సప్లై అధికారులు' అందరూ కుమ్మక్కే!
- అడపాదడపా వచ్చే 'తనిఖీ' అధికారుల 'జేబులూ-బరువు'తోనే వెళ్తాయి
- ఈ 'సీఎంఆర్' అక్రమ దందాలో 'పాత్రధారులు' రైస్ మిల్లర్లైతే.? మరి 'సూత్రధారులె'వరు.!?
- విస్తుపోయే వివరాలతో 'నేటి సాక్షి'.. 'ఎక్స్‌క్లూజివ్' కథనాలు 'మొదటి ఎపిసోడ్ మీకోసం

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)**

తెలంగాణ రాష్ట్రంలోని 3000 రైస్ మిల్లుల్లో..'ఖరీదైన పందికొక్కులు' తిష్టవేసి రూ.10 వేల కోట్ల విలువైన బియ్యాన్ని కడుపారా బుక్కేసారు.! ప్రతీ యేటా రెండు సీజన్లలో 'సీఎంఆర్-బియ్యం'..'సివిల్ సప్లై గోదాం'లకు చేరాల్సి ఉండగా పక్కదారి పట్టింది.! రాష్ట్ర వ్యాప్తంగా 800 మంది రైస్ మిల్లర్లు ఈ 'బియ్యం బుక్కినట్టు' .. 'విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్' అధికారులు తనిఖీలు వారి బండారాన్ని బయట పెట్టారు.వారు గుర్తించిన రైస్ మిల్లర్లను 'ప్రభుత్వం డిఫాల్టర్లుగా గుర్తించారు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 'డిఫాల్టర్ రైస్ మిల్లర్ల'కు మళ్లీ ఏ సీజన్‌లోనూ సీఎంఆర్ ధాన్యం కేటాయించకూడదు..పైగా 'నేరస్తులు'గా గుర్తించి కేసులు పెట్టాల్సి ఉంటుంది. కాగా.. అధికారులు తాము చెప్పి 'అగ్రిమెంట్' చేయించుకున్న నిబంధనలను తామే తుంగలో తొక్కి ఈ సీజన్లోనూ ధాన్యం కేటాయించడం వెనక 'ఈ టోటల్-అక్రమ దందా'లో అందరూ కీలక భాగస్వామ్యులేనన్నది తేటతెల్లమైంది.ఇందులో భాగంగానే 'సమాచార హక్కు'చట్టం ద్వారా ఏ రైస్ మిల్లర్ ఎన్ని కోట్ల 'బియ్యం బుక్కిండ్రో' అధికారిక సాక్ష్యం లభించింది. ఆ 'స.హ.చట్టం' ద్వారా అందిన వివరాలు 'నేటి సాక్షి' ద్వారా మీకోసం...




## ఒక్క జగిత్యాల జిల్లాలో రూ.1002 కోట్ల గోల్ మాల్

కాగా..రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన వడ్లను మిల్లుల ద్వారా బియ్యంగా మార్చి వాటిని పేదలకు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన సీఎంఆర్ ప్రక్రియను కొందరు రైస్ మిల్లర్లు అక్రమ సంపాదనకు మార్గంగా మార్చుకుంటున్నారు. రూపాయి కూడా పెట్టుబడి లేకుండా మిల్లులకు వచ్చిన వడ్లతో పాటు ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ కోట్లు దండుకుంటున్నాన్నారు.అయితే..ఒక్క జగిత్యాల జిల్లాలో 2022-23 రబీ సీజన్ లో వరి ధాన్యం బకాయిలు 50 మంది మిల్లర్ల నుంచి 92251.169 మెట్రిక్ టన్నులకు గాను రూ.225 కోట్ల 27 లక్షల బకాయిలు పెండింగ్ లో ఉండిపోయాయి.సివిల్ సప్లై గోదాం లకు వెళ్లాల్సిన బియ్యం 'బ్లాక్ మార్కెట్'కు తరలించి కోట్లు దండుకున్నారు.మూడేళ్ల ఆరు నెలల సమయం గడిచినా పౌరసరఫరాల శాఖ అధికారులు మిల్లర్ల నుంచి వసూలు చేయడంలో విఫలమవుతున్నారు.ఈ మిల్లర్ల వద్ద ఒక్క బస్తా తామిచ్చిన 'వరి ధాన్యం బస్తా' కానీ..'మిల్లింగైన బియ్యం బస్తా' కానీ లేవన్నది తనిఖీల్లో నిరూపనైనా చర్యలు శూన్యం.ఇదేవిధంగా..2024-25 ఖరీఫ్ సీజన్లో 56 మంది మిల్లర్ల నుంచి 49,020.130 మెట్రిక్ టన్నుల ధాన్యం విలువ రూ.114 కోట్లు ప్రభుత్వానికి బకాయిపడ్డారు. వీరికి పౌరసరఫరాల శాఖ 2025 30 తారీఖు వరకు గడువు కూడా ఇచ్చింది.ఈ క్రమంలోనే 2024-25 రబీ సీజన్ వచ్చింది.ఈ సీజన్ లో 96 మంది మిల్లర్ల నుంచి 2,80,674.459 మెట్రిక్ టన్నులకు గాను రూ.662 కోట్ల 74 లక్షలు బకాయిలు రావాల్సి ఉన్నాయని 'సమాచార హక్కు చట్టం' ద్వారా వెలుగులోకి వచ్చాయి.వీరికీ 12 నవంబర్ 2025 వరకు ప్రభుత్వం చివరి గడువు ఇచ్చింది. అయితే ఈ మూడు సీజన్ లలో ఈ మిల్లర్లు రూ.1002 కోట్ల విలువైన బియ్యాన్ని..వరి ధాన్యాన్ని ఇచ్చిన 'పౌరసరఫరాల శాఖ' కు ఇవ్వకుండా 'బ్లాక్ మార్కెట్'కు తరలించి కోట్లు గడించారు. బకాయిల వసూళ్లకు 'సివిల్ సప్లై శాఖ'కు ఈ 'ఖరీదైన మిల్లర్లు' చుక్కలు చూపిస్తున్నారు.



## అప్పులు తెచ్చి.. రైతుల వద్ద ధాన్యం కొనిస్తే..

ప్రతీ సీజన్ లో..'సివిల్ సప్లై శాఖ' తమ వద్ద నిధులు లేకున్నా ప్రభుత్వం అప్పులు తెచ్చి మరీ రైతుల నుంచి ధాన్యం కొని.. రైస్ మిల్లులకు కేటాయిస్తుంటే.. బియ్యం మాత్రం తిరిగి పౌరసరఫరాల శాఖకు చేరడం లేదు. దీనిని తీవ్రంగా పరిగణించాల్సి ఉన్నా.. అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లుగానే వ్యవహరిస్తున్నారు. ఒక సీజన్లో కేటాయించిన ధాన్యానికి సంబంధించిన బియ్యం ఇచ్చిన తర్వాతే.. మరో సీజన్లో కేటాయించాల్సి ఉంటుంది. కానీ.. రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం తిరిగి ఇవ్వకపోయినా.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చర్చనీయంగా మారింది.




### ప్రభుత్వంతో మిల్లర్లతో ముందే 'అగ్రిమెంట్'.!

పౌరసరఫరాల శాఖ మిల్లర్లతో చేసుకున్న 'అగ్రిమెంట్' ప్రకారం సీఎంఆర్ డెలివరీలో విఫలమైతే.? అంటే తాము తీసుకున్న ధాన్యానికి సరిపడా 67 శాతం బియ్యాన్ని ఖచ్చితంగా సివిల్ సప్లై గోదాం లకు పంపించాల్సిందే.! ఒకవేళ బియ్యం పంపకపోతే.. ప్రభుత్వం ఇచ్చిన ధాన్యమైనా గోదాం లలో నిల్వ చేయబడి ఉండాలి.సీఎంఆర్ డెలివరీలో విఫలమైన మిల్లర్లకు రెవెన్యూ రికవరీ చట్టంతో కఠిన చర్యలు తీసుకుంటామని ఆ అగ్రిమెంట్'లో ఉంటుంది.ఈ నేపథ్యంలో..సీఎంఆర్ సరఫరాలో డిఫాల్ట్ చేసిన రైస్ మిల్లర్లపై ప్రభుత్వం కఠిన విధానాన్ని అమల్లోకి తెచ్చింది. మిల్లులో పడ్డ ధాన్యం వేలం, 125% చెల్లింపులు, 12% వడ్డీ, క్రిమినల్ కేసులు.. ఇలా పలు చర్యలను ఆదేశిస్తూ తాజా మార్గదర్శకాలు విడుదలయ్యాయి.

### మిల్లులో ధాన్యం ఉన్నట్టయితే..?

డిఫాల్ట్ చేసిన మిల్లులో ఇంకా బ్యాలెన్స్ పడ్డ ధాన్యం ఉన్నపక్షంలో, జిల్లా కలెక్టర్ స్వయంగా ఆ ధాన్యాన్ని స్వాధీనం చేసుకుని పబ్లిక్ వేలం ద్వారా అమ్మకానికి పెట్టాలని ఆదేశించారు. ఈ వేలంలో సంబంధిత డిఫాల్ట్ మిల్లర్‌కు పాల్గొనే అవకాశం ఉండదని స్పష్టం చేశారు.అలాగే, డెలివరీ చేయలేకపోయిన సీఎంఆర్ విలువను 125% రేటుకు, పైగా 12% వార్షిక వడ్డీతో వసూలు చేయనున్నారు. వేలం నిర్వహణకు అయ్యే ఖర్చు, ప్రభుత్వం భరించిన ఇతర వ్యయాలన్నీ కూడా కలుపుకొని వసూలు చేస్తారు. వేలంలో వచ్చిన మొత్తాన్ని తగ్గించిన తరువాత మిగిలిన డీఫాల్ట్ విలువ కోసం రాష్ట్ర పూల్ OMSS/Non-NFSA రేట్ల ప్రకారం సమాన పరిమాణంలో బియ్యం కూడా వసూలు చేసుకునే అధికారం ప్రభుత్వానిదే.ఈ మొత్తం మీద పెనాల్టీ మాఫీ చేసుకోవాలనే అభ్యర్థనను ఎట్టి పరిస్థితుల్లోనూ వినరని స్పష్టం చేశారు.పై చర్యలతో పాటు, సివిల్ సప్లైస్ శాఖ కమిషనర్, TSCSCL అధికారులు ఆ మిల్లర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు భవిష్యత్ సీఎంఆర్ కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం కూడా రద్దు చేయనున్నారు. అవసరమైతే మిల్లర్‌తో పాటు అతని ష్యూరిటీల నుంచి కూడా నష్టపరిహారం వసూలు చేస్తారు.

### మరి.! మిల్లులో ధాన్యం లేకపోతే..?

మిల్లులో బ్యాలెన్స్ పడ్డ ధాన్యం ఏదీ అందుబాటులో లేకపోతే, డీఫాల్ట్ అయిన ధాన్యానికి సమానమైన బియ్యం విలువను 125% రేటుకు వసూలు చేస్తారు. ఇదే మోతాదులో 12% వడ్డీని కూడా జోడిస్తారు. అవసరమైతే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం ఆస్తులను కూడా అటాచ్మెంట్ చేసే అవకాశం ఉంది. ఈ సందర్భంలో కూడా పెనాల్టీ మాఫీ అనే అంశం వినబడదని ప్రభుత్వం స్పష్టం చేసింది.మొత్తం మీద సీఎంఆర్ డెలివరీలో డీఫాల్ట్ చేసిన మిల్లర్లపై ప్రభుత్వం అత్యంత కఠిన వైఖరి అవలంబిస్తోంది.

### ఐతే.! డిఫాల్ట్ మిల్లర్ల పై ప్రేమ ఎందుకో.?

2024 - 2025 ఖరీఫ్ (వానకాలం ) కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీ ఎం ఆర్ ) డెలివరి గడువు 31.10.2025 నాడు ముగిసింది.2024 - 2025 రబీ (ఎండాకాలం ) కస్టమ్ మిల్లింగ్ రైస్ డెలివరి గడువు 12.11.2025 నాడు ముగిసింది.కానీ.. రెండు పంటలకు రైస్ డెలివరి కావాల్సిన ఎక్స్టెన్షన్ ఉత్తర్వులు ఇంతవరకు రాలేదు. అంటే గడువు తీరిన తర్వాత బియ్యం డెలివరి చేయని మిల్లర్లు సిస్టమ్ ప్రకారం డిఫాల్టర్ జాబితాలోకి వెళ్లినట్లే.! అలాంటి మిల్లర్ల వద్ద నుండి బియ్యం సేకరించాలంటే వారి వద్ద నుండి 25 శాతం జరిమానా మరియు 12 శాతం వడ్డీతో సహా వసూలు చేయాలి. అటువంటి మిల్లర్లకు 2025 - 2026 వానకాలం వడ్లను కేటాయించరాదనీ ప్రభుత్వ ఉత్తర్వులు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. కానీ జగిత్యాల జిల్లాలో పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతారు చేస్తూ మిల్లర్ల నుండి లోపాయికరి ఒప్పందాలు చేసుకుంటూ వారి నుండి ఆమ్యామ్యాలకు అలవాటు పడి గడువులోగా బియ్యం డెలివరి చేయని మిల్లర్లకు వడ్ల అలాట్మెంట్ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 2022 - 2023 ఎండాకాలం, 2024 - 2025 వానాకాలం మరియు 2024 - 2025 ఎండాకాలం మూడు సీజన్ లకు చెందిన 1002 కోట్ల రూపాయల విలువ గల బియ్యం బకాయిలను రాబట్టడంలో పౌరసరఫరాల శాఖ అధికారులు మిల్లర్లతో కుమ్మక్కయి ఘోరంగా విఫలం అయ్యారు. అంతేకాకుండా మళ్ళీ ఇప్పటి 2025 - 2026 వానాకాలం సీజన్ కు చెందిన దాదాపు 800 నుండి 1000 కోట్ల వడ్లను మళ్ళీ అదే డిఫాల్టర్ మిల్లులకు కేటాయిస్తున్నారు. ప్రభుత్వానికి చేరాల్సిన సొమ్మును తమ సొంతానికి వినియోగించుకున్న రైస్ మిల్లర్ల పైన ఎలాంటి చట్ట పరమైన చర్యలు లేవు.'800 రైస్ మిల్లుల్లో' తిష్టవేసిన ఈ 'పందికొక్కులు' మెక్కిన రూ.1002 కోట్లను వారి నిండి 'పెనాల్టీ'లతో సహా వసూలు చేసి ప్రభుత్వ ఖాజానాకు జమకట్టాల్సిన అవసరం ఉంది.

### రైస్ మిల్లర్లు-అధికారుల కుమ్మక్కు

'ఇంటి దొంగలను ఈశ్వరుడైన పట్టుకోలేడన్నట్టు..'ఇక్కడ అందరూ దొంగలే.! గత అయిదు నెలల నుండి ఎఫ్సీఐ మరియు విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు జగిత్యాల జిల్లాలో వివిధ రైస్ మిల్లులలో జరిపిన తనిఖీలలో ధాన్యం నిలువలు తక్కువగా ఉన్నాయని నివేదికలు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు ఇచ్చినా గానీ వారి పై ఎలాంటి చట్ట పరమైన చర్యలు చేపట్టకపోవడం లో ఆంతర్యం ఏమిటి.? నిలదీసి అడిగిన కొంతమంది మిల్లర్ల పై పగబట్టి కేసులు చేసిన సంఘటనలు జగిత్యాల జిల్లాలో కొన్ని ఉదాహరణలుగా ఉన్నాయి. చట్టం అన్ని మిల్లులకు ఒకేలాగా ఉంటుంది గానీ అడిగిన మిల్లర్లకు ఒకలా.? అడగని మిల్లర్లకు మరోలా ఉండదుగా? అందుకే గడువు లోగా బియ్యం డెలివరి చేయకుండా కోట్ల రూపాయల బకాయిలు ఉన్న జగిత్యాల జిల్లాలోని మిల్లర్ల పైన చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.మిల్లర్ల లాబీయింగ్ జిల్లా లోని అధికారుల పై రాష్ట్ర మరియి జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ నాయకుల నుండి తీవ్ర ఒత్తిడులు చేస్తూ 'డిఫాల్ట్ మిల్లర్ల'ను వెనుకేసుకస్తున్నారని సమాచారం. ఇకనైనా మిల్లర్ల ఆగడాలకు చెక్ పెట్టి ₹1002 కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం తిరిగి రాబట్టడంతో పాటు..'అగ్రిమెంట్' చట్టం ప్రకారం వారి రైస్ మిల్లులను బ్లాక్ లిస్టులో పెడుతూ 6A కింద కేసులు..బియ్యం పక్కదారి పట్టించినందుకు క్రిమినల్ కేసులు పెట్టాల్సిన ఖచ్చితమైన పరిస్థితులు చూపిస్తున్నాయి.మరి వీరి దగ్గర వారు 'కడుపునిండా-జేబునిండా' మెక్కి ఉన్నారు కాబట్టి చర్యలు ఉంటాయా.? ఉండయా.? అన్నది వేచి చూడాల్సిందే.!



నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# 'రైస్ మిల్లర్ల' 'అక్రమ దందా'

**'ఖరీదైన పందికొక్కులు' మెక్కిన రూ.1002 కోట్ల బియ్యం ● 'సమాచార హక్కు' చట్టం ద్వారా వెలుగులోకి..**



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** 'నమ్మి నావోత్తె..పుచ్చి బుర్రలు' చేసుడంటే.? ఇదిగో ఇదే.! మా దగ్గర సరిపడా 'నిల్వ గోదాం'లు లేకపోవడం వల్ల మీ 'రైస్ మిల్లు'లలోనే ధాన్యం ఉంచుకోండి.! గోదాంలు ఎట్లెట్లా ఖాళీ అయితే..అట్లట్ల 'మేం మిల్లింగ్-చేయ-ంమంటాం'.. మీరు చేసి మా 'గోదాంలలోకి' పంపించండని 'అగ్రిమెంట్' రాసుకుంటారు. అయితే..గోదాంలు సరిపోక.. ఖాళీ చేయలేక..నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారించడం వల్ల..ఇదే అదను అనుకుంటూ.. ఈ 'రైస్ మిల్లర్లు'.. ఎక్కడికక్కడ 'బియ్యాన్ని' లోడ్‌ల కొద్దీ 'బ్లాక్ మార్కెట్'కు.. ఇరుగు-పొరుగు రాష్ట్రాలకు తరలించుకుంటూ కోట్ల రూపాయలు కూడబెట్టుకున్నారు. ఎన్ని సార్లు పౌరసరఫరాల శాఖ అధికారులు అడిగినా.. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు' తనిఖీలు చేసినా 'దమ్మిడి' రాబట్టుకోలేకపోయారు.! వీరిని 'డిఫాల్టర్'లుగా గుర్తించినా కించిత్ భయం లేకుండా హాపీగా ఉన్నారు.ఎందుకంటే 'వారూ-వీరు' అంతా మిలాఖతైంద్రు గదా.? ఇంకెందుకు భయం.? దొంగలు - దొంగలు ఊళ్లు పంచుకున్నట్టు 'సిఎమ్మార్' ద్వారా 'అక్రమ దందా'లో వచ్చిన సొమ్మును అందరూ 'తిలాపాపం-తలా పిడికెడు' అన్నట్టు పంచుకున్నారన్న ఆరోపణలు కోకొల్లలు.! అందుకే 'సమాచార హక్కు' చట్టం ద్వారా జగిత్యాల జిల్లాలో ఎంత మంది రైస్ మిల్లర్లు ఎంతెంత బియ్యం మెక్కింద్రు.? ఎన్నెన్ని కోట్లు నొక్కింద్రని అడిగితే ..ఆ శాఖ వారు పంపించిన 'అధికారిక సమాచారం' ఇదే.! మూడు సీజన్‌లకు గాను మొత్తం రూ.1002 కోట్ల 'అక్రమ దందా' చిట్టా చూడండి.!



## 2022-23 రబీ సీజన్ - వరి నిల్వల పూర్తి వివరణ

రబీ 2022-23 సీజన్‌లో జగిత్యాల జిల్లాలోని 50 రైస్ మిల్లులలో కలిపి మిగిలిన వరి నిల్వల మొత్తం 92,251.769 మెట్రిక్ టన్నులు ఉంది. దీని మొత్తం విలువ రూ.225.27 కోట్ల రూపాయలు. ఈ నిల్వలలో ఎక్కువ భాగం బాయిల్డ్ (పార్‌బాయిల్డ్) వరిదే కాగా, కొన్ని మిల్లులలో మాత్రమే రా వరి నిల్వలు ఉన్నాయి.

### అత్యధిక వరి నిల్వలు కలిగిన టాప్ 10 మిల్లులు (రబీ 2022-23)

1. **ఏఆర్‌ఎస్ మంగ్లీ అగ్రో ఇండస్ట్రీస్, మొగిలిపేట**
   **బాయిల్డ్ వరి:** 12,194.355 మెట్రిక్ టన్నుల **విలువ:** రూ.29.78 కోట్లు (నం.1)
2. **శ్రీ అభయాంజనేయ సాయి ఇండస్ట్రీస్, తక్కళ్లపల్లి**
   **బాయిల్డ్ వరి:** 11,404.586 మెట్రిక్ టన్నుల **విలువ:** రూ.27.85 కోట్లు (నం.2)
3. **శ్రీ లక్ష్మీ బాలాజీ ఇండస్ట్రీస్, తక్కళ్లపల్లి**
   **బాయిల్డ్ వరి:** 6,363.992 మెట్రిక్ టన్నుల **విలువ:** రూ.15.54 కోట్లు (నం.3)
4. **గంగా భవానీ ఇండస్ట్రీస్, రంగాపూర్ (మేడిపల్లి)**
   **బాయిల్డ్ వరి:** 4,224.741 మెట్రిక్ టన్నుల **విలువ:** రూ.10.32 కోట్లు (నం.4)
5. **శ్రీ లక్ష్మీ సరస్వతి ఇండస్ట్రీస్, చెప్యాల**
   **బాయిల్డ్ వరి:** 3,529.481 మెట్రిక్ **విలువ:** రూ.8.67 కోట్లు (నం.5)
6. **కొత్త సురేష్ అగ్రో రైస్ ఇండస్ట్రీస్, సిరికొండ**
   **బాయిల్డ్ వరి:** 3,160.676 మెట్రిక్ టన్నుల **విలువ:** రూ.7.72 కోట్లు (నం.6)
7. **కొత్త శ్రీయాన్ రైస్ ఇండస్ట్రీస్, సిరికొండ**
   **బాయిల్డ్ వరి:** 2,679.982 మెట్రిక్ టన్నుల **విలువ:** రూ.6.54 కోట్లు (నం.7)
8. **వేణు ఇండస్ట్రీస్, తక్కళ్లపల్లి**
   **రా వరి:** 2,621.544 మెట్రిక్ టన్నుల **విలువ:** రూ.6.40 కోట్లు (నం.8)
9. **శ్రీ లక్ష్మీ సాయి ఇండస్ట్రీస్, చెప్యాల**
   **బాయిల్డ్ వరి:** 2,620.847 మెట్రిక్ టన్నుల **విలువ:** రూ.6.40 కోట్లు (నం.9)
10. **పద్మావతి ఇండస్ట్రీస్, తిమ్మాపూర్**
    **బాయిల్డ్ వరి:** 2,433.030 మెట్రిక్ టన్నుల **విలువ:** రూ.5.94 కోట్లు (నం.10)

### మిగిలిన ముఖ్యమైన మిల్లుల వివరాలు

| | |
|---|---|
| **వెంకట రమణ ఇండస్ట్రీస్, పూడూరు** | 2,314 మెట్రిక్ టన్నుల (5.65 కోట్లు) |
| **వాసుదేవ ఇండస్ట్రీస్, రంగాపూర్** | 2,252 మెట్రిక్ టన్నుల (5.50 కోట్లు) |
| **శ్రీనివాస పిబిఆర్‌ఎమ్, తిమ్మాపూర్** | 2,230 మెట్రిక్ టన్నుల (5.44 కోట్లు) |
| **విజయలక్ష్మీ అగ్రో ఇండస్ట్రీస్, సాతారం** | 2,104 మెట్రిక్ టన్నుల (5.14 కోట్లు) |
| **జికెఎస్ రైస్ ఇండస్ట్రీస్, సిరికొండ (రా వరి)** | 1,825 మెట్రిక్ టన్నుల (4.46 కోట్లు) |
| **విఘ్నేశ్వర అగ్రో ఇండస్ట్రీస్, మాదాపూర్** | 1,811 మెట్రిక్ టన్నుల (4.42 కోట్లు) |
| **ఎస్వీ అగ్రో ఇండస్ట్రీస్, చిన్నాపూర్** | 1,629 మెట్రిక్ టన్నుల (3.98 కోట్లు) |
| **చైతన్య ఇండస్ట్రీస్, రంగాపూర్** | 1,463 మెట్రిక్ టన్నుల (3.57 కోట్లు) |
| **శ్రీ సాయి ఇండస్ట్రీస్, యెకీన్‌పూర్** | 1,414 మెట్రిక్ టన్నుల (3.45 కోట్లు) |

### చివరి స్థానాల్లో ఉన్న మిల్లులు

| | |
|---|---|
| **శ్రీ లక్ష్మీ ఇండస్ట్రీస్, అంబారిపేట** | 82.594 మెట్రిక్ టన్నులు (0.20 కోట్లు) |
| **శ్రీ లక్ష్మీ గణేష్ ఇండస్ట్రీస్, చెప్యాల** | 32.253 మెట్రిక్ టన్నులు (0.08 కోట్లు) |

### రబీ సీజన్ లో 2022-23 గాను

మొత్తం 50 మిల్లులలో మొత్తం మిగిలిన వరి 92,251.769 మెట్రిక్ టన్నులు రూ.225.27 కోట్ల రూపాయలు.అత్యధిక నిల్వ మిల్ ఏఆర్‌ఎస్ మంగ్లీ (మొగిలిపేట) రూ.29.78 కోట్లు.అతి తక్కువ నిల్వ మిల్ శ్రీ లక్ష్మీ గణేష్ (చెప్యాల) %-% రూ. 0.08 కోట్లు..

**ఈ డేటా ప్రకారం, రబీ 2022-23 సీజన్‌లో తక్కళ్లపల్లి, చెప్యాల, రంగాపూర్, సిరికొండ, తిమ్మాపూర్, ధర్మాపురి ప్రాంతాలలోని మిల్లులే అత్యధిక వరి నిల్వలను కలిగి ఉన్నాయి. ఈ ప్రాంతాలు జగిత్యాల జిల్లాలో వరి నిల్వల కేంద్రంగా ఉన్నట్టు స్పష్టమవుతోంది.**

## రబీ 2024-25 సీజన్

### మొత్తం 96 రైస్ మిల్లుల వరి నిల్వల పూర్తి వివరణ

రబీ 2022-23 సీజన్‌లో జగిత్యాల పరిసర ప్రాంతాలలోని మొత్తం 96 రైస్ మిల్లుల్లో మిగిలిన వరి నిల్వల సమాచారం క్రింద ఇవ్వబడింది. మొత్తం మిగిలిన వరి 2,80,674.459 మెట్రిక్ టన్నులు దీని మొత్తం విలువ రూ.662.74 కోట్ల రూపాయలు

### టాప్ 10 మిల్లులు - అత్యధిక వరి నిల్వలు

1. ఏఆర్‌ఎస్ మంగ్లీ అగ్రో ఇండస్ట్రీస్, మొగిలిపేట(బాయిల్డ్) 12,194.355 మెట్రిక్ టన్నులు ₹29.78 కోట్లు
2. శ్రీ అభయాంజనేయ సాయి ఇండస్ట్రీస్, తక్కళ్లపల్లి (బాయిల్డ్) ₹ 11,404.586 మెట్రిక్ టన్నులు ₹.27.85 కోట్లు
3. శ్రీ లక్ష్మీ బాలాజీ ఇండస్ట్రీస్, తక్కళ్లపల్లి (బాయిల్డ్) 6,363.992 మెట్రిక్ టన్నులు ₹15.54 కోట్లు
4. గంగా భవానీ ఇండస్ట్రీస్, రంగాపూర్ (మేడిపల్లి) (బాయిల్డ్) 4,224.741 మెట్రిక్ టన్నులు ₹10.12 కోట్లు
5. శ్రీ లక్ష్మీ సరస్వతి ఇండస్ట్రీస్, చెప్యాల్ (బాయిల్డ్) 3,529.481 మెట్రిక్ టన్నులు ₹8.67 కోట్లు
6. కొత్త సురేష్ అగ్రో రైస్ ఇండస్ట్రీస్ (బాయిల్డ్) 3,160.675 మెట్రిక్ టన్నులు ₹7.72 కోట్లు
7. కొత్త శ్రీయాన్ రైస్ ఇండస్ట్రీస్ (బాయిల్డ్) 2,954.363 మెట్రిక్ టన్నులు ₹7.21 కోట్లు
8. జికెఎస్ రైస్ ఇండస్ట్రీస్, సిరికొండ (బాయిల్డ్) 2,679.982 మెట్రిక్ టన్నులు ₹6.54 కోట్లు
9. వేణు ఇండస్ట్రీస్, తక్కళ్లపల్లి (రా) 2,621.544 మెట్రిక్ టన్నులు ₹6.40 కోట్లు
10. శ్రీలక్ష్మీసాయి ఇండస్ట్రీస్ (బాయిల్డ్) 2,620.847 మెట్రిక్ టన్నులు ₹6.40 కోట్లు

### 11 నుండి 25 వరకు ముఖ్యమైన మిల్లులు

ఈ శ్రేణిలో పద్మావతి ఇండస్ట్రీస్ (తిమ్మాపూర్), వెంకట రమణ ఇండస్ట్రీస్ (పూడూరు), వాసుదేవ ఇండస్ట్రీస్, శ్రీనివాస పిబిఆర్‌ఎమ్ (తిమ్మాపూర్), విజయలక్ష్మీ అగ్రో ఇండస్ట్రీస్ (సాతారం), విఘ్నేశ్వర అగ్రో ఇండస్ట్రీస్ (మాదాపూర్), ఎస్వీ అగ్రో ఇండస్ట్రీస్ (చిన్నాపూర్) వంటి మిల్లులు 1,600 నుండి 2,400 మెట్రిక్ టన్నుల వరి నిల్వలతో ఉన్నాయి. ఈ మిల్లుల విలువలు ₹3.9 కోట్ల నుండి ₹5.94 కోట్ల వరకు ఉన్నాయి.

## ఖరీఫ్ 2024-25 సీజన్ - తెలంగాణలోని జగిత్యాల ప్రాంతాల్లో 56 రైస్ మిల్లులలో ఉన్న వరి నిల్వల వివరాలు

**(నవంబర్ 2025 నాటికి తాజా డేటా ఆధారంగా)**

జగిత్యాల ప్రాంతాల్లో 56 రైస్ మిల్లులలో కలిపి మొత్తం 49,020.130 మెట్రిక్ టన్నుల వరి నిల్వ ఉంది. దీని డబ్బు విలువ సుమారు రూ. 114 కోట్లు (MSP రేటు ప్రకారం లెక్క). ఇందులో ఎక్కువ శాతం రైస్ మిల్లులు రా రైస్ (Raw Rice) తయారు చేసేవి కాగా, కొన్ని మిల్లులు బాయిల్డ్ బియ్యం (Boiled/Parboiled) తయారు చేస్తున్నాయి.

### టాప్-10 అతి పెద్ద నిల్వలు కలిగిన మిల్లులు

1. మంజునాథ రైస్ ఇండస్ట్రీస్, అంతర్గాం - 3,448 మెట్రిక్ టన్నులు (రూ. 8.00 కోట్లు) బాయిల్డ్ బియ్యం
2. లక్ష్మీ గణపతి ఇండస్ట్రీస్, తక్కల్లపల్లి - 2,467 మెట్రిక్ టన్నులు (రూ. 5.72 కోట్లు) - బాయిల్డ్ బియ్యం
3. శ్రీ వీరాంజనేయ భవాని రైస్ మిల్, బట్టపల్లి - 2,164 మెట్రిక్ టన్నులు (రూ. 5.02 కోట్లు) - రా బియ్యం
4. బాలాజీ ఆగ్రో ఇండస్ట్రీస్, చింతకుంట - 2,162 మెట్రిక్ టన్నులు (రూ. 5.02 కోట్లు)
5. మహేశ్వర ఎంఆర్‌ఎం, వెల్గటూర్ - 2,139 మెట్రిక్ టన్నులు (రూ. 4.96 కోట్లు) - రా బియ్యం
6. మల్లికార్జున రైస్ ఇండస్ట్రీస్, మోతె - 1,880 మెట్రిక్ టన్నులు (రూ. 4.36 కోట్లు) - రా బియ్యం
7. శ్రీ లక్ష్మీ బాలాజీ ఇండస్ట్రీస్, తక్కల్లపల్లి - 1,871 మెట్రిక్ టన్నులు (రూ. 4.34 కోట్లు) - బాయిల్డ్ బియ్యం
8. శ్రీ అభయాంజనేయ స్వామి ఇండస్ట్రీస్, తక్కల్లపల్లి - 1,862 మెట్రిక్ టన్నులు (రూ. 4.32 కోట్లు) - బాయిల్డ్ బియ్యం
9. విజయలక్ష్మీ ఆగ్రో ఇండస్ట్రీస్, ఐలాపూర్ - 1,841 మెట్రిక్ టన్నులు (రూ. 4.27 కోట్లు) - రా బియ్యం
10. పవనపుత్ర ఇండస్ట్రీస్, ఎండపల్లి - 1,678 మెట్రిక్ టన్నులు (రూ. 3.89 కోట్లు) - రా బియ్యం

### 1,000 నుంచి 2,000 మెట్రిక్ టన్నుల మధ్య నిల్వలున్న మిల్లులు (11-25 స్థానాలు)

ఈ శ్రేణిలో 15 మిల్లులు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా రా బియ్యం మిల్లులే ఉన్నాయి. మహావీర్ ఇండస్ట్రీస్ (ఊట్‌పల్లి), శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్ (లక్ష్మీపూర్), వైష్ణవి ఆగ్రో (బుగ్గారాం), అంజనేయ ఇండస్ట్రీస్ (పాతగూడూర్) ముఖ్యమైనవి.

### 500 నుంచి 1,000 మెట్రిక్ టన్నుల మధ్య నిల్వలున్న మిల్లులు

ఈ శ్రేణిలో శాలివాహన ఇండస్ట్రీస్ (తక్కల్లపల్లి), వెంకట సాయి ఇండస్ట్రీస్ (వెంగలాపూర్), శ్రీ రాజరాజేశ్వర ఇండస్ట్రీస్ (రాంపూర్-మల్యాల) వంటి మిల్లులు ఉన్నాయి.

### 500 మెట్రిక్ టన్నుల కంటే తక్కువ నిల్వలున్న మిల్లులు (33%-55). వీటిలో ఎక్కువగా పొయ్యి బియ్యం మిల్లులు ఉన్నాయి.

వాసవి మోడరన్ రైస్ మిల్ (వెంకటాపూర్), పూజ ఇండస్ట్రీస్ (రాఘవపేట), శ్రీ రామ ఇండస్ట్రీస్ (అంబారిపేట), నాగ లక్ష్మీనరసింహస్వామి రైస్ మిల్ (నాగులపేట) ముఖ్యమైనవి.

**ఇక చివరి 11 మిల్లులు (46%-56) - చిన్న నిల్వలు.కొత్త సురేష్ ఆగ్రో రైస్ ఇండస్ట్రీస్ (91 టన్నులు), శ్రీ లక్ష్మీ నరసింహ రైస్ మిల్-పోలాస (87 టన్నులు), రాధా శ్రీనివాస ఆగ్రో (పెద్దాపూర్), అమృత ఆగ్రో, గజకేసరి ఇండస్ట్రీస్ (లోతునూర్) వంటి మిల్లులు ఈ జాబితాలో చివరి స్థానాల్లో ఉన్నాయి.**

## ప్రత్యేక గమనిక

**జాబితాలో 56వ స్థానంలో ఉన్న ఎస్ఎస్ రైస్ ఇండస్ట్రీస్ అనే మిల్లు ఒక్కటే 49,020 మెట్రిక్ టన్నులు (రూ. 114 కోట్లు) నిల్వ చూపించింది. ఇది మిగతా 55 మిల్లుల దాదాపు మొత్తం నిల్వకు సమానం.ఒకే గ్రూపు పేరుతో బ్యాంక్ గ్యారంటీ/స్టోరేజ్ ఒకేచోట చూపించిన అవకాశం ఉంది. లేకపోతే ఇది రాష్ట్రంలోనే అతి పెద్ద సింగిల్ మిల్లు/స్టోరేజ్ యూనిట్ అవుతుంది.**



### 26 నుండి 50 వరకు మధ్యస్థ నిల్వలు

ఈ గ్రూపులో గజకేసరి ఇండస్ట్రీస్ (లొత్తునూర్), చాముండి రైస్ ఇండస్ట్రీస్, చైతన్య ఇండస్ట్రీస్ (రంగాపూర్), శ్రీ రామ ఇండస్ట్రీస్ (అంబారిపేట), శ్రీ విఘ్నేశ్వర ఇండస్ట్రీస్ (వెంగలాపురం), శ్రీ లక్ష్మీ ఇండస్ట్రీస్ (సిరికొండ), ఎస్వీ అగ్రో ఇండస్ట్రీస్ (చిన్నాపూర్), అన్నపూర్ణ ఇండస్ట్రీస్ (సంకెనపల్లి), పూజా ఇండస్ట్రీస్ (రాఘవపేట) మొదలైన మిల్లులు 2,000 నుండి 2,700 మెట్రిక్ టన్నుల వరి నిల్వలతో ఉన్నాయి. ఈ శ్రేణిలో అనేక మిల్లులు ₹5 కోట్లు దాటిన విలువ కలిగి ఉన్నాయి.

### చిన్న, మధ్యస్థ మిల్లులు (51 నుండి 96)

ఈ జాబితాలో లక్ష్మీ గణేష్ ఎమ్ఆర్‌ఎమ్ (ధర్మపురి), మణికంఠ అగ్రోటెక్, ఎస్ఆర్ఆర్ ఇండస్ట్రీస్ (జోగన్‌పల్లి), సూర్య రైస్ ఇండస్ట్రీస్, సాంబశివ ఇండస్ట్రీస్, అన్నదాత ఇండస్ట్రీస్ (సంకెనపల్లి), మారుతి ఇండస్ట్రీస్ (కిషన్‌రావుపేట), అమీర్ ఇండస్ట్రీస్ (సిరికొండ %-% రా రకం), టిఎస్ఆర్ రైస్ ఇండస్ట్రీస్, ధాత్త సాయి రైస్ ఇండస్ట్రీస్, దుర్గామాత ఇండస్ట్రీస్ (ఎండపల్లి), ఎస్ఎస్ రైస్ ఇండస్ట్రీస్, భవానీ ఇండస్ట్రీస్ (బండలింగాపూర్), శక్తి ఇండస్ట్రీస్ (చెల్గల్), శ్రీ గణేష్ ఎమ్ఆర్‌ఎమ్ (తాటిపెల్లి), శ్రీ లక్ష్మీనరసింహ ఇండస్ట్రీస్ (డుంపేట), శ్వేత రైస్ ఇండస్ట్రీస్ (బల్వంతాపూర్) మొదలైన మిల్లులు ఉన్నాయి. ఈ మిల్లుల్లో నిల్వలు 50 మెట్రిక్ టన్నుల నుండి 2,200 మెట్రిక్ టన్నుల వరకు ఉండగా, విలువలు ₹.0.12 కోట్ల నుండి ₹.6 కోట్ల వరకు ఉన్నాయి.

### మొత్తం సారాంశం

**మొత్తం మిల్లుల సంఖ్య :** 96
**మొత్తం మిగిలిన వరి :** 2,80,674.459 మెట్రిక్ టన్నులు
**మొత్తం విలువ :** ₹662.74 కోట్ల రూపాయలు
**ప్రధాన రకాలు :** దాదాపు 90% మిల్లులు బాయిల్డ్ రైస్ మిల్లులే
**ప్రధాన ప్రాంతాలు :** తక్కళ్లపల్లి, చెప్యాల్, ధర్మపురి, సిరికొండ, రంగాపూర్, కోరుట్ల, జగిత్యాల, మేడిపల్లి, వెల్గటూర్ మొదలైనవి.

# ముగిసిన తొలి రోజు ఆట



## మలుపు తిప్పిన కుల్దీప్ యాదవ్!
## 6 వికెట్లకు సౌతాఫ్రికా 247 పరుగులు
## సునాయస క్యాచ్ లు నేలపాలు

గౌహతి టెస్ట్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 6 వికెట్లు కోల్పోయి 247 పరుగులు చేసింది. టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. మూడో సెషన్‌లో భారత జట్టు 81వ ఓవర్లో కొత్త బంతిని తీసుకోవడంతో భారత్ కం బ్యాక్ చేయగలిగింది. కొత్త వ్యూహం పనిచేసింది. ఎందుకంటే ఆ తరువాతి ఓవర్లో మహ్మద్ సిరాజ్ ఓ వికెట్ తీశాడు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా సెనురన్ ముత్తుసామి, కైల్ వెరెయిన్ నాటౌట్‌గా నిలిచారు. దక్షిణాఫ్రికాకు చెందిన బ్యాట్స్‌మెన్‌లు బ్యాటింగ్‌లో మంచి ప్రారంభం ఇచ్చారు. కానీ ఎవరూ పెద్ద ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. ఓపెనర్లు ఎయిడెన్ మార్క్రమ్, రయాన్ రికల్టన్ 82 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం నెలకొల్పారు. తరువాత కేవలం 3 బంతుల వ్యవధిలో మార్క్రమ్, రికల్టన్ ఇద్దరూ అవుట్ అయ్యారు. ఆ తర్వాత టెంబా బావుమా, ట్రిస్టన్ స్టబ్స్ 84 పరుగుల మరో మంచి భాగస్వామ్యం నెలకొల్పారు. దాంతో రెండు సెషన్లు సఫారీలే ఆధిపత్యం చెలాయించారు.రెండో సెషన్ ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 2 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. అయితే మూడో సెషన్‌లో భారత బౌలర్లు అద్భుతంగా రాణించి వికెట్లు తీశారు. మూడో సెషన్‌లో 26.5 ఓవర్లు బౌలింగ్ చేసి 92 పరుగులు ఇచ్చి 3 విలువైన వికెట్లు తీశారు. మొదటి 2 సెషన్లలో భారత బౌలర్లు కేవలం 2 వికెట్లు తీయగా, చివరి సెషన్‌లో కొత్త బంతి తీసుకున్నాక భారత బౌలర్లు 3 వికెట్లు పడగొట్టారు. రెండో రోజు ఉదయం భారత జట్టు దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను 300 పరుగుల లోపే ముగించాలని భావిస్తుంది. ఆదివారం ఉదయం పిచ్ అనుకూలిస్తే సఫారీలు తొలి సెషన్లో ఆలౌట్ అవుతారు.రెండో టెస్టులో తొలిరోజు కుల్దీప్ యాదవ్ ఆకట్టుకున్నాడు. 3 వికెట్లు కీలక వికెట్లు తీసి దక్షిణాఫ్రికాపై ఒత్తిడి పెంచాడు. కానీ మరో ఎండ్ లో అంతగా సహకారం లభించలేదు. గౌహతి టెస్ట్‌లో మొదటి రోజున భారత్ తరఫున విజయవంతమైన బౌలర్‌గా నిలిచాడు. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా ఒక్కో వికెట్ తీశారు. గౌహతిలోని బర్సపరా స్టేడియం తొలిసారిగా టెస్ట్ మ్యాచ్‌కి ఆతిథ్యం ఇస్తోందని తెలిసిందే. మొదటి రోజు



దక్షిణాఫ్రికా తరపున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా ట్రిస్టన్ స్టబ్స్ నిలిచాడు. 49 పరుగులు చేసిన స్టబ్స్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో రాహుల్ క్యాచ్ పట్టడంతో ఔటయ్యాడు.దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా 41 పరుగులు చేయగా, మార్క్రమ్ 38, మరో ఓపెనర్ రియాన్ రికెల్టన్ 35 పరుగులు చేశారు. టోనీ డె జోర్జి 28 పరుగులకు సిరాజ్ బౌలింగ్ లో ఔటయ్యాడు. సమష్టిగా ఆడి పరుగులు చేయడంతో ఒక్క హాఫ్ సెంచరీ నమోదు కాకున్నా తొలిరోజు ఆటలో దక్షిణాఫ్రికా 6 వికెట్ల నష్టానికి 247 రన్స్ చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్లు మార్క్‌రమ్, ర్యాన్ రికెల్టన్ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. అయితే బుమ్రా వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో 4 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద మార్క్‌రమ్ ఇచ్చిన సునాయస స్లిప్ క్యాచ్‌ను కేఎల్ రాహుల్ నేలపాలు చేశాడు. ఈ అవకాశాన్ని అతను సద్వినియోగం చేసుకున్నాడు. మరో రెండు రనౌట్ అవకాశాలను కూడా భారత్ చేజార్చుకుంది. ఇక టీ బ్రేక్‌కు ముందు మార్క్‌రమ్‌ను బుమ్రా క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో సౌతాఫ్రికా 82/1 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది.రెండో సెషన్ ఆరంభంలోనే ర్యాన్ రికెల్టన్‌ను కుల్దీప్ యాదవ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఈ పరిస్థితుల్లో ట్రిస్టన్ స్టబ్స్, టెంబా బవుమా జట్టును ఆదుకున్నారు. భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించిన ఈ జోడీ.. ఓపికగా ఆడుతూ వీలుచిక్కిన బంతిని బౌండరీకి తరలించింది. దాంతో సౌతాఫ్రికా 156/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.మూడో సెషన్‌లో భారత బౌలర్లు చెలరేగారు. 84 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకుపోయిన బవుమా-స్టబ్స్ జోడీని జడేజా విడదీసాడు. హాఫ్ సెంచరీకి చేరువైన బవుమాను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ కాసేపటికే స్టబ్స్‌ను కుల్దీప్ యాదవ్ క్యాచ్ ఔట్ చేసి హాఫ్ సెంచరీ చేయకుండా అడ్డుకున్నాడు. టోనీ డీ జోర్జీ, వియాన్ మల్డర్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేయగా.. కుల్దీప్ యాదవ్ మరోసారి అడ్డుకున్నాడు. మల్డర్(13)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. కొత్త బంతిని అందుకున్న తర్వాత టోర్నీ డీ జోర్జి(26)ని సిరాజ్ కీపర్ క్యాచ్‌గా ఔట్ చేశాడు. ఆ తర్వాత నాలుగు బంతులకే బ్యాడ్ లైట్ కారణంగా ఆట ఆగిపోయింది. తొలి రెండు సెషన్లలో ఒక్కో వికెట్ మాత్రమే తీసిన భారత్.. ఆఖరి సెషన్‌లో మాత్రం 4 వికెట్లు పడగొట్టింది. ఇందులో కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు తీసి మ్యాచ్‌ను భారత్‌వైపు మలుపు తిప్పాడు.

# గంభీర్ తప్పిదాలు పునరావృతం

సౌతాఫ్రికాతో తొలి టెస్ట్‌లో టీమిండియా ఓటమికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అనాలోచిత నిర్ణయాలే కారణమనే అభిప్రాయం వ్యక్తమైంది. సరైన కాంబినేషన్‌తో బరిలోకి దిగకపోవడం.. పిచ్ కండిషన్స్ తగ్గట్లు జట్టును సిద్ధం చేయకపోవడం.. స్పెషలిస్ట్ బ్యాటర్లకు బదులు ఆల్‌రౌండర్లకు ప్రాధాన్యత ఇవ్వడం, ఏకపక్షంగా టర్నింగ్ ట్రాక్‌ను సిద్ధం చేయడం వంటి తప్పిదాలు టీమిండియా ఓటమికి కారణమయ్యాయనే విమర్శలు వచ్చాయి.ముఖ్యంగా మూడో స్థానంలో సాయి సుదర్శన్‌కు బదులు స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను ఆడించడం టీమిండియాకు తీవ్ర నష్టం చేసింది. దాంతో సునాయసంగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ ఓటమిపాలైంది. ఈ ఓటమి నుంచి గంభీర్ ఏ మాత్రం పాఠాలు నేర్చుకోలేదు.గౌహతి వేదికగా శనివారం ప్రారంభమైన రెండో మ్యాచ్‌లోనూ గంభీర్ అవే తప్పిదాలను పునరావృతం చేశాడు. పిచ్ కండిషన్స్‌ను సరిగ్గా అంచనా వేయలేకపోయిన గంభీర్.. మరోసారి ఆల్‌రౌండర్లకే ప్రాధాన్యత ఇచ్చాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా 2 మార్పులతో బరిలోకి దిగింది. శుభ్‌మన్ గిల్, అక్షర్ పటేల్ స్థానాల్లో సాయి సుదర్శన్, నితీష్ కుమార్ రెడ్డి తుది జట్టులోకి వచ్చారు.ఏ మాత్రం ఫామ్‌లో లేని నితీష్ కుమార్ రెడ్డిని తుది జట్టులోకి తీసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఆస్ట్రేలియా పర్యటనలో సెంచరీ చేసిన తర్వాత అతను ఒక్క మ్యాచ్‌లోనూ చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. బౌలింగ్‌లోనూ ప్రభావం చూపడం లేదు. ఈ క్రమంలోనే 8వ స్థానంలో వచ్చి 20 పరుగులు చేసేందుకు నితీష్ కుమార్ రెడ్డిని తీసుకుంటారా? అనే విమర్శలు వస్తున్నాయి.తాజా మ్యాచ్‌లో పిచ్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది. టీమిండియా ఎక్స్‌ట్రా స్పెషలిస్ట్ పేసర్‌తో బరిలోకి దిగితే అడ్వాంటేజ్‌గా ఉండేది. కానీ నితీష్ కుమార్ రెడ్డిని తీసుకొని మూల్యం చెల్లించుకుంది. అతనితో నాలుగు ఓవర్లు మాత్రమే వేయించిన భారత్.. మళ్లీ బౌలింగ్ ఇవ్వలేదు. ధారళంగా పరుగులివ్వడంతో పక్కనపెట్టింది. ఓవైపు బుమ్రా, సిరాజ్ కట్టడిగా బౌలింగ్ చేసి ఒత్తిడిని పెంచితే నితీష్ పరుగులు వచ్చి ఆ ప్రెజర్‌ను రిలీజ్ చేశాడు. దాంతో పంత్ మళ్లీ అతనికి బంతిని ఇచ్చే సాహసం చేయలేదు.ఈ క్రమంలోనే నితీష్‌ను ఎందుకు తీసుకున్నారనే ప్రశ్నలు వస్తున్నాయి. నితీష్ బదులు మూడో పేసర్‌ను ఆడించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆకాశ్ దీప్, మహమ్మద్ షమీ వంటి పేసర్ అందుబాటులో ఉంటే భారత్‌కు కలిసొచ్చేదనే మాటలు వినిపిస్తున్నాయి. బౌలింగ్‌లో విఫలమైన నితీష్ కుమార్ రెడ్డి.. బ్యాటింగ్‌లోనూ తేలిపోతే గంభీర్‌పై మరిన్ని విమర్శలు రానున్నాయి.



# రోహిత్ శర్మకే మళ్లీ వన్డే కెప్టెన్సీ!

సౌతాఫ్రికాతో తొలి టెస్టులో గాయపడ్డ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు. గువాహటి వేదికగా సౌతాఫ్రికాతో శనివారం ప్రారంభమైన రెండో టెస్టుకు దూరమయ్యాడు. దీంతో వైస్‌కెప్టెన్ రిషభ్ పంత్ ఈ మ్యాచ్‌కు కెప్టెన్ బాధ్యతలు స్వీకరించాడు. అయితే సౌతాఫ్రికా ఈ పర్యటనలోనే టెస్టు సిరీస్ ముగిశాక, వన్డే, టీ20 సిరీస్‌లు ఆడాల్సి ఉంది. వన్డే సిరీస్ ఈనెల 30న ప్రారంభం కానుంది. ఈ క్రమంలో అభిమానుల్లో ఓ సందేహం నెలకొంది.ప్రస్తుతం సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్ ఆడుతున్న భారత్ మరో 8 రోజుల్లోనే వైట్ బాల్ సిరీస్‌లో బరిలో దిగాల్సి ఉంది. అయితే భారత వన్డే జట్టుకు కూడా శుభ్‌మన్ గిల్‌నే కెప్టెన్. దీంతో ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షనలో ఉన్న గిల్ మరో 8 రోజుల్లో కోలుకుంటాడా అనే సందేహాలు మొదలయ్యాయి. గతకొంత కాలంగా గిల్ విశ్రాంతి లేకుండా క్రికెట్ ఆడడం, ఇకపై టీమ్‌ఇండియాకు కీలక సిరీస్‌లు ఉన్న నేపథ్యంలో అతడి విషయంలో బీసీసీఐ జాగ్రత్తగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.ఈ పరిస్థితుల్లో గిల్ పూర్తిగా కోలుకోకముందే జట్టులోకి తీసుకురావడం అసాధ్యం. అలాగే వన్డే వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా ప్రస్తుతం గాయం నుంచి రికవరీ అవుతున్నాడు. గత నెలలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో ఫీల్డింగ్ చేస్తుండగా అయ్యర్ గాయపడ్డాడు. అప్పట్నుంచి అయ్యర్ జట్టుకు దూరమయ్యాడు. ఇప్పటికీ అతడు పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదని తెలుస్తోంది. దీంతో అయ్యర్ కూడా సౌతాఫ్రికా వన్డే సిరీస్‌లో బరిలోకి దిగడం దాదాపుగా అసాధ్యమే! అలా కెప్టెన్, వైస్ కెప్టెన్ ఇద్దరూ గాయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో రానున్న వన్డే సిరీస్‌లో జట్టుకు ఎవరు సారథ్యం వహిస్తారు అనేది ఆసక్తిగా మారింది. ఒకవేళ గిల్, అయ్యర్ దూరమైతే టీమ్‌ఇండియాను ఎవరు నడిపిస్తారనేది అభిమానుల మదిలో ఉన్న ప్రశ్న. దీంతో సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మకు మళ్లీ కెప్టెన్ బాధ్యతలు అప్పగిస్తారా? అని అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టులు షేర్ చేస్తున్నారు. అలా రోహిత్‌కు కెప్టెన్సీ ఇస్తే బాగుంటుందని కామెంట్లు చేస్తున్నారు. అంతేకాకుండా జట్టు పరంగా చూసుకుంటే అది ఉత్తమమైన ఛాయిసే. కానీ, బీసీసీఐ ఆ నిర్ణయం తీసుకోవడం దాదాపు అసాధ్యం! ఎందుకంటే ఒకసారి కెప్టెన్సీ నుంచి తప్పించిన తర్వాత మళ్లీ బాధ్యతలు ఇచ్చే ఛాన్స్ లేదు.అయితే గిల్?కు ఇప్పుడున్న గాయం పెద్దదేమీ కాదు. ఇప్పటికే గిల్ కోలుకుంటున్నాడు. వన్డే సిరీస్?కు ఇంకా వారం సమయం ఉంది. మెడనొప్పి నుంచి కోలుకోవడానికి ఈ గ్యాప్ సరిపోతుంది. ఈ క్రమంలో గిల్ త్వరితగతిన కోలుకొని జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. అలా వస్తే, వన్డే సిరీస్‌లో కూడా గిల్ నడిపిస్తాడు. ఒకవేళ రాకపోతే ఇంకో యువ ఆటగాడికి సారథిగా ఎంపిక చేసే అవకాశాలను బీసీసీఐ కనుగొనవచ్చు!

# ఎలైట్ లిస్ట్‌లో రిషభ్ పంత్

గువాహటి వేదికగా భారత్– సౌతాఫ్రికా మధ్య రెండో టెస్టు ప్రారంభమైంది. ఈ మ్యాచ్?లో టాస్ నెగ్గిన సౌతాఫ్రికా బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే రెగ్యులర్ కెప్టెన్ శుభ్?మన్ గిల్ గాయం కారణంగా ఈ టెస్టుకు దూరం కావడం వల్ల, రిషభ్ పంత్ పగ్గాలు అందుకున్నాడు. ఈ క్రమంలో పంత్ అరుదైన ఘనత సాధించాడు. భారత్?కు టెస్టుల్లో సారథ్యం వహించిన 38వ కెప్టెన్?గా నిలిచాడు.ఈ టెస్టుకు కెప్టెన్?గా ఎంపిక అవ్వడంపై పంత్ మాట్లాడాడు. ఇది తనకు ఓ గౌరవం అని చెప్పాడు. 'కెప్టెన్‌గా ఒకే టెస్టుకు సారథ్యం వహించడం బాగా అనిపించదు. కానీ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు బీసీసీఐకి కృతజ్ఞతలు. ఏ పరిస్థితుల్లో అయినా సరే జట్టును నడిపించడం గర్వకారణమే. కొన్నిసార్లు సంప్రదాయబద్ధంగా నిర్ణయాలు తీసుకోవడం బాగుంటుంది. మరికొన్నిసార్లు కొత్తగా ట్రై చేస్తే మంచి ఫలితాలు అందుకోవచ్చు. కానీ ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేయడం తెలిసి ఉండాలి. ఆటను ఆస్వాదిస్తూ జట్టు కోసం నేను చేయాల్సింది వంద శాతం చేస్తా' అని పంత్ మ్యాచ్?కు ముందు ప్రెస్ కాన్ఫిరెన్స్?లో పేర్కొన్నాడు.ఈ టెస్టుకు కెప్టెన్?గా వ్యవహరించడంతో పంత్ అరుదైన రికార్డు సాధించాడు. టెస్టుల్లో భారత్ జట్టుకు సారథ్యం వహించిన రెండో వికెట్ కీపర్, బ్యాటర్?గా నిలిచాడు. పంత్ కంటే ముందు మహేంద్రసింగ్ ధోనీ మాత్రమే (వికెట్ కీపర్, బ్యాటర్) టీమ్‌ఇండియాను టెస్టుల్లో నడిపించాడు. 100ఏళ్ల చరిత్ర ఉన్న భారత టెస్టు జట్టుకు ఈ ఇద్దరు వికెట్ కీపర్లే కెప్టెన్సీ వహించిన ఘనత అందుకున్నారు.టెస్టుల్లో అత్యధిక ప్లేయర్లు కెప్టెన్?గా ఉన్న నాలుగో జట్టుగా భారత్ కొనసాగుతోంది. 1928లో భారత్ ఆడిన తొలి టెస్టు నుంచి ఇప్పటిదాకా జట్టుకు 38 మంది ఆటగాళ్లు కెప్టెన్లుగా వ్యవహరించారు. ఈ లిస్ట్?లో ఇంగ్లాండ్? 82 మంది కెప్టెన్లతో టాప్?లో ఉంది.

# 2025 యాషెస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం

## తొలి టెస్టులో ఇంగ్లాండ్‌పై ఘన విజయం
## ఆసీస్‌ను ఊచకోత కోసిన ట్రావిస్ హెడ్
## 10 వికెట్లతో సత్తా చాటిన మిచెల్ స్టార్క్

ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. 205 పరుగుల లక్ష్యఛేదనలో భాగంగా రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆసీస్.. ట్రావిస్ హెడ్(83 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్స్‌లతో 123) విధ్వంసకర శతకంతో 28.2 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి విజయాన్ని కైవసం చేసుకుంది.రెండు రోజుల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో ట్రావిస్ హెడ్ అసాధారణ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న వికెట్‌పై టీ20 తరహా బ్యాటింగ్‌తో విరుచుకుపడ్డాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగి 36 బంతుల్లోనే హాఫ్ సెంచరీ నమోదు చేసిన ట్రావిస్ హెడ్.. 69 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అతని దూకుడైన బ్యాటింగ్‌తో హోరాహోరీ తప్పదనుకున్న మ్యాచ్ ఏకపక్షంగా ముగిసింది. అతనికి తోడుగా మార్నస్ లబుషేన్(49 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 51 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించాడు.ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ ఒక్కడే రెండు వికెట్లు తీయగా.. మిగతా బౌలర్లు తేలిపోయారు. ఈ విజయంతో ఐదు టెస్ట్‌ల యాషెస్ సిరీస్‌లో ఆసీస్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య రెండో టెస్ట్ నవంబర్ 29 నుంచి కాన్‌బెర్రా వేదికగా ప్రారంభం కానుంది.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులకే కుప్పకూలింది. హ్యారీ బ్రూక్(61 బంతుల్లో 5 ఫోర్లు,



సిక్స్‌తో 52) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. ఓలీ పోప్(58 బంతుల్లో 4 ఫోర్లతో 46), జెమీ స్మిత్(22 బంతుల్లో 6 ఫోర్లతో 33) పర్వాలేదనిపించారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(7/58) ఏడు వికెట్లతో నిప్పులు చెరిగాడు. బ్రెండన్ డొగ్గెట్(2/27) రెండు వికెట్లు తీయగా.. కామెరూన్ గ్రీన్‌కు ఓ వికెట్ దక్కింది. అనంతరం ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 132 పరుగులకు ఆలౌటైంది. అలెక్స్ క్యారీ(26), కామెరూన్ గ్రీన్(24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ట్రావిస్ హెడ్(21) విఫలమయ్యాడు. బెన్ స్టోక్స్(5/23) ఐదు వికెట్లు తీయగా.. బ్రైడన్ కార్స్ (3/45) మూడు వికెట్లు పడగొట్టాడు. జోఫ్రా ఆర్చర్(2/11)కు రెండు వికెట్లు దక్కాయి.ఇక 40 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో రోజు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ 164 పరుగులకు ఆలౌటైంది. గస్ అట్కిన్సన్(32 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 37), ఓలీ పోప్(57 బంతుల్లో 2 ఫోర్లతో 33) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(3/55)తో పాటు స్కాట్ బోలాండ్(4/33) నాలుగు వికెట్లు పడగొట్టాడు.బ్రెండన్ డొగ్గెట్(3/51) మూడు వికెట్లు తీసాడు. దాంతో ఆసీస్ ముందు 205 పరుగుల లక్ష్యం నమోదైంది. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న ఈ వికెట్‌పై ఈ లక్ష్యాన్ని ఛేదించడం ఆసీస్‌కు కష్టమవుతుందని అంతా అనుకున్నారు. కానీ ట్రావిస్ హెడ్ ఓపెనర్‌గా బరిలోకి దిగి టీ20 బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను ఏకపక్షం చేశాడు. ట్రావిస్ హెడ్ ఈ టెస్ట్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో ఐదో స్థానంలో బ్యాటింగ్ చేసి కేవలం 21 పరుగులే చేశాడు. కానీ, చివరి ఇన్నింగ్స్‌లో ఓపెనింగ్ చేసే అవకాశం రావడంతో, దాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. హెడ్ మొదటి నుంచే వేగంగా పరుగులు చేశాడు, పెర్త్ పిచ్‌పై కష్టంగా కనిపించిన 205 పరుగుల టార్గెట్‌ను సులభతరం చేశాడు. కేవలం 36 బంతుల్లోనే హెడ్ తన హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. ఇది యాషెస్ చరిత్రలో మూడవ ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డ్. ఆ తర్వాత కూడా హెడ్ ఆగకుండా కేవలం 69 బంతుల్లోనే తన సెంచరీని పూర్తి చేశాడు. ఈ వేగంతో ఆస్ట్రేలియా తరఫున టెస్టుల్లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన వారి జాబితాలో హెడ్ సంయుక్తంగా మూడో స్థానానికి చేరుకున్నాడు. అలాగే, టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే ఇది ఐదవ వేగవంతమైన సెంచరీ రికార్డు.ట్రావిస్ హెడ్ చేసిన ఈ సెంచరీ యాషెస్ సిరీస్ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. యాషెస్ సిరీస్ చరిత్రలో ఇది రెండవ అత్యంత వేగవంతమైన సెంచరీ. హెడ్ తన 69 బంతుల సెంచరీతో గిల్‌బర్ట్ జెస్సోప్ రికార్డును బద్దలు కొట్టాడు. జెస్సోప్ 1902లో ఆస్ట్రేలియాపై 76 బంతుల్లో సెంచరీ కొట్టాడు. యాషెస్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ రికార్డు మాత్రం ఆడం గిల్‌క్రిస్ట్ పేరిట ఉంది. అతను 2006-07 యాషెస్‌లో కేవలం 57 బంతుల్లోనే సెంచరీ సాధించాడు.

# నేటి సాక్షి

TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా...










## నాగచైతన్య ఎన్‌సి 24 మూవీ ఫస్ట్‌లుక్ పోస్టర్

### మహేశ్‌బాబు చేతుల మీదుగా నేడు విడుదల

అక్కినేని నాగ చైతన్య విరూపాక్ష డైరెక్టర్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం ఎన్‌సి24. ఈ మూవీలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. మైథలాజికల్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తోన్న ఈ మూవీ నుంచి ఇటీవలే బీటీఎస్ వీడియోను షేర్ చేస్తూ.. ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నవంబర్ 23న లాంచ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు స్టన్నింగ్ లుక్‌తో క్రేజీ వార్తను షేర్ చేశారు మేకర్స్.ఎన్‌సీ 24 ఫస్ట్ లుక్‌ను టాలీవుడ్ స్టార్ యాక్టర్ మహేశ్ బాబు లాంచ్ చేయనున్నాడు. నవంబర్ 23న ఆదివారం నాగచైతన్య బర్త్ డే సందర్భంగా ఉదయం 10:08 గంటలకు ఎన్‌సీ 24 టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను లాంచ్ చేయనున్నాడని తెలియజేస్తూ స్పెషల్ లుక్ ఒకటి విడుదల చేశారు. వారణాసి పోస్టర్‌లో చైతూను మహేశ్‌బాబుతో కలిసి డిజైన్ చేసిన పోస్టర్ షేర్ చేయగా నెట్టింట వైరల్ అవుతోంది.




## ప్రభాస్ ఫౌజీపై ప్రీక్వెల్ ఊహాగానాలు...

ఇప్పటి వరకు రెబల్ స్టార్ 'ప్రభాస్' సీక్వెల్ మూవీస్ మాత్రమే చేశారు. రెండు భాగాలుగా వచ్చిన 'బాహుబలి' భారీ విజయాన్ని సాధించగా.. నెక్ట్స్ కల్కి 2, సలార్ 2 రెడీ అవుతున్నాయి. ఈ లిస్ట్‌లో రాజాసాబ్ కూడా ఉంది. అయితే ఇవన్నీ సీక్వెల్స్ మాత్రమే. ఇప్పుడు ఓ సినిమాకు ప్రీక్వెల్ ప్రయత్నాలు జరుగుతున్నట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న సినిమాల్లో 'ఫౌజీ' కూడా ఒకటి. సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగష్టులో ఈ సినిమా రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారు. ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ వారు భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. అయితే ఫౌజీ చిత్రానికి ప్రీక్వెల్ చేసే ప్లానింగ్‌లో ఉన్నారట రాఘవపూడి. ఇప్పటి వరకు వచ్చిన ఫౌజీ అవుట్ పుట్ పట్ల ప్రభాస్ చాలా హ్యాపీగా ఉన్నారట. హను వర్క్‌కు ఫిదా అవుతున్నాడట డార్లింగ్. అందుకే ఆయనతో మరో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఓ టాక్ ఉంది. ఇప్పుడు దాదాపుగా ప్రీక్వెల్ ఫిక్స్ అయినట్టేనని తెలుస్తోంది. అయితే ఫౌజీ రిజల్ట్‌ను బట్టి ఈ ప్రాజెక్ట్ ఉంటుందా?, ఉండదా? అనేది డిసైడ్ కానుంది. పౌజీ హిట్ అయితే ప్రీక్వెల్ ఉండే ఛాన్స్ ఉంది, లేదంటే లేదు. ఏదేమైనా ఫౌజీ మాత్రం మామూలుగా ఉండదనేది ఇండస్ట్రీ ఇన్‌సైడ్ టాక్. ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. యుద్ధంలో పుట్టిన ప్రేమకథగా ఈ సినిమా ఉంటుందని ముందు నుంచి ప్రచారంలో ఉంది. మరి ఈసారి హను ఎలా ప్లాన్ చేస్తున్నాడో చూడాలి.

## కార్తికేయ పుట్టినరోజు

### విషెస్ తెలిపిన మహేశ్, ప్రియాంక

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తనయుడు, యువ నిర్మాత ఎస్.ఎస్. కార్తికేయ శనివారం తన 34వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా సినీ పరిశ్రమలోని ప్రముఖులతో పాటు 'వారణాసి' చిత్ర బృందం ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అయితే తాజాగా కార్తికేయకి సూపర్‌స్టార్ మహేశ్ బాబుతో పాటు గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్‌బాబు ఎక్స్ వేదికగా కార్తికేయకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ.. మేము నిర్మించే ప్రతిదాని వెనుక ఉండే నిశ్శబ్దపు శక్తివి నువ్వే. హ్యాపీ బర్త్‌డే కార్త్. అత్యంత కష్టమైన పనులను కూడా నువ్వు ఎంత సులువుగా, కూల్‌గా చక్కబెడతావో చూస్తుంటే నాకు ఎప్పుడూ ఆశ్చర్యం కలుగుతుంది. రాబోయే సంవత్సరంలో కూడా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నా అంటూ మహేశ్ రాసుకోచ్చాడు. అలాగే ప్రియాంక చోప్రా కార్తికేయకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ.. తేలికగా తీసుకో నా మిత్రమా! ప్రతి పని వెనుక నిశ్శబ్దంగా నిలబడే వ్యక్తికి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఈ సినిమా (వారణాసి) ప్రయాణంలో నీతో కలిసి డాన్స్ చేయగలుగుతున్నందుకు చాలా సంతోషంగా ఉందంటూ ప్రియాంక చోప్రా రాసుకోచ్చింది. ఈ పోస్ట్‌కి ఒక వీడియోను పంచుకుంది. ఈ వీడియోలో 'ప్రేమికుడు'లోని సూపర్ హిట్ పాట 'ఊర్వశి.. ఊర్వశి' పాటకు కార్తికేయతో కలిసి సరదాగా స్టెప్పులేసింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కార్తికేయ ప్రస్తుతం 'వారణాసి'కి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.





## మహిళలు బలహీనులు కాదు.. బలవంతులు

### నటి రష్మిక మందన్నా కామెంట్స్

ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో దూసుకెళ్తున్న హీరోయిన్ రష్మిక మందన్నా, భాష ఏదైనా పట్టించుకోకుండా వరుస సినిమా ప్రాజెక్టులతో బిజీగా గడుపుతోంది. అదే వేగంతో విజయాలు కూడా అందిపుచ్చుకుంటూ స్టార్ హీరో రేంజ్ ఫ్యాన్‌బేస్‌ను సంపాదించుకుంది. తాజాగా విడుదలైన 'గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో మరో హిట్ తన ఖాతాలో వేసుకున్న రష్మిక, సినిమాలకే కాకుండా సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉండి అభిమానులతో కంటిన్యూ టచ్‌లో ఉంటుంది. ఇటీవల ఆమె స్త్రీశక్తి గురించి ఓ ఆసక్తికరమైన పోస్ట్‌ను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించింది. అమ్మాయిలంతా ఏకమై నిలిస్తే ఆ శక్తిని ఎవరూ ఆపలేరని ఆమె స్పష్టంగా తెలిపింది. మహిళల మధ్య ఉండే భావోద్వేగ అనుబంధం వేరే స్థాయిలో ఉంటుందని, మంచి స్నేహితురాలితో దగ్గరైతే జరగబోయే విషయాలు ముందే అర్థమైపోతాయనే ఫీలింగ్ కలుగుతుందని చెప్పింది. స్త్రీలు ఒకరికొకరు మద్దతు ఇస్తే జీవితం మరింత సులభమవుతుందని, వారు బలహీనులు కాదు, ఎంతో ప్రేమతో, బలంతో ఉండే వ్యక్తులని రష్మిక పేర్కొంది. ఎల్లప్పుడూ తనతో ఉండే స్నేహితురాళ్లకు కృతజ్ఞతలు చెబుతూ, ప్రతి ఒక్కరి జీవితంలో కూడా ఇలాంటి మంచి ఫ్రెండ్స్ ఉండాలని కోరుకుంటు న్నానని ఆమె చెప్పింది.



## వారణాసిలో మ్యూజిక్ అదుర్స్

### ఆరు పాటలుంటాయని హింట్ ఇచ్చిన కీరవాణి

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్‌లో ఉన్న సినిమా 'వారణాసి'. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ అడ్వెంచర్ మూవీకి సంబంధించిన ప్రతి వార్త క్షణాల్లో వైరల్ అవుతోంది. ప్రజలు కూడా ఈ మూవీపై క్యూరియసిటీతో ఉన్నారు. తాజాగా చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి ఈ సినిమాపై మ్యూజికల్ అప్‌డేట్ ఇచ్చారు. గోవా వేదికగా జరుగుతోన్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) వేడుకలకు హాజరైన కీరవాణి.. 'వారణాసి'లో సంగీతం ఎవరూ ఊహించని స్థాయిలో ఉంటుందన్నారు. 'అభిమానులు ఈ చిత్రంలో అద్భుతమైన సంగీతాన్ని వింటారు. అంతకు మించి ఇప్పుడే ఈ ప్రాజెక్ట్ గురించి ఏం చెప్పలేను. 'వారణాసి'లో మొత్తం ఆరు పాటలు ఉంటాయి. మనం చేసే పని ఏదైనా కానీ.. దానిపై మనకు స్పష్టత, మనపై మనకు నమ్మకం ఉంటే ఏవిషయమూ గందరగోళంగా అనిపించదు. ఒత్తిడిగా కూడా ఉండదు. నాకు ఈ ప్రాజెక్ట్ విషయంలో ఎటువంటి గందరగోళం లేదని చెప్పారు. ఇప్పటికే ఈ సినిమాలో 'రణ కుంభ' ఆడియో సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ సృష్టిస్తోంది. రాజమౌళి తెరకెక్కించే సినిమాలకు ఆయన సోదరుడు కీరవాణి సంగీతం అందిస్తారు. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన 'స్టూడెంట్ నెం. 1', 'యమదొంగ', 'మగధీర', 'ఈగ', 'బాహుబలి'లోని పాటలు నేటికీ సోషల్‌మీడియా రీల్స్‌లో వైరల్ అవుతూనే ఉన్నాయి. ఇక వీరి కాంబోలో వచ్చిన 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'నాటు నాటు' పాటను ఆస్కార్ వరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'వారణాసి'కి సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో పలు భాషలకు చెందిన అగ్రతారలు నటిస్తున్న నేపథ్యంలో దీని బ్జడెట్‌పై వార్తలు వెలువడుతున్నాయి. వీరికి భారీ పారితోషికం ఇవ్వనున్నారని టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రబ్జడెట్ ఏకంగా రూ. 1100 కోట్లని ప్రచారం జరుగుతోంది. 2027 వేసవిలో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.




Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 966605221**

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
శనివారం
22 నవంబర్ 2025



# యువ వైద్యుల ప్రతిభను చాటిన 'ఎక్స్‌టసీ-2025'

- **అపోలోలో ఘనంగా వార్షిక సాంస్కృతిక మహోత్సవం**



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** చిత్తూరు, నవంబర్ 22: అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఎఐఎంఎస్‌ఆర్)లో వార్షిక సాంస్కృతిక మహోత్సవం 'ఎక్స్‌టసీ-2025' పండుగ వాతావరణంలో ఘనంగా జరిగింది. విద్యార్థుల కేరింతలు, రంగురంగుల వేషధారణలు, సంగీతం-నృత్యాల తో ఉప్పొంగిన ఉత్సాహంతో సాగిన ఈ వేడు కలు వైద్య విద్యార్థుల ప్రతిభకు అద్దం పట్టాయి. వైద్య విద్యలో కఠినమైన అకడెమిక్ షెడ్యూల్ మధ్య విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించుకునేందుకు ఈ ఉత్సవాలు వేదికగా నిలిచాయి. రెండు రోజులపాటు విద్యార్థుల సృజనాత్మకత, కళాత్మకత, ఉత్సాహభరిత ప్రదర్శనలతో ఎక్స్‌టసీ-2025 పండుగలా సాగింది. స్టూడెంట్ అఫైర్స్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణదీప్తి స్వాగత ప్రసంగంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి విద్యా, వైద్య రంగాల ప్రముఖులు హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ది అపోలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతరాజు విద్యార్థుల సృజనాత్మకతను అభినందిస్తూ ప్రసంగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు వ్యక్తిత్వ వికాసానికి, ఆత్మవిశ్వాస పెంపుకు, జీవితాంతం నిలిచే మధుర జ్ఞాపకాలకు వేదికవుతాయని చెప్పారు. భవిష్యత్ వైద్యులుగా ఎదుగుతున్న విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు బహుముఖ ప్రతిభను అభివృద్ధి చేసుకోవడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న అపోలో హాస్పిటల్స్ చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ (సిఎఫ్ఓ) రామకృష్ణన్ (రామ్‌కీ) మాట్లాడుతూ, వైద్య వృత్తి అత్యంత క్లిష్టమైనదైనప్పటికీ సమాజానికి దేవుడి పని చేసే బాధ్యతగల సేవ అని పేర్కొన్నారు. డాక్టర్ అనేది కేవలం ఉద్యోగం కాదు, ప్రతిసారీ ప్రాణాలను రక్షించే పవిత్రమైన సేవ అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అందించిన నృత్య-సంగీత ప్రదర్శనలు క్యాంపస్‌ను హరివిలాసంగా మార్చాయి. సాంప్రదాయ దుస్తుల్లో జానపద-సాంప్రదాయ నృత్యాలు, పాటలు, సంగీతంతో వేదిక పండుగ వాతావరణంలో కళకళలాడగా, దేశంలోని విభిన్న సంస్కృతులను ప్రతిబింబించే కార్యక్రమాలు ప్రేక్షకులను ముగ్ధుల్ని చేశాయి. అదే సమయంలో ఆధునిక నృత్యాలు, సంగీత బృంద ప్రదర్శనలు, సృజనాత్మక యాక్ట్స్ విద్యార్థుల్లోని ఉత్సాహం, కళాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని చాటాయి. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్(ఎ ఎచ్ ఇ ఆర్ ఎఫ్) ఫైనాన్స్ కంట్రోలర్ అమిత్ త్రిపాఠి, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.జి. రంగనాథ్, సిఓఓ నరేష్ కుమార్ రెడ్డి. డీన్ డాక్టర్ ఆల్ఫ్రెడ్ జె. ఆగస్టిన్, అసోసియేట్ డీన్స్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్, యూనిట్ హెడ్ ఎస్. బాలరాజ్, వివిధ విభాగాధిపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో అవినీతికి తావు లేదు



- **కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వం...**
- **నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్**

**నేటి సాక్షి,నల్లబెల్లి నవంబర్ 22:** కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వం . కొనుగోలు కేంద్రాలలో అవినీతికి తావు లేదు నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్.నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు నల్లబెల్లి మండలం ముచ్చింపుల, రంగాపురం, రేలకుంట గ్రామాల మహిళా సంఘాల ప్రతినిధులు ఇస్తారి వాసవి, ఉప్పుల సృజన, వెంగళదాసు మంజుల ఆధ్వర్యంలో, ఏపీఎం సుధాకర్ సమన్వయంతో, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జంగిలి మమత అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. తరువాత జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. అన్నదాతకు అండగా నిలిచే విధంగా తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేసిందని, వరి ధాన్యానికి మద్దతు ధర 2389 రూపాయలతో పాటు క్వింటాలుకు రూ. 500 బోనస్ ప్రకటించడం రైతులకు పెద్ద సహాయమని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులను రాజులుగా నిలబెట్టాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని శ్రీనివాస్ పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలంటూ సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రజిత బన్న, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధార్థి తిరుపతిరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు ఇస్తారి శేఖర్ గౌడ్, వైనాల అశోక్, నాయకులు ఎర్రబెల్లి రఘుపతిరావు, జిల్లా మునీందర్, జెట్టి రామ్మూర్తి, వెంగళదాసు రమేష్, జంగిలి మోహన్, జంగిలి శంకరయ్య, సిసి సాంబయ్య, ఏఈఓ శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

# మహిళ ప్రగతి -దేశ ప్రగతి-ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

## బెజ్జంకి లో చీరల పంపిణీ



**నేటి సాక్షి బెజ్జంకి:** బెజ్జంకి మండలంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా భావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు ఆర్థిక బలం కల్పించే ప్రత్యేక విధానాలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి ఇంటికి ఇందిరమ్మ సన్న బియ్యం పంపిణీతో పాటు, నాణ్యమైన చేనేత చీరలను మహిళలకు అందజేయడం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న ముఖ్య కార్యక్రమమని తెలిపారు. "మహిళా శక్తి బలపడితేనే తెలంగాణ అభివృద్ధి మరింత వేగవంతం అవుతుంది. ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమం ద్వారా కోటి మహిళలకు చీరలను పంపిణీ చేయనున్నాం. ముఖ్యమంత్రి రేవంత రెడ్డి గారి లక్ష్యం కోటి మహిళలను కోటీశ్వరులను చేయడమే," అని ఎమ్మెల్యే చెప్పారు కార్యక్రమంలో భాగంగా 14 మంది మహిళలకు ఇన్సూరెన్స్ ప్రయోజనాల కింద చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీపీఎం విద్యాసాగర్, తహసిల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో ప్రవీణ్, ఏపీఎం పరుశరాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు బైర సంతోష్, యూత్ నాయకులు కర్రావుల సందీప్, బోనగం రమేష్ మరియు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఖమ్మం బహిరంగ సభను విజయవంతం చేయండి




**నేటి సాక్షి - లక్షెట్టిపేట(రేగుంట ప్రసాద్) నవంబర్ 22:** డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ ) 100 సంవత్సరాల భారీ బహిరంగ సభను మేధావులు, విద్యావంతులు,అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశాయని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం మావోయిస్టు లతో చర్చలు జరుపకుండా బూటకపు ఎన్ కౌంటర్ లతో మరణాహోమాన్ని సృష్టిస్తుందన్నారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి కాలం గడుపుతోందని విమర్శలు గుప్పించారు. దోపిడీ, పెట్టుబడి దారి విధానాలకు సీపీఐ వ్యతిరేకమని వివరించారు. అనంతరం పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులైన పలువురికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశం లో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి వనం సత్యం, సీపీఐ మండల కార్యదర్శి మేదరి దేవవరం,నాయకులు అవునూరి వెంకటేష్, స్వామి, వాణీ, బన్నీ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా మరికల్ లో ఫ్రూట్స్ డే...



**నేటి సాక్షి,నారాయణపేట, నవంబర్ 22 :** ఫ్రూట్స్ డే సందర్భంగా రిషి హై స్కూల్, మరికల్ లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఆనందభరితంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అత్యుత్సాహంగా పాల్గొని, వివిధ రకాల పండ్ల గురించి అవగాహన పెంచే విధంగా సృజనాత్మక ప్రదర్శనలు చేశారు. చిన్నారులు తమతమ తరగతుల వారీగా పండ్ల ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలు మరియు వాటి వినియోగంపై ఆకర్షణీయమైన మోడల్స్, డ్రెస్సింగ్, స్పీచెస్ ద్వారా అద్భుతంగా ప్రదర్శన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రమేష్ శెట్టి,ప్రిన్సిపల్ సోజిష్ ,స్కూల్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి సీనియర్ ఉపాధ్యాయులు వెంకటరెడ్డి గారు, తదితర ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఫ్రూట్స్ డే ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన ఆహారం, పండ్ల ప్రాముఖ్యత, శరీరానికి పండ్లు కలిగించే ప్రయోజనాలు వంటి అంశాలపై అవగాహన కల్పించబడింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరూ విద్యార్థుల ప్రతిభను అభినందించారు. రిషి హై స్కూల్ తరఫున, విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసే ఇలాంటి విద్యా-సాంస్కృతిక కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహించనున్నామని తెలియజేస్తున్నాము.

# హైదరాబాదు ఎస్సీ ఎస్టీ కమిషనర్ కు ఫిర్యాదు





**నేటి సాక్షి,నారాయణపేట, నవంబర్ 22 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని పీ తీలేరు గ్రామానికి చెందిన తల్లి ఆశమ్మ, కొడుకు రమేష్ లు కలిసి తమను వేధింపుల గురి చేస్తున్నారని శనివారం ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.... వివరాలు ఇలా ఉన్నాయి... దేవరకద్ర కు చెందిన కొందరు మా ఇండ్ల పైకి వచ్చి వేధింపుల గురి చేస్తున్నారని.. రాత్రి వేళలో మా ఇండ్ల పైకి వచ్చి కిడ్నాప్ చేసి చంపుతామని భయాందోళన గురి చేస్తున్నా వారిపై కఠిన చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని హైదరాబాద్ ఎస్సీ కమిషనర్ కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు వారు ప్రకటనలో పేర్కొన్నారు.

# జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా శేషాద్రిని రెడ్డి బాధ్యతలు స్వీకరణ



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు) :** ఈరోజు జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ గా శేషాద్రిని రెడ్డి ఐపీఎస్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను ను అందజేయడం జరిగింది. వేములవాడ ఏ ఎస్పీగా పనిచేస్తున్న శేషాద్రిని రెడ్డిని ఖాళీగా ఉన్న జగిత్యాల అదనపు ఏ ఎస్పీ (పరిపాలన) స్థానంలో నియమించారు. స్వస్థలం నల్గొండ జిల్లా చౌటుప్పల్ సమీపంలోని లింగారెడ్డి గూడెం. ఐఐటి హైదరాబాద్ లో ఇంజనీరింగ్ చదివి 2020 లో సివిల్స్ తొలి ప్రయత్నం లోనే 401 ర్యాంకుతో ఐపీఎస్ కు ఎంపీ అయ్యారు. గత ఏడాది వేములవాడలో తొలి పోస్టింగ్ తీసుకున్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# అక్క చెల్లెళ్లకు ఇందిరమ్మ చీరల పంపిణీ

**రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి...**



**నేటి సాక్షి నారాయణపేట, నవంబర్ 22 :** మహిళా శక్తిలో భాగంగా మక్తల్ పట్టణం ప్రయివేట్ ఫంక్షన్ హాల్ లో శనివారం ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి లో పంపిణీ చేశారు లో చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ చీరలను అందు కుంటున్న అక్కా చెల్లెల్లకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మహిళలందరికి ఒక అన్నగా మన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి మన కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలను పంచుతున్నాడన్నారు. మీకు ఇచ్చే నాణ్యమైన చీరలతో మాకు గౌరవం పెరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో బతుకమ్మ పేరుతో నాసిరకం చీరలు ఇచ్చారని విమర్శించారు. కాని మన సీఎం మాత్రం అలాంటి చీరలను కాకుండా మంచి నాణ్యమైన చీరలనే ఇస్తున్నాడన్నారు. మహిళలపై నిజమైన ప్రేమ ఎవరికి ఉన్నదో మీరే గుర్తెరగాలని హితవు పలికారు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల రాజ్యమని, ప్రధానమంత్రిగా ఇందిరమ్మ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. ఇందిరమ్మను ఆదర్శంగా తీసుకొని మన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు రాష్ట్రంలో మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలతో పాటుగా, రాష్ట్రం, దేశం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, పేదలకు 200 యూనిట్ల వరకు కరంటు రేవంత్ సారథ్యం లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని తెలియజేశారు. మక్తల్ నియోజకవర్గంలో 3600 ఇందిరమ్మ ఇళ్లను కూడా మహిళల పేరు మీదనే మంజూరు చేస్తున్నామని గుర్తు చేశారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఏ పండుగలకో సన్న బియ్యం తినకూడదనే ఉద్దేశంతో ప్రతి పేదవాడికి ప్రతి నెల 6 కిలోల సన్నబియ్యం రేషన్ షాపుల ద్వారా ఇస్తున్నామని తెలిపారు. హాస్టల్ పిల్లలకు డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు ఇప్పించడం, పెట్రోల్ పంపుల నిర్వాహణ,, ధాన్యం కొనుగోలు, రైస్ మిల్లుల ఏర్పాటు వంటి అనేక వ్యాపారాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇందిరా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు, పాఠశాలల్లో బాలికల కు స్కూళ్లు తెరిచిన వెంటనే స్కూల్ డ్రెస్సులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. డిసెంబర్ ఒకటవ తారీఖున 4500 కోట్ల బడ్జెట్ తో మక్తల్ - నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తున్నారని మంత్రి తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ పర్యటనను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

# మహిళలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**మాజీ జెడ్పీటీసీ కనగండ్ల కవిత**



**నేటి సాక్షి, బెజ్జంకి :** అన్నిచోట్లా మహిళా ఓట్లు కీలకంగా మారిన వేళ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్నాయని భావించి కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మహిళలను మోసం చేసే ప్రయత్నం చేస్తోందని మాజీ జెడ్పీటీసీ కనగండ్ల కవిత విమర్శించారు. ఆమె శనివారం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయడం ఆనవాయితీగా కొనసాగిందని గుర్తుచేశారు. అయితే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు మాత్రమే చీరలు ఇస్తామని చెప్పి, మిగతా మహిళలను విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వాగ్దానాలు నెరవేర్చని కాంగ్రెస్ నేతలు,ప్రతి మహిళకు 2500 రూపాయలు,ఆడపిల్ల పెళ్లికి తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు ఇవన్నీ చెప్పి ఓట్లు తెచ్చుకు న్నారనీ, ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడుతున్నాయని భావించి చీరలను కూడా ఎంపిక చేసిన కొద్ది మంది మహిళ సంఘాల సంఘాల సభ్యులకు మాత్రమే ఇస్తూ "వంచనా రాజకీయాలు" చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. "మిగతా మహిళలకు ఓట్లు లేవా? 18 ఏళ్లు నిండిన అమ్మాయిలు ఓటర్లు కారా? వారిని ఎందుకు విస్మరిస్తున్నారు?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపం బయటపడిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని మాజీ జడ్పీటీసీ కవిత పిలుపునిచ్చారు.

# జగిత్యాల జ్యోతి బిల్డింగ్ బ్లాక్స్ ప్లే స్కూల్ లో వింటర్ కార్నివాల్



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు) :** జగిత్యాల పట్టణంలోని జ్యోతి బిల్డింగ్ బ్లాక్స్ ప్లే స్కూల్ లో " వింటర్ కార్నివాల్" పేరిట కార్యక్ర మం నిర్వహించారు. దీనిలో విద్యార్థులకు శీతాకా లం గురించి వివరించారు. ఈ శీతాకాలంలో పగటి సమయం తక్కువగా ఉండి మరియు రాత్రి సమయం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఈ సీజన్ లో చాలా ఆరోగ్యకరమైన పండ్లు మరియు కూర గాయలను తెస్తుంది. ప్రజలు తాజా ద్రాక్ష, యాపిల్స్, క్యారెట్లు, కాలీఫ్లవర్, జామ మరియు మరిన్ని తినడానికి అవకాశం పొందుతారు. ఇంకా, ఈ సీజన్లో చాలా అందమైన పువ్వులు వికసిస్తాయి అని అన్నారు. అదే విధంగా శీతాకాలం లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, ధరించాల్సిన దుస్తువుల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు బియ్యాల హరి చరణ్ రావు, శ్రీధర్ రావు, మౌనిక రావు, రజిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఉపాధి హామీ పథకం పై అవగాహన కల్పిస్తున్న ఎంపీటీసీ



**నేటి సాక్షి, బాపట్ల జిల్లా (కర్లపాలెం) :** కర్లపాలెం మండలం నల్లమోతు వారి పాలెం గ్రామ పంచాయతీ ఆవరణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పై జరిగిన ప్రత్యేకమైన గ్రామ సభలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (పని పథకం) గురించి మరియు గ్రామాలలో ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవటం వలన గ్రామ ప్రజలతో పాటు గ్రామానికి కలిగే ప్రయోజనాల గురించి కూడా గ్రామ-స్తులకు వివరించి, పని పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి అని తెలియ జేసిన ఆ సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యులు మరియు రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు. గ్రామ సభలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం యొక్క జాబితాను సవరించి, మరణించిన మరియు అనర్హుల పేర్లను జాబితా నుండి తొలగించే విధంగాను మరియు అర్హులైన గ్రామస్తులకు పని పథకాన్ని కల్పించే విదంగా ను నిర్ణయాలు తీసుకోవటం జరిగినట్లు ఎంపీటీసీ తాండ్ర తెలియ జేశారు.

గ్రామ సభలో సర్పంచ్ మాడా సుబ్రహ్మణ్యం, సెక్రటరీ షేక్ షాహినా, టీడీపీ ఇంచార్జి మునిపల్లె చిన్న, గ్రామ పెద్దలు మాడా శ్రీనివాసరావు, జనసేన శ్రీనివాసరావు మొదలగు వారు పాల్గొన్నారు.

# ఎస్బీఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ విజిలెన్స్ అవేర్‌నెస్ వర్క్‌షాప్ ప్రారంభం




- **ప్రారంభించిన ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, నక్కా ఆనంద్ బాబు**

**నేటి సాక్షి, గుంటూరు జిల్లా ప్రతినిధి :** ఎస్బీఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ విజిలెన్స్ అవేర్‌నెస్ వర్క్‌షాప్ తో ఎంతో ఉపయకరమని ఎమ్మెల్యే గళ్ళ మాధవి అన్నారు. ప్రారంభం గుంటూరు జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన SC, ST ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ విజిలెన్స్ అవగాహన సదస్సు వర్క్‌షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ని ప్రేమగా "బాబా" అని పిలుచుకుంటానని, ఒక ఆడపిల్లగా చదువుకునే అవకాశం, హక్కులు, రాజ్యాంగం ఇచ్చిన రక్షణ అంతా ఆయన వంటి మహనీయుల పోరాట ఫలితమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. కమ్యూనిటీ గౌరవం పుట్టుకతో కాక వ్యక్తిత్వం, ప్రతిభ, కృషి ద్వారా వస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. ఎస్బీఐ సేవలు దేశవ్యాప్తంగా విశ్వసనీయమైనవని, బ్యాంకులో మహిళా సిబ్బంది సంఖ్య తక్కువగా ఉండడం బాధాకరమని, వారికి మరింత అవకాశాలు కల్పించాలని కోరుతూ, బ్యాంక్ కు వచ్చే మహిళలకు సపోర్ట్ ఇవ్వాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. అంబేద్కర్ కోరుకున్న సమానత్వం వేదికలపై కూడా ప్రతిఫలించాలని, పురుషులతోపాటు మహిళలు సమానంగా ప్రాతినిధ్యం వహించాలన్నారు. అసోసియేషన్ ఏర్పాటు చేసిన లక్ష్యాలు, అజెండాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, నిష్పక్షపాత అజెండాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అవసరమైతే తన దగ్గరకు వ్యక్తిగతంగా రావచ్చని, సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చి, కార్యక్రమానికి ఆహ్వానించిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.

# దేశానికి యువతే భవిష్యత్తు -ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**నేటి సాక్షి, గుంటూరు జిల్లా ప్రతినిధి :** భవిష్యత్తు అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. గుంటూరు 32వ డివిజన్‌లోని బండ్లమూడి హనుమాయమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా యువజన సర్వీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన ఉత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై, యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువజనోత్సవాలను పురస్కరించుకుని జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ సాంస్కృతిక కార్యక్రమాలు యు-వత ప్రతిభను అగ్రస్థాయికి తీసుకెళ్లే అత్యుత్తమ వేదిక అని, ఇలాంటి అవకాశాలను ఒకసారి కోల్పోతే తిరిగి రావని, అందుకే ప్రతి విద్యార్థి ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. సక్సెస్ అంటే కేవలం డాక్టర్, ఇంజనీర్ లేదా పొలిటికల్ లీడర్ అవ్వడం కాదని, సంతోషంగా ఉండే రంగంలో రాణించడమే నిజమైన విజయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. నేటి సమాజం ఓపెన్ ప్లాట్ ఫారమ్‌లా మారి సమాన అవకాశాలు అందిస్తున్నందున, తమ లక్ష్యాల సాధనలో దృఢంగా ముందుకు సాగాలని యువతకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ఆడ-మగ సమాన అవకాశాలు సాధారణం కావాలని, దాన్ని గొప్పగా చెప్పుకోవాల్సిన అవసరం కూడా లేకుండా సమాజం అభివృద్ధి చెందాలని తెలిపారు. మహిళలు ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యాక్టర్ ఒక ఐడల్ కావొచ్చు కానీ నిజమైన హీరోలు అంబేద్కర్, భగత్ సింగ్, వివేకానందలాంటి మహనీయులు. వారి త్యాగాలు, వారి విలువలు మనకు జీవన మార్గం" అని వివరించారు. ఒక కల -దానికి జోడించిన నాలెడ్జ్ -దాన్ని సాధించేందుకు పెట్టిన డెడికేషన్ అనే మూడు సూత్రాలే విజయ రహస్యం అని యువతకు స్పష్టం చేశారు. ఈ మూడు పాటిస్తే ప్రతి ఒక్కరూ సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం పొందగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు విద్యార్థులు అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

# ఎస్టీయూ నూతన కార్యవర్గం





**నేటిసాక్షి, కరీంనగర్ :**కరీంనగర్‌లో శనివారం జరిగిన ఎస్టీయూ కౌన్సిల్ సమావేశంలో జిల్లాశాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా పిన్నింటి తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శిగా కోట శ్యాంకుమార్, రాష్ట్ర కౌన్సిలర్‌గా సాన కిషన్, జిల్లా ఉపాధ్యక్షుడిగా దాసరి సుభాష్ ఎన్నికైనట్లుగా రాష్ట్ర అధ్యక్షులు సదానందం గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజేందర్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సాజర్ ఆతా పాల్గొన్న ఈ సమావేశంలో సదానందం గౌడ్ మాట్లాడుతూ పెండిరగ్ బకాయిల హామీ మేరకు వెంటనే చెల్లించాలని, ఎన్నికల కోడ్ పేరుతో తాత్సారం చేయవద్దని, అనేకరకాల బిల్లులు మంజూరు కాక ఉద్యోగ ఉపాధ్యాయ లోకం ఇబ్బంది పడుతోందన్నారు. పించన్‌దారుల సమస్యలను పరిష్కరించాలని, టెట్ సమస్యను పరిష్కరించడానికి సుప్రీం కోర్టులో కేసు విషయాన్ని తెలుపుతూ సిలబస్ మార్పు విషయంలో ఎస్టీటీఈకి ప్రాతినిథ్యం చేయనున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు పిన్నింటి తిరుపతిరావు మాట్లాడుతూ విద్యాఉపాధ్యాయరంగ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం ఇటీవల ఎన్నికైన రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులను, ఆర్థిక కార్యదర్శిని జిల్లా కార్యవర్గం ఘనంగా సన్మానించింది. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ప్రమాణస్వీకారం అనంతరం జిల్లా కార్యవర్గం వారిని సన్మానించింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నారాయణస్వామి, దాసరి శ్రీధర్, వేణుగోపాల్, రామకృష్ణ, కిషన్, కిషన్ రావు, రవి, ఇతర జిల్లాల నాయకులు సంతోష్, సతీష్, సదానందం, గెనిగరపు రవి, మల్లేశం, తిరుపతిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఫయాజ్, దేవేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
శనివారం
22 నవంబర్ 2025



# మార్టూరులో మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

- అద్భుత భవిష్యత్తుకు బంగారు బాటలు
- విద్యార్థుల చెంతకు కార్పొరేట్ కంపెనీలు
- నైపుణ్యాన్ని పెంచుకొని ఉద్యోగాలకు సిద్ధం కావాలి
- సమర్థవంతమైన నేత సీఎం చంద్రబాబు
- 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వం లక్ష్యం
- గత ఐదేళ్లు నిర్లక్ష్యానికి గురైన యువత
- జాబ్ మేళాలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు




**నేటి సాక్షి, బాపట్ల జిల్లా (పర్చూరు):** నవ్యాంధ్రలో యువతకు అద్భుత భవిష్యత్తుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం బంగారు బాటలు వేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మార్టూరు పట్టణంలోని శ్రీహర్షిని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళా ఉత్సాహభరితంగా సాగింది. ఎన్నో జిల్లాల నుంచి వేలాదిగా వచ్చిన విద్యార్థులు, అభ్యర్థులు కార్పొరేట్ కంపెనీల నియామక ప్రక్రియల్లో పాల్గొంటూ కళాశాల ప్రాంగణం సందడిగా మారింది ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ గత ఐదేళ్లు రాష్ట్రంలో యువత పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. ప్రభుత్వ అవకాశాలు నిలిచిపోయాయి. ప్రైవేట్ ఉద్యోగాలు రాక ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయకత్వంలో యువతకు స్వర్ణయుగం ప్రారంభమైందన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన."ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అలాగే యువతను ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉద్యోగం రాకపోతే నిరాశపడకండి. మీ వద్ద ఉన్న నైపుణ్యాలను పెంచుకొని అవకాశాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి పిలుపు నిచ్చారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రతి యువత భవిష్యత్తును తీర్చిదిద్దుతుందని తెలిపారు.

## రాజధాని సమీపం - పర్చూరు యువతకు మరిన్ని అవకాశాలు

పర్చూరు నియోజకవర్గం రాజధానికి సమీపంలో ఉండటం వల్ల భవిష్యత్తులో పరిశ్రమలు, ఐటీ విభాగాలు పెద్దఎత్తున అభివృద్ధి చెందనున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న రోజుల్లో విద్య, పరిశ్రమలు, ఉద్యోగాలు అన్నీ మన పరిసర ప్రాంతాల్లోనే విస్తరించనున్నాయని పేర్కొన్నారు. యువత నైపుణ్యాలను పెంచుకొని ఉద్యోగ అవకాశాల కోసం సిద్ధంగా ఉండాలని అన్నారు.

## 16 జాతీయ కంపెనీలు

దేశవ్యాప్తంగా పేరుప్రఖ్యాతి గల 16 జాతీయ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొని నియామక ప్రక్రియను నిర్వహించాయి. ఐటీ, మార్కెటింగ్, హెల్త్‌కేర్, సేల్స్, మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్, సర్వీసెస్ వంటి అనేక విభాగాల్లో వందలాది ఉద్యోగాలను ప్రకటించడంతో అభ్యర్థుల్లో ఉత్సాహం నెలకొంది. కంపెనీల ప్రతినిధులు యువతలో కనిపించిన నైపుణ్యాలు, ప్రతిభను అభినందించారు. ఎంపికైన అభ్యర్థులకు మేళా ప్రారంభంలోనే ఆఫర్ లెటర్లు అందజేయడం విశేషం.

## యువత ఉత్సాహం - నిర్వాహకుల సంతృప్తి

జాబ్ మేళాలో పాల్గొన్న విద్యార్థులు, అభ్యర్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించుకోవడానికి లభించిన అవకాశంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేళా ద్వారా పర్చూరు నియోజకవర్గంతో పాటు సమీప మండలాల యువతకు మంచి ఉపాధి అవకాశాలు లభించాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హర్షిని కళాశాల కరస్పాండెంట్ గోరంట్ల రవికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకటరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి లవన్న ,రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ మేనేజర్ మాధవి, ఉన్నతాధికారులు, కళాశాల నిర్వాహకులు, అధ్యాపకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ రామలింగేశ్వర ఆలయంలో జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు



**నేటి సాక్షి - మల్లాపూర్ ( మహేష్ పెంబి ) :** పురాతన శ్రీ రామలింగేశ్వర ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. రత్న పద్మావతి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో జడ్జిని స్వాగతించి గర్భగుడిలో పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్ర, పురాతనతపై అర్చకులు ఆమెకు వివరాలు తెలియజేశారు. అనంతరం ఆలయ తరఫున శాలువా కప్పి సన్మానించి, దేవాలయం ప్రతిమను బహుకరించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి యస్. నారాయణ, మెట్ పల్లి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు, జూనియర్ సివిల్ జడ్జిలు నారం అరుణ్ కుమార్, కాసుల్ల పావని, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

# మహా పాదయాత్ర భక్తిభవానికి నిదర్శనం



- శివ స్వాముల 12వ మహా పాదయాత్రకు భక్తుల విశేష స్పందన
- జగద్గిరిగుట్ట నుంచి శ్రీశైలం దాకా భక్తి నడకయాత్ర
- భక్తి, సేవ, సనాతన ధర్మప్రచారానికి మార్గదర్శిగా పాదయాత్ర

**నేటి సాక్షి కుత్బుల్లాపూర్ నవంబర్ 22 :** జగద్గిరిగుట్ట ప్రతి సంవత్సరం కార్తీక మాసం సమీపించగానే జగద్గిరిగుట్ట ప్రాంతం భక్తి సంద్రమై మారుతుంది. ఆ భక్తి ప్రవాహంలో 12వ మహా పాదయాత్రకు శనివారం ఉదయం ఘనంగా శ్రీకారం చుడుతున్నారు శివస్వాములు. కొలుకుల సత్యనారాయణ (బండి) శివ గురు స్వామి ఆధ్వర్యంలో, మగ్దుమ్‌నగర్ శివ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం నుండి శ్రీశైలం మల్లికార్జున స్వామివారి ఆలయానికి ఈ భక్తి ప్రయాణం ఆరంభం కానుంది. గత 11 ఏళ్లుగా నిర్విరామంగా కొనసాగుతున్న ఈ పాదయాత్రకు జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కొలుకుల జగన్ శివ స్వామి ముందుండి ప్రతి సంవత్సరం సుమారు 70 మంది శిష్యగణంతో పాల్గొంటున్నారు. కార్తీకమాసం మొదటి రోజు మాలధారణతో ప్రారంభమయ్యే ఈ ఆధ్యాత్మిక ప్రయాణంలో శివస్వాములు అయ్యప్ప స్వాములకు, శివునికి భక్తి సేవలు నిర్వహిస్తూ ప్రజల్లో ధార్మిక విలువలను పెంపొందిస్తున్నారు.

## ఆరంభ రోజు నుంచే ఆధ్యాత్మిక వాతావరణం

మొదటి రోజు ఉదయం 4:30 గంటలకు జగద్గిరిగుట్ట దేవస్థానంలో శివుడికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శివస్వాముల చేత కొబ్బరికాయలు కొట్టించి “ఓం నమః శివాయ” జపధ్వనులతో పాదయాత్ర ప్రారంభం అవుతుంది. ప్రథమ దర్శనంగా బల్కంపేట రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో ఆశీస్సులు పొంది మధ్యాహ్నం అఫ్జల్గంజ్ ఆశ్రమంలో బిక్ష కార్యక్రమం ముగించుకుని రాత్రి పహాడీ షరీఫ్ ఆశ్రమం వద్ద బస చేస్తారు.

## శివస్వాముల ఉత్సాహం - పాదయాత్ర

## విజయానికి బలం

“ఈ పాదయాత్రను మహోత్సవంగా నిలిపేది శివస్వాముల అంకితభావమే” అని 126వ డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ శివ గురు స్వామి తెలిపారు. ప్రతి ఏడాది పాల్గొనేవారి సంఖ్య పెరుగుతూ, ఈ యాత్ర ఒక ఆధ్యాత్మిక జాతరగా మారిందని పేర్కొన్నారు. ప్రాంతం నలుమూలల నుంచి శివస్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్ర వైభవాన్ని మరింత పెంచుతున్నారని ఆయన అన్నారు.

## పది రోజుల పాదయాత్ర - ఆధ్యాత్మిక మార్గసంచరణ

1వ రోజు: జగద్గిరిగుట్ట నుండి పహాడీ షరీఫ్ ఆశ్రమం 2 వ రోజు: పహాడీ షరీఫ్ నుండి కందుకూరు ఫంక్షన్ హాల్ 3వ రోజు: కందుకూరు నుండి ఆమనగల్ ఫంక్షన్ హాల్ 4 వ రోజు:ఆమనగల్ నుండి కల్వకుర్తి హనుమాన్ దేవస 5వ రోజు : కల్వకుర్తి నుండి హాజీపూర్ హనుమాన్ దేవస్థానం 6వ రోజు: హాజీపూర్ నుండి మన్ననూరు చెక్‌పోస్ట్ 7 వ రోజు: మన్ననూరు నుండి వత్వర్లపైయ్ ప్రభుత్వ గురుకుల పాఠశాల 8వ రోజు: వత్వర్లపైయ్ నుండి దోమలపెంట రామాలయం 9వ రోజు: దోమలపెంట నుండి అటకేశ్వరం ఆశ్రమం – పాలధార – పంచదార 10వ రోజు: అటకేశ్వరం ఆశ్రమంలో ఇరుముడి సమర్పణతో పాదయాత్ర సమాప్తి ఇరుముడి సమర్పణతో యాత్ర ముగింపు – ఆధ్యాత్మిక శిఖరం చివరి రోజు అటకేశ్వరం ఆశ్రమంలో స్వాములందరూ ఇరుముడి సమర్పణ చేసి పాదయాత్రను ముగించుకుంటారు. ఈ పది రోజుల ప్రయాణం శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా శివభక్తులను మరింత పటిష్టం చేస్తుంది. భక్తి, సేవ భావనలతో శ్రీశైలం వైపు సాగుతున్న ఈ నడకయాత్ర ప్రాంతీయులలో ఆధ్యాత్మిక స్ఫూర్తిగా నిలుస్తోంది.

# రిపోర్టర్ షఫీ ని కలిసిన- ఎం ఎల్ సి- ఎల్. రమణ



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెల్ల బాపు) :** జగిత్యాల ఐ న్యూస్ ఛానల్ రిపోర్టర్ షఫీ అనారోగ్యంతో హైదరాబాద్ బంజారా హిల్స్ రెనోవో హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా హాస్పిటల్ లో వైద్యులను కలిసి షఫీ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న కరీంనగర్ ఎమ్మెల్సీ ఎల్. రమణ,ఈ సందర్భంగా షఫీ వైద్య ఖర్చులకు తన వంతు ఆర్థిక సహాయం చేస్తామని తెలిపారు.

# చట్టాలపై అవగాహన తప్పనిసరి

- జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి

**నేటి సాక్షి - మల్లాపూర్ ( మహేష్ పెంబి ) :** యువతతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థులందరికీ చట్టాలపై సరైన అవగాహన అవసరమని జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిట్టూరి రత్న పద్మావతి అన్నారు. శనివారం మెట్ పల్లి మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మల్లాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్‌లో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

## చట్టం తెలీదని చెప్పడం..బాధ్యతారాహిత్యం

ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ.. నేటి కుమారులు, కుమార్తెలు తమ వృద్ధాప్య తల్లిదండ్రులను పోషించడం చట్టపరమైన బాధ్యత అని స్పష్టం చేశారు. తప్పులు చేసిన తర్వాత ‘చట్టం తెలియదు’ అనటం బాధ్యతారాహిత్యమని విద్యార్థులకు హెచ్చరించారు. క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు పాఠశాలలో కీ.శే. రుద్ర బుచ్చిరాజం స్మారకార్థం నిర్మించిన సరస్వతి మాత విగ్రహాన్ని ఆవిష్కరించిన ఆమె చదువుల తల్లి విగ్రహ ఆవిష్కరణ తనకు మరచిపోలేని అనుభూతిగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు



న్యాయమూర్తి సుగాలి నారాయణ, సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు, జూనియర్ సివిల్ జడ్జిలు నారం అరుణ్ కుమార్, కాసుల్ల పావని, డీఎస్పీ రాములు, జిల్లా విద్యాధికారి రాము, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తోగిటి రాజశేఖర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్దుల్ హఫీజ్, రిటైనర్ లాయర్ కాజీపేట ప్రవంతి, కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు బైరి విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కొంపెల్లి సురేష్, సీఐ అనిల్ కుమార్, ఎస్సైలు రాజు, కిరణ్ కుమార్, అనిల్, ప్రిన్సిపాల్ మచ్చుకంటి భూమేశ్వర్, తహసీల్దార్ రమేష్ గౌడ్, యంఈవో దామోదర్ రెడ్డి, విగ్రహ దాత రుద్ర రాం ప్రసాద్, లోక్ అదాలత్ ప్రతినిధులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సంజయ్



**నేటి సాక్షి - మల్లాపూర్ ( మహేష్ పెంబి :** మల్లాపూర్ మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మల్లాపూర్ మండలానికి చెందిన 33మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శనివారం పంపిణీ చేసారు.

**డబ్బులడిగితే రోకలిబండతో కొట్టండి:** ఇందిరమ్మ ఇండ్లకు డబ్బులు వసూలు చేస్తున్నారని వరుస ఫిర్యాదులు వస్తున్నాయని ,ఎవరైనా డబ్బులు అడిగితే రోకలి బండతో కొట్టండి..నేనే జైలుకు వెళ్త అని ఎమ్మెల్యే అన్నారు. డబ్బులు అడిగితే నేరుగా కాల్ చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ తెలిపాడు. కార్యక్రమం లో వివిధ గ్రామాల లబ్ధిదారులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు కేంద్ర పథకాలు అందించాలి

- అధికారులు చిత్తశుద్ధితో ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పేద బడుగు బలహీన వర్గాల ఉన్నతి కొరకు పనిచేయాలి
- దిశా చైర్మన్ మరియు తిరుపతి ఎం.పి. గురుమూర్తి
- అర్హులైన పేదలకు, లబ్దిదారులు ప్రజా సంక్షేమ పథకాలు అందించాలి
- దిశా సమావేశానికి గైర్హాజరు అయితే చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్




**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :**తిరుపతి, నవంబర్ 22: అర్హులైన పేదలకు కేంద్ర పథకాలు ప్రజలకు తప్పక అందించాలని, అధికారులు చిత్తశుద్ధితో ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పేద బడుగు బలహీన వర్గాల ఉన్నతి కొరకు పనిచేయాలని తిరుపతి ఎం.పి. మరియు దిశా చైర్మన్ ఎం. గురుమూర్తి అధికారులను ఆదేశించారు. తిరుపతి జిల్లా సమన్వయ అభివృద్ధి మరియు పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో గతంలో చర్చించిన పలు అంశాలపై తీసుకున్న చర్యలపై సంబంధిత అధికారులతో తిరుపతి పార్లమెంట్ సభ్యులు, దిశా చైర్మన్ ఎం. గురుమూర్తి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తో కలసి సమీక్ష నిర్వహించారు. శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై శాఖల వారిగా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తూ పార్లమెంట్ సభ్యులు మరియు దిశా చైర్మన్, జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మరియు దిశా చైర్మన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధాన మంత్రి గ్రామ ఆదర్శ యోజన, ఎం.జి.ఎన్.ఆర్.ఈ జి.ఎస్., పి.ఎం కుసుం, పి.ఎం సూర్య ఘర్ తదితర పథకాలను అర్హులైన లబ్దిదారులకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఇటివల ముంతా తుఫాన్ నేపథ్యంలో కె.వి.బి పురం మండలము లో రాయలచెరువు గండి పడడం వల్ల కలత్తూరు గ్రామములో తీవ్రంగా నష్టపోయిన గ్రామస్తులకు ఆర్థికముగా అన్ని విధములుగా సహాయ సహకారములు అందించాలని, రైతుల పొలాల్లో ఇసుక మేటలను తొలగించుకొనుటకు, ఆవులు, గేదెలు, మేకలు, కోళ్ళు కోల్పోయిన వారికి, పంట నష్టం కలిగిన వారికి తిరిగి వ్యవసాయము చేసుకోనుటకు రైతులకు కావలసిన విత్తనములు సరఫరా చేయుటకు సంబందిత అధికారులు తగు చర్యలు తీసుకోనవాలన్నారు. రైతులకు పంట నష్టం కలిగినందున ఇన్సురెన్స్ నగదును వారికి చెల్లించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ఎం.పి. ల్యాడ్స్ నిధుల వినియోగంలో జాప్యము జరుగుతున్నందున తిరిగి ప్రభుత్వం నుండి నిధులు కేటాయింపులో ఆలస్యం జరుగుతున్నదని కావున అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అదనంగా నిధులను కోరుటకు అవకాశం ఉంటుందన్నారు . SC, ST లు సాగు చేసుకోనుచున్న భూములలో పట్టాలు మంజూరులో అటవీ శాఖకు సంబందించిన భూముల విషయములో సమస్యలు ఎదురవుతున్నందున రెవెన్యు మరియు అటవీ శాఖ అధికారులు సమన్వయంతో వారి యొక్క సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశానికి స్థానికంగా ఉన్న ఎం పి పి లు, ఎం పి టి సి లు , సర్పంచులను కార్యక్రామాలకు ఆహ్వానించడం ద్వారా కార్యక్రమంలో చర్చలు జరుగుతున్న అంశాలు, నిర్ణయాలు వారికి కూడా తెలిసే అవకాశం ఉంటుందని ఇలాంటి సమావేశాలలో వాటి సంబందించిన ప్రస్తావనలు తెలుపుటకు వారికి అనుకూలం ఉంటుందన్నారు. తదుపరి సమావేశం ఫిబ్రవరి మాసంలో ఉంటుందని తెలిపారు. సమావేశానికి సంబంధించిన సమాచారం గౌరవ సభ్యులకు ఇవ్వబడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు అందే ప్రతి శాఖ ఈ సమావేశానికి తప్పక హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. వారు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబందించిన ఎ.టి.ఆర్. రిపోర్ట్ లను సమావేశానికి అందించాలన్నారు. గత దిశ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై పంచయాతీ రాజ్, మునిసిపాలిటి, డ్వామా, గృహనిర్మాణ శాఖ, టిడ్కో, అగ్రికల్చర్ ,ఇరిగేషన్, పశు సంవర్ధక శాఖ, ఐ సి డి ఎస్, ఆరోగ్య శాఖ, జలవనరుల శాఖ, విద్యా శాఖ, ట్రాన్స్కో, గనుల శాఖ, సివిల్ సప్లై , పరిశ్రమలు , సంక్షేమ శాఖలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన నిధులను నిర్దేశించిన గడువులోగా అభివృద్ధి కార్యక్రమాలకు సంబందిత శాఖల అధికారులు నిధులను వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందించడంలో అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలనీ సూచించారు. తదుపరి అన్ని శాఖల వారు సమన్యయముతో పనిచేసి పురోగతి సాధించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల జిల్లా పరిషత్ సి ఈ ఓ రవి కుమార్ నాయుడు, నెల్లూరు జిల్లా సి ఈ ఓ మోహన్ కుమార్, జిల్లాలోని మునిసిపల్ చైర్మెన్ లు , మునిసిపల్ కమిషనర్ లు , సోషల్ వెల్ఫేర్ డి డి విక్రం కుమార్ రెడ్డి, డి పి ఓ సుశీలా దేవి ,డి ఆర్ డి ఎ పిడి శోభన్ బాబు, డ్వామ పి డి శ్రీనివాస రావు, డి ఎం అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, డి ఈ ఓ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్, ల్యాండ్ అండ్ సర్వే ఎ డి అరుణ్ కుమార్, ఐ సి డి ఎస్ పిడి వసంత బాయ్ , గనుల శాఖ అధికారి బాలాజీ నాయక్, కార్మిక శాఖ అధికారి చిన్న లాలప్ప , తిరుపతి స్మార్ట్ సిటి మేనేజర్ చంద్ర మౌళి , నేషనల్ హైవే పిడి, సంబందిత జిల్లా అధికారులు , తిరుపతి మునిసిపల్ డిప్యూటి మేయర్ ఆర్ సి ముని కృష్ణా , ఎం పిపి లు,సంబందిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 33 శాతం మహిళ వార్డు సభ్యుల రిజర్వేషన్లు



**నేటి సాక్షి నారాయణపేట నవంబర్ 22 :** నారాయణపేట జిల్లాలోని మక్తల్ మండలం పరిధిలోని 39 గ్రామపంచాయతీలో 33% శాతం మహిళా వార్డు సభ్యుల రిజర్వేషన్ల లక్కీ ద్వారా తీస్తున్న సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ తరఫున మండల పరిషత్ కార్యాలయం లో శనివారం మధ్యాహ్నం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి నరసింహ గౌడ్ టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చిన్న హనుమంతు వివిధ పార్టీల నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్మశానవాటికను కాపాడి న్యాయం చేయాలని వినతి



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** కలకడ మండలం కోనగ్రామానికి చెందిన సర్వే నెంబర్ 394 లో ఎస్సీలకు కేటాయించిన స్మశాన వాటికను ఒక ప్రైవేట్ వ్యక్తి కబ్జా చేసి తన పొలానికి దారి వేశారని గత నెల జిల్లాలో జరిగిన డీవీఎంసీ సమావేశంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు జిల్లా కలెక్టర్ దృష్టికి తెలియజేయడంతో కలెక్టర్ గారు వెంటనే స్పందించి కబ్జాకు గురైన ఎస్సీలకు కేటాయించిన స్మశాన వాటికకు హద్దులు చూపించాలని కలకడ మండల తహసిల్దార్ కు ఆదేశించడంతో తక్షణమే తహసీల్దారు మండల సర్వేయర్ దేవి నీ సంఘటన స్థలాన్ని పరిశీలించాలని ఆదేశించడంతో ఈరోజు మండల సర్వే దేవి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులతో కలిసి కోన పంచాయితీ ఎస్సీ కాలనీ వాసులకు కేటాయించిన స్మశాన వాటికను పరిశీలించడం జరిగిందని అందులో కొంత కబ్జాకు గురైందని త్వరలో ఎస్సీలకు కేటాయించిన స్మశాన వాటికను సర్వే చేసి హద్దులు చూపిస్తామని తహసిల్దార్ దేవి తెలిపార పాలకుంట ని శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రామకృష్ణ, కలకడ మండల తెదేపా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాదు రామాంజులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టాస్క్ ఫోర్స్ అదనపు ఎస్పీగా భాధ్యతలు స్వీకరించిన కులశేఖర్



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) అదనపు ఎస్పీగా జె. కులశేఖర్ గారు శనివారం బాధ్యత లు స్వీకరించారు. గతంలో ఆయన తిరుపతి ఎఎస్పీ (శాంతి భద్రతలు) గా పని చేశారు. ఆయనను టాస్క్ ఫోర్స్ కు అటాచ్ చేయడంతో శనివారం బాధ్యతలు స్వీకరించారు. తరువాత ఆయన టాస్క్ ఫోర్స్ హెడ్, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు గారిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ గారితో సమావేశమయ్యారు. ఎఎస్పీ గారికి టాస్క్ ఫోర్స్ పనితీరు గురించి వివరించారు.

# డి ఏ లను వెంటనే విడుదల చెయ్యండి




- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన 5 డి ఏ లను వెంటనే విడుదల చెయ్యండి
- టీఎన్జీవో ఎస్ యూనియన్ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి....

**నేటి సాక్షి నారాయణపేట, నవంబర్ 22 :** నారాయణ పేట జిల్లా ఎన్నికల లో భాగంగా శనివారం మరికల్ యూనిట్ ఎన్నికలను రైతు వేదిక మరికల్ నందు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా మహబూబ్ నగర్ టీఎన్జీవో యూనియన్ జిల్లా అధ్యక్షులు , నారాయణ పేట జిల్లా కన్వీనర్, రాజీవ్ రెడ్డి గారు ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న 5 డి ఏ లను, పెండింగ్ లో ఉన్న అన్ని బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ , ఉద్యోగుల సమస్యల సాధన కోసం యునియన్ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ గారు, ప్రధాన కార్యదర్శి ముజీబ్ గారు రాష్ట్ర ప్రభుత్వం పెద్దలతో నిరంతరం చర్చలు జరుపుతున్నారని పేర్కొన్నారు, ఈ కార్యక్రమము లో మహబూ నగర్ జిల్లా కార్యదర్శి, నారాయణ పేట కో కన్వీనర్ చంద్రా నాయక్ , కేంద్ర సంఘ కార్యవర్గ సభ్యులు దేశాయి నందా కిషోర్,జిల్లా సీనియర్ నాయకులు నరసిహ రెడ్డి, మోలే దామోదర్, మక్తల్ తాలూకా అధ్యక్షుడు మునవర్ అలి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు , ఎన్నికల అధికారి బాలరాజు నిర్వహించిన్నారు. మరికల్ యూనిట్ అధ్యక్షులు శ్రీ బర్ద్వాజ్ గౌడ్, కార్యదర్శిగా..రమేష్ కుమార్ ఉపాధ్యక్షులు.. 1) శ్రీశైలం 2) లింగప్ప 3) విజయ్ కుమార్ 5) జైన్ సింగ్ జాయింట్ సెక్రటరీ యు.పద్మ కోశాధికారి.. కె. వెంకటేష్ ఆర్గనైజింగ్ సెక్రటరీ. ఎం. కృష్ణ రెడ్డి పబ్లిసిటీ సెక్రటరీ. నజీరుద్దీన్ ఈసీ మెంబెర్ లు, సత్యనారాయణ, యశోద తదితరులు పాల్గొన్నారు..

# ఇంటర్న్‌షిప్‌పై అవగాహన సదస్సు

- డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్న్‌షిప్‌పై అవగాహన సదస్సు




**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల ) :**వెదురుకుప్పం, నవంబర్ 22: స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో నేడు (శనివారం) విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డా.బి.అన్నపూర్ణ శారద అధ్యక్షత వహించారు. తిరుపతికి చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ సత్వ ఇన్ఫోటెక్ సహకారంతో ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్వ ఇన్ఫోటెక్ ప్రతినిధులు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని వారు తెలిపారు. ముఖ్యంగా స్వల్పకాలిక , దీర్ఘకాలిక ఇంటర్న్‌షిప్‌ల విధివిధానాలు, వాటి ద్వారా లభించే సాంకేతిక నైపుణ్యాలు మరియు భవిష్యత్తులో అవి కల్పించే ఉద్యోగ అవకాశాల గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.బి.అన్నపూర్ణ శారద మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం తరగతి గది చదువులకే పరిమితం కాకుండా, ఇంటర్న్‌షిప్‌ల ద్వారా ఆచరణాత్మక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను ఇప్పుడే నేర్చుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవచ్చని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. బి.ఎల్.పి. లత మాట్లాడుతూ.. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సత్వ ఇన్ఫోటెక్ వారు అందిస్తున్న శిక్షణ మరియు అవగాహన విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ సమన్వయకర్తలు, అధ్యాపక బృందం మరియు అధిక సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
శనివారం
22 నవంబర్ 2025



# ఆయిల్ ఫామ్ సాగుతో రైతుల ఇంట సిరుల పంట

- ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వ రాయితీలు
- 250 ఎకరాల్లో పామాయిల్ సాగుకు సిద్ధమైన రైతులు
- ఉచితంగా ఆయిల్ ఫామ్ మొక్కల పంపిణీ
- మార్టూరు ప్రాంతంలో ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలి
- మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి



**నేటి సాక్షి, బాపట్ల జిల్లా (పర్చూరు):** ఆయిల్ ఫామ్ సాగుతో ప్రతి రైతు ఇంట సిరుల పంట పండిస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం మార్టూరు మండలంలో పామ్ ఆయిల్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఏలూరి శ్రీకారం చుట్టారు. ఇసుక దర్శి కోనంకి గ్రామాల మధ్య ఆయిల్ ఫామ్ మొక్కలను ఎమ్మెల్యే ఏలూరి నాటారు. అనంతరం రైతులకు ఆయిల్‌ఫాం మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ మార్టూరు ప్రాంతంలో ఆయిల్ ఫ్యాన్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. రైతులకు స్థిర ఆదాయంపామాయిల్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు.రైతుల ఆదాయం పెరగడానికి, సాగు ఖర్చులు తగ్గడానికి పామాయిల్ పంట ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఉచిత మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్‌పై భారీ సబ్సిడీలు, కొనుగోలు హామీ వంటి ప్రయోజనాలు కల్పిస్తోందన్నారు. దీర్ఘకాలికంగా రైతులకు లాభం చేకూర్చే పంట ఇది. మార్టూరు మండల రైతులు ముందడుగు వేయడం అభినందనీయం" అన్నారు.అలాగే పామాయిల్ పంటకు మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉందని, నూనె దిగుమతులపై దేశం అధిక మొత్తంలో ఖర్చు చేస్తున్న నేపథ్యంలో స్థానిక ఉత్పత్తిని పెంచడం అత్యవసరమని పేర్కొన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఖలీల్ మాట్లాడుతూ పామాయిల్ సాగులో రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం అత్యధికమన్నారు. ప్రతి రైతుకు ఉచితంగా నాణ్యమైన మొక్కలు అందజేస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకట్రావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఉపాధ్యక్షుడు ఉప్పలపాటి చక్రపాణి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి లవన్న, తాసిల్దార్ ప్రశాంతి, అజంత సోయ లిమిటెడ్ మేనేజర్ భాష, హార్టికల్చర్ అధికారి హనుమంతు నాయక్, వ్యవసాయ అధికారి లావణ్య, పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు నాయకులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన వరి ధ్యానం ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది



- వరి లో తేమ 17 శాతం కంటే తక్కువగా ఉండాలి
- ఏ గ్రేడ్ వరి రకం రూ.2389
- సాధారణ రకం రూ.2369
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

**నేటి సాక్షి బాపట్ల జిల్లా (చెరుకుపల్లి):** జిల్లాలో రైతులు పండించిన వరి ధ్యానం ప్రభుత్వం కొనుగోలుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు.శనివారం చెరుకుపల్లి మండలం, గుడువల్లి గ్రామం నందు రైతు సేవా కేంద్రం లోని వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి రైతు పండించిన వరి ధాన్యం ను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఎవ్వరు కూడ ఆందోళన పడవలసి అవసరం లేదని రైతులకు చూచించారు.ర ైతులకు అవసరమైన అందరికి గోని సంచులు,టారపల్ పట్టాలు అంద జేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు వరి ధాన్య మును బాగా ఎండిన తర్వాత నే మీ సమీపంలోని వరి కొనుగోలు కేంద్రానికి తీసుకు రావాలన్నారు. వరి లో 17 శాతం కంటే తక్కువ తేమ ఉండేలా రైతులు గుర్తించుకోవలన్నారు.ఏ గ్రేడ్ వరి రకం రూ.2389,సాధారణ రకం రూ.2369 ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. జిల్లా లో 117 కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.గత సంవత్సరం లో జిల్లాలో 90 వేల క్వింటాలు కొనుగోలు చేయడం జరిగిందని,ఈ సంవత్సరం 2 లక్షల క్వింటాలు వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సరాఫరాల శాఖ డి యం.శివపార్వతి, డి ఎస్ ఓ.సిబ్బంది రైతులు తదితరులు ఉన్నారు.

# ఘనంగా ఆలూమ్ని మీట్ 1989-2015 కార్యక్రమం

- నవజ్యోతి" హైస్కూల్లో ఘనంగా ఆలూమ్ని మీట్ 1989 - 2015 కార్యక్రమం
- కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**నేటి సాక్షి కుత్బుల్లాపూర్ నవంబర్ 22:** 128 - చింతల్ డివిజన్ ఐడిపిఎల్ చౌరస్తాలోని నవజ్యోతి హై స్కూల్ నందు పూర్వ విద్యార్థుల (1985- 2015) సమ్మేళనంలో భాగంగా నిర్వహించిన ఆలుమ్ని నీట్ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులతో, పూర్వ విద్యార్థులు పాఠశాలల ఉపాధ్యాయులు, వారికి ఉన్న అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు.అనంతరం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ... పాఠశాల యాజమాన్యం పూర్వ విద్యార్థుల సమ్మేళనం కోసం ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీ యమన్నారు. పూర్వ విద్యార్థులు వారి, వారి రంగాలలో గల విషయ పరిజ్ఞానాన్ని మార్పిడి ద్వారా ఇతరులతో పంచుకొని అభివృద్ధి చెందినపుడే చదువు చెప్పిన పాఠశాలకు, పుట్టిన ఊరికి మంచి పేరు గండించ వచ్చున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ఇందిరా మలిరెడ్డి, పాఠశాల వ్యవస్థాపకులు రవీందర్ రెడ్డి బొమ్మారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణారెడ్డి మలిరెడ్డి, ప్రిన్సిపాల్ రూపాంజలి బొమ్మ రెడ్డి, అకాడమిక్ ఇంచార్జ్ రామిరెడ్డి, శ్రేయోభిలాషి శాస్త్రి, డివిజన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు జల్దా లక్ష్మీనాథ్, క్రాంతి యాదవ్, కార్తీక్ గౌడ్, బంటి, బాలు నేత, ఇర్ఫాన్, అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం నవంబర్ 22:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో.... వందేమాతరం జాతీయ గీతం 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా, తెలంగాణ భారతీయ జనతా రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మహేశ్వరం నియోజకవర్గంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం మండల అధ్యక్షులు యాదీష్ ఆధ్వర్యంలో మహేశ్వరం మండలంలోని మన్సాన్ పల్లి చౌరస్తాలో వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులతో వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.."వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణనిచ్చిన మహోగ్ర గీతం అని 150 ఏళ్ల తర్వాత కూడా అదే స్ఫూర్తిని నేటి యువతలో నింపే శక్తి దీనిలో ఉందని కొనియాడారు. జాతీయత, దేశభక్తి భావాలను బలోపేతం చేయడానికి బీజేపీ ప్రతిస్థాయిలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తోంది," అని పేర్కొన్నారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పాఠశాల యాజమాన్యాన్ని, అధ్యాపకులను, పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కుండె వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు వనంపల్లి శ్రవణ్, ఉపేందర్, మునావత్ దేవేందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మల్లేష్ యాదవ్, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అమీర్ పేట్ గ్రామానికి 10 లక్షల రూపాయల నిధులు

## లక్ష్మారెడ్డికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేసిన గ్రామస్తులు




**నేటిసాక్షి ప్రతినిధి మహేశ్వరం నవంబర్ 22 :**భూమి పూజ చేసిహెచ్ యాదయ్యసిన మహేశ్వరం నియోజకవర్గం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య, మహేశ్వరం మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆవుల యాదయ్య రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేఎల్ఆర్ కృషితో అమీర్‌పెట్ గ్రామంలో డీమఫ్ట్ ఫండ్ నిధులు పది లక్షల రూపాయలు నూతన డ్రైనేజీలకు కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసిన అమీర్‌పెట్ గ్రామ ప్రజలు, ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న,మహేశ్వరం నియోజకవర్గం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య,వీరితో పాటుగా మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆవుల యాదయ్య,అమీర్‌పెట్ గ్రామ శాఖ అధ్యక్షులు హైతాబాద్ రాజేందర్,మాజీ వార్డ్ మెంబర్ సభ్యులు మరియు ఇంద్రమ్మ కమిటీ సభ్యులు కడల భాస్కర్,మాజీ వార్డ్ మెంబర్ సభ్యులు,సాంబ మల్లేష్,శ్రీ వెంకటేశ్వర దేవాలయ కమిటీ అధ్యక్షులు కరన్ కోట్ మల్లికార్జున్,చాకలి యాదయ్య ,మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డప్పు నరసింహ,కెజె ప్రసాద్ ,బాలకృష్ణ ,సోషల్ మీడియా ఎర్ర నవీన్ కుమార్,గ్రామ పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ముందుండాలి



**నేటి సాక్షి,నల్లబెల్లి నవంబర్:22:** నల్లబెల్లి ఉన్నత పాఠశాలకు చెందిన హారిక, మహాలక్ష్మి, అక్షిత లు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు.రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్ విభాగాలలో ప్రావీణ్యం సాధించిన చిన్నారులను పి ఆర్ టి యు టి ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఘన సన్మానం జరిపారు.అధ్యక్షుడు ఉడుత రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ముందుండాలి. ప్రతిభావంతులైన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మరింత రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.వారి ఎంపికకు కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ శంకరయ్య, ప్రధానోపాధ్యాయురాలు అంబి వసంత, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు లడే రవీందర్, డి.శ్రీధర్‌బాబు, పురం. బద్రీనాథ్,జిల్లా బాధ్యులు కే.నాగరాజు, శనిగరం శ్రీనివాస్,సీనియర్ ఉపాధ్యాయులు ఏ.పద్మజ, బి.ప్రమీల, కె.భారతి ఇతరులు పాల్గొన్నారు.విద్యార్థులను మరింత శ్రద్ధగా అభ్యసించి రాష్ట్ర స్థాయిలో పేరు తెచ్చుకోవాలని పలువురు ఆకాంక్షించారు.పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.

# స్వర్ణరథంపై శ్రీ మహాలక్ష్మి కటాక్షం



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :**తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన శనివారం సాయంత్రం అమ్మవారు స్వర్ణరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 4.20 గంటల నుండి ఆలయ మాడ వీధుల్లో ఈ ఉత్సవం జరిగింది.కాంతులీనుతున్న స్వర్ణ రథంపై శ్రీ పద్మావతి అమ్మవారు విశేష స్వర్ణ, వజ్రాభరణాలను ధరించి భక్తులకు కనువిందు చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని స్వర్ణరథాన్ని లాగారు.ఈ కార్యక్రమంలో జేఈవో వి.వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ హరేంద్రనాథ్, ఎస్ ఇ- 3 జగదీశ్వర్ రెడ్డి, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆటో బోల్తా-ముగ్గురికి గాయాలు

**ఇందిరా మహిళా శక్తి చీరలు తీసుకెళ్తుండగా ప్రమాదం**



**నేటి సాక్షి, బెజ్జంకి :** బెజ్జంకి మండలంలో ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ముగ్గురు మహిళలు గాయపడ్డారు. బెజ్జంకి మండల కేంద్రం నుంచి దేవక్కపల్లి గ్రామానికి ఇందిరా మహిళా శక్తి చీరలను తీసుకెళ్తున్న ఆటో దాచారం స్టేజి సమీపంలో రోడ్డుపై నియంత్రణ కోల్పోయి పక్కకు ఒరిగింది. ఈ ప్రమాదంలో దేవక్కపల్లి గ్రామానికి చెందిన మార్క పుశవ్వకు కాలికి, తలకు తీవ్ర గాయాలు కాగా, నోముల లహరి, చౌటపల్లి సౌజన్య స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# రాజనాల బండ పై ప్రత్యేక పూజలు



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి నవంబర్ 22 :** రాష్ట్రంలోని సత్య ప్రమాణాలకు పేరుగాంచిన మండలంలోని రాజనాల బండ పై శనివారం విశేష పూజలు జరిగాయి టీటీడీ ఆధ్వర్యంలో ఉదయాన్నే ప్రధానార్చకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శ్రీ నరసింహ స్వామి క్షేత్రపాలకుడు ప్రసన్న ఆంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొందరు ప్రమాణాలు చేయగా మరికొందరు వాయిదాలు వేసుకొని వెళ్లారు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు టీటీడీ సిబ్బంది సేవలు అందించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి నవంబర్ 22 :** మండల కేంద్రమైన చౌడేపల్లిలోని కళ్యాణ మండపాల్లో జరుగుతున్న వివాహ మహోత్సవాలకు మాజీమంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు స్థానిక బైసాని కళ్యాణ మండపంలో సోమల మల్లికార్జున రెడ్డి కుమారుడు శ్రీ లక్ష్మీ శ్రీనివాస కళ్యాణం మండపంలో పి ఎల్ కొత్తూరు ఆర్ నర్సింహారెడ్డి కుటుంబంలోని వివాహ మహోత్సవాలకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, జంగాలపల్లి రమణ, చంద్ర, శంకరనారాయణ, కృష్ణమూర్తి,పవన్, రాయల్, షంషీర్, అనుప్రియ, అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నరసింహులపేటలో ఆటో డ్రైవర్ మానవత్వం!

**మరిచిపోయిన డబ్బుల కవర్‌ను నిజాయితీగా తిరిగి ఇచ్చిన ఎర్ర రవి**



**నేటి సాక్షి మహబూబాబా ద్ (భూక్యా రవి నాయక్) నవంబర్ 22 :** నరసింహుల పేటలో ఒక వృద్ధుడు ఆటోలో ప్రయాణించే సమయంలో డబ్బులు, మందులు, బట్టలు ఉన్న కవర్‌ను అనుకోకుండా మర్చిపోయారు. ఆ కవర్‌ను గుర్తించిన లోకల్ ఆటో డ్రైవర్ ఎర్ర రవి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఆ వృద్ధుడిని వెతికి సుమారు ₹1400 నగదు, మందులు, బట్టలు ఉన్న కవర్‌ను సురక్షితంగా తిరిగి ఇచ్చాడు. ఈ హృదయాన్ని హత్తుకునే చర్య స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన రవి మంచి మనసుకు ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.

# ఘనంగా సర్దార్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలు

- **కోరుట్లలో ఘనంగా సర్దార్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలు**
- **'యూనిటీ మార్చ్ - ఏక్ భారత్, ఆత్మనిర్భర్ భారత్' ర్యాలీకి మినీ స్టేడియం నుంచి భారీ జెండా ఊపి ప్రారంభం**



**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** భారతదేశాన్ని ఏకం చేసిన ఉక్కు మనిషి, మొదటి కేంద్ర హోమ్ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కోరుట్ల పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా 'యూనిటీ మార్చ్ – ఏక్ భారత్, ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమం నిర్వహించారు. కోరుట్లపట్టణంలోని మినీ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఊరేగింపు పట్టణ ప్రధాన రోడ్ల గుండా సాగి, దేశ ఐక్యత, సమగ్రతలకు సర్దార్ పటేల్ చేసిన అపూర్వ సేవలను కొనియాడింది.

**ప్రముఖుల ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభం**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసన మండలి సభ్యులు ఎం.ఎల్.సి కవ్వంపల్లి అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు, డా. చిట్నేని రఘు, కార్యక్రమ కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, పార్లమెంట్ కో-కన్వీనర్ గుంటుక సదాశివ, జిల్లా కార్యవర్గ సభ్యులు సుదవేని మహేశ్, గుగ్గిళ్ళ తుకారాం, దొనికెల నవీన్, మాజీ కౌన్సిలర్లు – ఫ్లోర్ లీడర్ మాడవేని నరేష్, పెండ్యాల గణేష్ తదితరులు జెండా ఊపి ర్యాలీని ఘనంగా ప్రారంభించారు.

**ఉరకలెత్తిన నాయకులు, కార్యకర్తల ఉత్సాహం**

పట్టణ ప్రధాన కార్యదర్శులు చెట్లపెల్లి సాగర్, ఎర్ర రాజేందర్, ఉపాధ్యక్షులు కంతం ఉదయ్, మ్యాకాల గణేష్, కిసాన్ మోర్చా అధ్యక్షులు ఎల్లల నారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు ఇందూరు సత్యం, ఇందూరి తిరుమల వాసు, పోతుగంటి శ్రీను, చిరుమల్ల ధనుంజయ, రాచమడుగు శ్రీనివాస్ రావు, చెట్పల్లి ఓం ప్రకాష్, జక్కుల ప్రవీణ్, వళ్ళోజి నగేష్, ఉప్పులూటి రాఘవులు, రాధారపు సత్యనారాయణ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాడిగే మహేష్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు కలాల సాయి చందు, గోనెల రాజశేఖర్, మరిపెల్లి నవీన్, గుండేటి సాయి ధమ్మ, సంతోష్, ఎదమనపెల్లి సాయి, ఆదేపు ప్రణయ్ సహా బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. సర్దార్ పటేల్ ఆశయాలైన దేశ ఐక్యత, ఆత్మనిర్భర భారత్ నినాదాలు ఈ ర్యాలీలో మార్మోగాయి. 560కి పైగా సంస్థానాలను ఏకం చేసిన ఉక్కు మనిషి స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. కోరుట్ల పట్టణంలో బీజేపీ శ్రేణుల ఉత్సాహం, ఐక్యత ఈ కార్యక్రమం ద్వారా మరోసారి ప్రతిఫలించింది.

# కోట బురుజుల పరిరక్షణకు అఖిలపక్షాల పోరాటం



- **అక్రమ తవ్వకాలు, భూఆక్రమణలపై ఆర్డీవోకు వినతిపత్రం**

**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** చారిత్రక వారసత్వ గుర్తుగా నిలిచిన కోరుట్ల కోట బురుజులు మరియు వాటి పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ తవ్వకాలు, మట్టి కుప్పలు, ఆధారాల మార్పిడి, భూఆక్రమణ ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాలు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు శనివారం కోరుట్ల ఆర్డీవో ఎల్. జీవాకర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

**చారిత్రక కోటపై పెను ముప్పు**

కోట బురుజుల అడుగుభాగంలో ఉన్న సుమారు 3 ఎకరాల 21 గుంటల ప్రభుత్వ భూమిపై కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండానే తవ్వకాలు చేపడుతూ, ఆధారాలను మార్చి, రిజిస్ట్రేషన్లు చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ప్రతినిధి బృందం ఆవేదన వ్యక్తం చేసింది. ఈ చర్యలు కోట బురుజుల చారిత్రక, పురావస్తు ప్రాముఖ్యతకు తీవ్ర ముప్పుగా మారాయని, ఈ ప్రాంతం పూర్తిగా ప్రభుత్వ రక్షణలో ఉండాల్సిన సమయంలో ఇలాంటి అక్రమాలు జరగడం అత్యంత విచారకరమని నాయకులు ఆరోపించారు.

**ఎవరికీ అనుమతి లేదు.. చట్టవ్యతిరేక చర్యలు ఆపండి**

వినతిపత్రం అందుకున్న ఆర్డీవో ఎల్. జీవాకర్ రెడ్డి స్పందిస్తూ, కోట బురుజుల పరిసర ప్రాంతాల్లో ఎవరికీ ఎలాంటి అనుమతులు జారీ కాలేదని, ఎటువంటి తవ్వకాలు, నిర్మాణాలు, ఆక్రమణ ప్రయత్నాలు చట్టవ్యతిరేకమేనని స్పష్టం చేశారు. అక్కడ జరుగుతున్న అన్ని అక్రమ చర్యలను తక్షణమే ఆపివేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. లేనిపక్షంలో కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోరుట్ల ప్రజలకు న్యాయం జరిగేలా అన్ని చర్యలూ తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

**నిరంతర పోరాటం కొనసాగుతుందని ప్రతినిధుల ప్రకటన**

కోట బురుజుల పరిరక్షణ కోసం అఖిలపక్షాలు, ప్రజా సంఘాలు ఏకమై నిరంతరం పోరాడుతామని ప్రతినిధి బృందం ప్రకటించింది. ఈ చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, దీనికి అడ్డుపడే ఎవరినైనా అడ్డుకుంటామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షుడు పేట భాస్కర్, సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కార్యదర్శి & యునైటెడ్ ముస్లిం మైనారిటీ రైట్స్ ఆర్గనైజేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ ముజాహిద్, టీడీపీ అడ్‌హాక్ కమిటీ సభ్యుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ బాబు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోతని సత్యం, ఎండీ అన్వర్, భూపెల్లి నగేష్, రాస భూమయ్య, సుతారి రాములు (ఏఐటీయూసీ), మొహమ్మద్ అలీమ్, రాసకొండ పెద్ద దేవన్న తదితరులు పాల్గొన్నారు. కోరుట్ల కోట బురుజుల పరిరక్షణ ప్రజల ఐక్యతకు పరీక్షగా మారిన ఈ ఉద్యమం రాబోయే రోజుల్లో మరింత ఉధృతం కావడం ఖాయమని స్థానిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# రాష్ట్ర స్థాయి అండర్ 14 , బాల, బాలికల హాకీ టోర్నమెంట్

- **చంద్రగిరి ప్రభుత బాలుర పాఠశాలలో 69వ రాష్ట్ర స్థాయి అండర్ 14 , బాల, బాలికల హాకీ టోర్నమెంట్**
- **హాకీ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నాని , జాతీయ హాకీ క్రీడాకారిణి రజిని**



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** చంద్రగిరి ప్రభుత బాలుర పాఠశాలలో 69వ రాష్ట్ర స్థాయి అండర్ 14 , బాల, బాలికల హాకీ టోర్నమెంట్ హాకీ టోర్నమెంట్ ప్రారంభమయింది ఈప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పులివర్తి నాని , జాతీయ హాకీ క్రీడాకారిణి రజిని ప్రారంభించారు ఎమ్మెల్యే పులివర్తి నానికి జిల్లా విద్యాశాఖ అధికారి, శాప్ డైరెక్టర్, మండల స్థాయి అధికారులు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు ముందుగా ఎమ్మెల్యే నాని, క్రీడా కారిణి రజినీ లతో కలిసి జ్యోతిప్రజలను చేసి జండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం బాలికల చేసిన నృత్యాలను ఎమ్మెల్యే పులివర్తి నాని, రజనీ, నాయకులు తిలకించారు అదేవిధంగా హాకీ టోర్నమెంట్ కు విచ్చేసిన బాల....బాలికలను ఎమ్మెల్యే ప్రతిఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ పరిచయం చేసుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెగా డీఎస్సీ లో స్పోర్ట్స్ కోటా ద్వారా 450 మందికి ఉద్యోగాలను కూటమి ప్రభుత్వం కల్పించిందని అన్నారు ఆంధ్ర రాష్ట్రంలో క్రీడాకారులకు ఏ రకంగా ప్రోత్సహిస్తుందో తెలపడానికి ఇది ఒక నిదర్శనమన్నారు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చంద్రగిరి ప్రభుత్వ బాలుర గ్రౌండ్ లో మినీ స్టేడియం ఏర్పాటుకు ప్రయత్నిస్తామని హామీఇచ్చారు గత వైసిపి పాలనలో క్రీడాకారులకు కనీస మౌలిక వసతులు కల్పించకపోగా... యూనిఫాంలో కూడా ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు హాకీ టోర్నమెంట్ కోసం 13 జిల్లాల నుండి వచ్చిన ప్రతి విద్యార్థికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు కూటమి ప్రభుత్వంలో క్రీడాకారులకు మంచి ప్రోత్సాహంతో పాటుగా సముచిత గౌరవం కల్పిస్తున్నామని తెలిపారు

విద్యార్థులు ప్రతి ఒక్కరు మంచిగా ఆడి ఆంధ్ర రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్ గా మార్చాలి.... రాష్ట్రానికి మంచి పేరు తేవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు అనంతరం టోర్నమెంట్ కు వచ్చిన అతిథులకు జ్ఞాపికలను అందించారు క్రీడా ప్రాంగణంలో హాకీ ఆడి టోర్నమెంటును ఎమ్మెల్యే ప్రారంభించారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటుగా, మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి సహకరించాలని ఎం ఎల్ ఏ సంజయ్ కుమార్ వినతి



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్(పూరెళ్ల బాపు) :** ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి సలహాదారు వేం నరేందర్ రెడ్డి నీ వారి కార్యాలయం లో కలిసి జగిత్యాల పట్టణ అభివృద్ధి విషయం లో వినతి పత్రాన్ని అందజేశారు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. యావర్ రోడ్డు విస్తరణ కోసం 284 మంది స్థలాలు కోల్పోయే అవకాశం ఉ న్నందున నష్ట పరిహారం కింద ట్రాన్స్ఫర్ ఆఫ్ డెవలప్ మెంట్ రైట్స్ TDR కింద 2023 లో గత ప్రభుత్వం లో జీవో రావడం జరిగింది అని అప్పుడు TDR కు తక్కువ విలువ మరియు అవగాహన లోపం వల్ల ఆగిపోయింది అని ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లో హైదరాబాద్ లో రియల్ వ్యాపారం కొంత పుంజుకుంటున్నందున TDR కు డిమాండ్ ఉంది అని స్థలం కోల్పోయిన వారికి HMDA పరిధిలోకి తీసుకునే విధంగా జీవో రావడం జరిగింది అని,ముఖ్యమంత్రి గారి దృష్టికి,ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లాలని కోరడం జరిగింది. వారు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
శనివారం
22 నవంబర్ 2025



# నిత్య జీవితంలో ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి

- **చిన్నారులకు ఆట, పాట, కథలతో విద్యాబోధన అందించాలి**
- **సిడిపిఓ ఆర్.మమత**



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులకు ఆట, పాట కథలు చెప్తూ, పిల్లల మానసిక ఎదుగుదలకు తోడ్పడే విధంగా విద్య బోధన చేయాలని మిర్యాలగూడ అర్బన్ సిడిపిఓ మమత అన్నారు. అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని చిల్లాపురం సెక్టార్ పరిధిలోని లావుడి తండా అంగన్వాడీ కేంద్రంలో, ఈసిసిఈ డే కార్యక్రమంలో శనివారం అర్బన్ సిడిపిఓ ఆర్.మమత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ఈసిసిఈ గురించి, అంగన్వాడీ టీచర్స్, చిన్నారులకు వివరించారు. పిల్లలు తయారుచేసిన డ్రాయింగ్ బుక్స్ ను ప్రదర్శించి, అంగన్వాడీ కేంద్రంలో 4 కార్నర్స్ గురించి మరియు పిల్లల లోపపోషణ లోపం కు గురైన వారిని గుర్తించి, వారి పోషణ కొరకు బాలామృతం ప్లస్ ను పంపిణీ చేయడం జరుగుతుందని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రం యొక్క లబ్ధిదారులు, తల్లిదండ్రులు మరియు సంరక్షకులతో.. పోషకాహార గురించి వివరించి, తల్లిదండ్రులు అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహించే వివిధ రకాల ప్రీ స్కూల్ కార్యక్రమాలను, సౌకర్యాలను గుర్తించి పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకం అనేది నిత్య జీవితంలో తగ్గించాలని, అదేవిధంగా పిల్లలకు జంక్ ఫుడ్, కూల్ డ్రింక్స్ కూడా ఇవ్వకూడదని వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ ఆర్.వాణి, బ్లాక్ కో-ఆర్డినేటర్ కవిత, అంగన్వాడీ టీచర్ మంగతి, పార్వతి, రామలక్ష్మి, అంగన్వాడీ ఆయా సోమ్లి, కిషోరబాలికలు, లబ్ధిదారులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలే తొలి ప్రాధాన్యం

**నూతన జిల్లా ఎస్పి గా స్నేహ మెహ్రా**





**మహిళా భద్రతకు ప్రత్యేక చర్యలు**

**నేటి సాక్షి వికారాబాద్ :** హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా సమర్థవంతంగా విధులు నిర్వహించిన స్నేహ మెహ్రా, శనివారం జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలను స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమెకు సీనియర్ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చార్జ్ తీసుకున్న సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలోని శాంతి భద్రతల పరిస్థితులను, గత చరిత్రను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, అందుకు అనుగుణంగానే పోలీసు విధానాలలో (పోలిసింగ్ లో) అవసరమైన మార్పులు తీసుకురావడం జరుగుతుందని తెలియజేశారు. నేర నియంత్రణ (క్రైమ్ కంట్రోల్) తన ప్రధాన లక్ష్యమని, జిల్లాలో నేరాల సంఖ్యను గణనీయంగా తగ్గించడానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని స్థానిక సమస్యలను తెలుసుకుని, వాటి నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని, తద్వారా ప్రజలు మరింత ప్రశాంతంగా, భద్రతగా ఉండే వాతావరణాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్లు, ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అంతేకాకుండా, మహిళలు, పిల్లల భద్రతకు, రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని, సిబ్బంది సంక్షేమానికి కూడా తగిన చర్యలు తీసుకుంటూ, జిల్లా పోలీసు వ్యవస్థను మరింత పటిష్టం చేస్తానని శ్రీమతి స్నేహ మెహ్రా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, డిసిఆర్బి డిఎస్పి జానయ్య, డిటిసి డిఎస్పి శ్రీనివాసులు, తాండూర్ డిఎస్పి ఎన్.యాదయ్య, వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, పరిగి డిఎస్పి శ్రీనివాస్,ఏఆర్ డిఎస్పి వీరేష్, జిల్లాలోని ఇన్స్పెక్టర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్ లు,ఆర్ఐ లు,ఎస్ఐ లు,ఆర్ఎస్ఐ లు సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

# కోరుట్లలో తాళ్లచెరువు ఫిల్టర్ బెడ్ పరిశీలన

- **పట్టణ ప్రజలకు సకాలంలో స్వచ్ఛమైన నీటి సరఫరాకు అదనపు కలెక్టర్ ఆదేశాలు**




**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** కోరుట్ల పట్టణ శివారులోని తాళ్లచెరువు ఫిల్టర్ బెడ్ ను శనివారం అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజ గౌడ్ స్వయంగా పరిశీలించి, పట్టణ ప్రజలకు నిరంతరంగా స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

**సకాలంలో నీటి సరఫరా, స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి**

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, కోరుట్ల పట్టణంలోని ప్రజలకు ఎటువంటి అంతరాయం లేకుండా సకాలంలో తాగునీరు అందాలని, ఫిల్టర్ బెడ్ పనితీరును మరియు నీటి స్వచ్ఛతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. నీటి శుభ్రతలో రాజీ లేకుండా, ఫిల్టర్ బెడ్ నిర్వహణలో ఎప్పటికప్పుడు అవసరమైన మెరుగులు చేపట్టాలని ఆయన ఆదేశించారు. పట్టణంలో నీటి కొరత లేదా కలుషిత నీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్ తో పాటు సంబంధిత మున్సిపల్ ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఫిల్టర్ బెడ్ ప్రస్తుత పనితీరు, నీటి నాణ్యత పరీక్షలు, సరఫరా వ్యవస్థలో ఉన్న సాంకేతిక సమస్యలు (ఏమైనా ఉంటే) పై అదనపు కలెక్టర్ వివరాలు సేకరించి, వెంటనే సమస్యల పరిష్కారానికి అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలో తాగునీటి సమస్యపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల దృష్ట్యా ఈ ఆకస్మిక పరిశీలన చేపట్టినట్లు తెలుస్తోంది. అధికారులు ఇచ్చిన హామీ మేరకు రాబోయే రోజుల్లో నీటి సరఫరా వ్యవస్థలో మరింత మెరుగుదల కనిపించే అవకాశం ఉంది.

# కొత్త వైన్ షాప్‌కు అనుమతి నిలిపివేయాలంటూ డిమాండ్



- **సిర్ సిల్క్ కాలనీలో కొత్త వైన్ షాప్‌కు అనుమతి నిలిపివేయాలంటూ డిమాండ్**

**నేటి సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్ ప్రతినిధి నవంబర్ 22 :** కాగజ్‌నగర్ ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ మొబీన్, జాయింట్ సెక్రటరీ మొహమ్మద్ నియాజుద్దీన్ నాయకత్వంలో సిర్పూర్ కాగజ్‌నగర్ సిర్ సిల్క్ కాలనీ. మద్యం దుకాణం ఏర్పాటు పై ఆసిఫాబాద్ సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా కు మెమోరండం ఇవ్వడం జరిగింది సరసిలక్.ఆర్బీ రోడ్డుపై కొత్త వైన్ షాప్ ప్రారంభించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అయితే అక్కడ సమీపంలో ఒక పాఠశాల, చర్చి మరియు మస్జిద్ ఉన్న నేపథ్యంలో ఆ ప్రాంతం వాతావరణం దెబ్బతినే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో, కొత్త వైన్ షాప్‌కు అనుమతులు మంజూరు చేయవద్దని వారు సబ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. వారి అభ్యర్థనపై స్పందించిన సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా. 100 మీటర్ల పరిధిలో ఉంటే అనుమతి ఇవ్వబడదు. అని భరోసా ఇచ్చారు. ఇట్టి విషయంపై 100 మీటర్లు పైన ఉన్న వాటికి మద్యం దుకాణానికి వేలం వేయాలి కానీ జన సంద్రంలో గుడి చర్చి మరియు మసీదు పాఠశాలలు ఉన్నచోట ప్రభుత్వం అనుమతి ఇవ్వకూడదు ఈ విషయంపై స్థానిక కాగజ్నగర్ పట్టణ ప్రొఫెషనల్ ఎక్సైజ్ వారికి కూడా మెమోరడం ఇవ్వడం జరిగింది ఎంఐఎం అధ్యక్షులు మాట్లాడుతూ ప్రజలు ఏమి కోరుకుంటే అదే పని ప్రభుత్వం చేయాలని ప్రజలు కు ఎలాంటి ఇబ్బందులు కడగకుండా ప్రభుత్వ పరమైన వ్యాపారం చేసుకోవచ్చు అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కాగజ్నగర్ పట్టణ ఎంఐఎం పార్టీ చెందిన నాయకులు మరియు కాలనీవాసులు ప్రజలు పాల్గొన్నారు

# స్థానిక సంస్థల్లో విజయకేతనం ఎగరేద్దాం

**నాగేశ్వర్ నాయుడు**



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి నవంబర్ 22 :** తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలు పటిష్టం చేస్తూ త్వరలో జరగబోయే పంచాయితీ నూతన కమిటీలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల విజయానికి కృషి చేయాలని రాష్ట్ర పాల ఏకిరిల కార్పొరేషన్ చైర్మన్ చౌడేపల్లి మండల సంస్థ గత ఎన్నికల పరిశీలకుడు నాగేశ్వర్ నాయుడు అన్నారు మండలంలోని దిగువపల్లి పంచాయతీ తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు ఎన్నికలకు ముందు కూటమి పార్టీల ఆధ్వర్యంలో ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు ముఖ్యంగా శ్రీ శక్తి మహిళలందరికీ ఉచిత బస్సు కార్యక్రమం ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు ఇటీవల కూటమి ప్రభుత్వం ఆర్టీసీకి శ్రీ శక్తి గాను రూ 400 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు అదేవిధంగా ఇచ్చిన వాగ్దానాలతో పాటు ప్రకటించని హామీలను సైతం అందించిన ఘనత ప్రభుత్వానికి దక్కిందన్నారు రాబోయే ఎన్నికలలో అయినా తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించేలా కృషి చేయాలని పార్టీ కేడర్ కు సూచించారు అనంతరం దిగువపల్లి సంస్థాగత ఎన్నికలలో భూషణంను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు కె ఎస్ ఎస్ సభ్యుల బాధ్యతలను సభలో వివరించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి సింగల్ విండో అధ్యక్షుడు హరి రాయల్ పుంగనూరు మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ తెలుగుదేశం పార్టీ యువ నేత మాదిరాజు ప్రదీప్ రాజు మాదిరాజు లక్ష్మణ పతిరాజు బోయకొండ సుబ్బు సోము రెడ్డి శివ అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాణ్యత ప్రమాణాలు సడలించి పత్తి కొనుగోలు

**ఎకరాకు 12క్వింటాలు కొనుగోలు చేయాలి.**

**తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శులు మద్దులపల్లి సుదర్శన్.**

**సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్.**



**నేటి సాక్షి వికారాబాద్:** వికారాబాద్ జిల్లా లో అధిక వర్షాలతో దెబ్బతిన్న పత్తి పంటను నాణ్యత ప్రమాణాలు సడలించి మద్దతు ధరకు రైతుల నుంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూనన్నము. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ప్రకారం కొనుగోలు చెయ్యాలి. తేమ శాతం పేరుతో రైతులను మోసం చెయ్యడం ఆపాలని సిపిఎం ,రైతు సంఘం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం లో కేంద్రకాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించటం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్.రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుదర్శన్ లు మాట్లాడుతూ జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద తేమ శాతం పేరుతో రైతులను మోసం చేస్తున్నారు. అధిక వర్షాలకు పంటలు నీట మునిగినావి. ఉన్నపంటలు మొత్తం రైతులు నష్టపోయారు. ఉన్న పంటకు మద్దతుదార ఉన్న అమలు చెయ్యడం లేదు. మద్దతు ధర 8110 రూపాయలు ఉన్న అమలు కావడం లేదు. కొనుగోలు కేంద్రలలో ఎకరాకు 12క్వింటాలు కొనుగోలు చేయాలని ఉన్న, 7కీంటలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఆంక్షలు వెతివెయ్యాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చెయ్యడం సరికాదు రైతులను ఆదుకోవాలి. మధ్య దళారుల చేతులలో రైతులను నిలువు దోపిడి చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి రాక రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కొనుగోలు కేంద్త్రుల వద్ద పెట్టిన ఆంక్షలు వెతివెయ్యాలి.రాష్ట్రాల్లో ఉన్న ఎంపీ లు కేంద్రంపై వత్తిడి తేవాలని డిమాండ్ చేస్తున్నాము. లేనిచో ఆందోళనలు పోరాటాలు తీవ్రతరం చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం రైతు సంఘం నాయకులు సుదర్శన్ మహిపాల్ సతీష్ లక్ష్మయ్య అగ్బర్ శ్రీను రైతులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# ఈ నెల 24 నా కొడంగల్ కి ముఖ్యమంత్రి రాక

- రాష్ట్ర ముఖ్య మంత్రి కొడంగల్ నియోజకవర్గానికి రానున్న నేపథ్యంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ గార్లతో కలిసి ఏర్పాట్ల ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.



**నేటి సాక్షి వికారాబాద్ :** కొడంగల్ నియోజకవర్గం ఎన్కే పల్లి గ్రామ శివారు నందు అక్షయ పాత్ర భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్య మంత్రి వస్తున్న సందర్భంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా, రెండు అంబులెన్సు లు, వైద్య సౌకర్యాలు అన్నింటిని ఏర్పాటు చేయాలనీ సంబంధిత అధికారులకు సూచించారు. శానిటేషన్, బారికేడ్స్,మొబైల్ టైయిలెట్స్, త్రాగునీరు, స్టేజి ఏర్పాట్లు, వి ఐ పి పార్కింగ్ పూర్తి ఏర్పాట్లు చేయాలనీ సంబంధిత అధికారులకు ఆదేశించారు. పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రానున్న నేపథ్యంలో పూర్తి స్థాయి లో ఏర్పాట్లు చేయాలనీ, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలనీ అధికారులకు ఆదేశించారు. ముందు జాగ్రత్త గా ఫైర్ ఇంజన్ ను ఏర్పాటు చేయాలనీ అన్నారు. ఈ సందర్భంగా హెలి ప్యాడ్ ఏర్పాట్ల ను పరిశీలించారు. కలెక్టర్ గారితో పాటు ట్రైని కలెక్టర్ హార్ష్ చౌదరి, గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి రేణుకా దేవి, ఆర్ అండ్ బి, ఎలక్ట్రిసిటీ రవి కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ ,తహసిల్దార్ రాంబాబు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# నా వల్లే..నాన్న చనిపోయాడని.!

### ఉరేసుకుని కొడుకు ఆత్మహత్య

**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** అయ్యప్ప దీక్ష తీసుకునేందుకు గంగా స్నానానికి వెళ్లినపుడు.. గంగానదిలో మునిగిన తనను కాపాడబోయి తన తండ్రి చనిపోవడానికి కారమయ్యానని ఓ కొడుకు ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన కోరుట్ల పట్టణ శివారులోని ఆనంద్ నగర్ లో జరిగింది.




### తండ్రి మరణానికి మనస్థాపంతో ఉరి వేసుకున్న 17 ఏళ్ల అభిరామ్

కోరుట్ల పట్టణంలోని ఆనంద్ నగర్ నివాసి సాంబారు అభిరామ్ (17), తన తండ్రి మరణానికి మనస్థాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రస్తుతం %ూ=దీవీ% కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న అభిరామ్, గత మూడు సంవత్సరాలుగా తండ్రి శ్యాంసుందర్ మరణం కారణంగా తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటన స్థానికులలో విషాదాన్ని నింపింది, మరియు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. 21 నవంబర్ 2025న రాత్రి 10 గంటల సమయంలో అభిరామ్ తన అత్త సాంబారు శైలజ మరియు అత్తమ్మ సాంబారు సుశీలతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. ఈరోజు ఉదయం 7 గంటలకు శైలజ లేచి చూసేసరికి అభిరామ్ తమ గదిలో కనిపించకపోవడంతో అనుమానం వచ్చి మరో గదిని తనిఖీ చేసింది. గది లోపలి నుంచి గొలుసు వేయబడి ఉండటంతో, మరో వైపు షట్టర్ తెరిచి చూడగా అభిరామ్ పాత బెడ్ షీట్‌తో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయి ఉన్నాడని తెలిసింది. శైలజ వెంటనే తన సోదరి మరియు ఇతర కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అభిరామ్ మరణంలో ఎలాంటి అనుమానం లేదని, అతను గతంలో కూడా ఒకసారి నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు.

### తండ్రి మరణం మరియు మానసిక ఒత్తిడి నేపథ్యం

అభిరామ్ తండ్రి శ్యాంసుందర్ మరణం 25 నవంబర్ 2022న మొగిలిపేట వద్ద గోదావరి నదిలో సంభవించింది. అయ్యప్ప దీక్ష తీసుకునే ముందు గంగా స్నానం చేయడానికి తండ్రీకొడుకులు ఇద్దరూ నదికి వెళ్లగా, అభిరామ్ నీటిలో మునిగిపోతుండగా శ్యాంసుందర్ అతన్ని కాపాడి తన ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన తర్వాత అభిరామ్ తన తండ్రి మరణానికి తానే కారణమని భావించి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. గత మూడు సంవత్సరాలుగా ఈ బాధ అతన్ని వెంటాడుతూ వచ్చిందని, అతని మరణానికి ఇదే ప్రధాన కారణమని కుటుంబ సభ్యులు అభిప్రాయపడ్డారు. అభిరామ్ మేనమామ పిల్లమరపు సురేష్ ఫిర్యాదు మేరకు కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# రేపు జగిత్యాల లో జాబ్ మేళా

**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు ):** జగిత్యాల జిల్లా లోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగం లో ఉద్యోగాల కోసం నవంబర్ 23న (ఆదివారం ) ఉపాధి కల్పన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు బి. సత్యమ్మ తెలిపారు. కృషి విజ్ఞాన్ హైదరాబాద్ లో 67,గూగుల్ పే లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ 30 పోస్టులు ఉన్నాయన్నారు. ఇంటర్, డిగ్రీ అర్హత ఉన్నవారు హాజరు కావచ్చు. ఎంపికైనవారు జగిత్యాల, కోరుట్ల, మెట్టుపల్లి, చొప్పదండి, ధర్మారం వంటి ప్రాంతాలలో పని చేయాలిసి ఉంటుంది.

# కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్న కోరుట్ల ఎమ్మెల్యే

- కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కె. సంజయ్



**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :**కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శనివారం ఉదయం ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు ఎమ్మెల్యే సంజయ్ గారిని పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు.

### స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని, కోరుట్ల నియోజకవర్గ ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖసంతోషాలతో కూడిన సుభిక్ష జీవితం గడపాలని శ్రీ ఆంజనేయస్వామి వారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే గారికి ప్రసాదాలు, తీర్థం అందజేశారు.

### ప్రజల అభివృద్ధికి నిరంతర కృషి: సంజయ్ హామీ

పూజా కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే డాక్టర్ కె. సంజయ్ మాట్లాడుతూ.. కొండగట్టు ఆంజనేయస్వామి వారి ఆశీస్సులతో కోరుట్ల నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాను. ప్రజల సంక్షేమం, ప్రాంత ప్రగతి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఈ పవిత్ర క్షేత్రంలో మరోసారి ప్రతిజ్ఞ చేస్తున్నానని తెలిపారు. కొండగట్టు ఆలయం రాష్ట్రవ్యాప్తంగా భక్తులను ఆకర్షిస్తున్న ప్రముఖ ఆంజనేయ క్షేత్రం కాగా, ఎమ్మెల్యే సంజయ్ గారి ఈ దర్శనం స్థానిక ప్రజల్లో మరింత ఆదరణ పొందింది.

# ఐటిఈఎస్ ఒకేషనల్ ల్యాబ్ ప్రారంభం



- చంద్రగిరి ప్రభుత్వ బాలుర పాఠశాలలో నూతన ఐటి ,ఐటిఈఎస్ ఒకేషనల్ ల్యాబ్ ప్రారంభం చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని.

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** చంద్రగిరి ప్రభుత్వ పాఠశాలలో నూతన ఐటీ ,ఐటిఈఎస్ఒకేషనల్ ల్యాబ్ ను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు సుమారు 2.5 లక్షల విలువగల కంప్యూటర్లు, ఫర్నిచర్ ను వితరణ చేసిన దాత భాను ప్రకాష్ ను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు చంద్రగిరి ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి నా వంతు సాయం అందించడానికి ప్రయత్నిస్తున్నామని దాత భాను ప్రకాష్ తెలిపారు మండలంలో మరిన్ని పాఠశాలలకు నా వంతు సహాయ-సహకారాలు అందిస్తామని అన్నారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి మీలాంటి సహాయ సహకారాలు ఎంతో ఆనందంగా ఉందని అభినందించారు గత వైసిపి పాలనలో విద్యా వ్యవస్థను సర్వనాశనం చేసిందని మండిపడ్డారు కూటమి ప్రభుత్వ రాకతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కొనసాగిస్తున్నారు ప్రతి విద్యార్థి ఆరవ తరగతి నుండే కంప్యూటర్ పై పట్టు సాధించడానికి ప్రయత్న చేయాలని అన్నారు

### పాఠశాల ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం.

ఉపాధ్యాయులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు ఉపాధ్యాయులు చేసిన సహాయ సహకారాలు మరువలేనిది పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడంలోనే కాకుండా... మా పాలనలో తెలిసి తెలియక చేసిన తప్పొప్పులను, మీ సూచనలు ,సలహాలను నా దృష్టికి తీసుకు రండి అన్నారు అనంతరం ఎమ్మెల్యే తన పర్సనల్ నెంబర్ ఉపాధ్యాయులకు ఇచ్చి ఏ సమయంలోనైనా తనను సంప్రదించవచ్చని, మీ సమస్యలను నాకు తెలపవచ్చని చెప్పారు రాష్ట్ర విద్యావ్యవస్థను జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలపాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం... అది మీతోనే సాధ్యమన్నారు గత ప్రభుత్వంలో మమ్ములను నిలువునా మోసం చేసిందని గుర్తు చేశారు పిఆర్సి, డిఏ లతో పాటుగా ఎస్ ఎల్ ఎస్ లు మీకు రరాకుండా చేసింది వైసిపి ప్రభుత్వం అన్నారు దీంతో ఉపాధ్యాయులు స్పందిస్తూ మా 25 సంవత్సరాల అనుభవంలో మీలాంటి ఎమ్మెల్యేను మేము చూడలేదు , మాపై మీరు చూపిస్తున్న ప్రత్యేక ప్రేమాభిమానాలు మ-రువలేమన్నారు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఉపాధ్యాయుల సమస్యలను విద్యాశాఖ మంత్రి వద్దకు తీసుకువెళ్లి పరిష్కార దిశగా చర్యలు చేపడతానని హామీ. ఒక ఎమ్మెల్యేగా కాకుండా మీ కుటుంబ సభ్యుడిగా నన్ను భావించి... మా పాలనలో మీ భాగస్వామ్యం అందించండి. గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధితో పాటుగా ప్రతి ఉద్యోగి భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఉపాధ్యాయుల బకాయిలను కూడా త్వరలోనే కూటమి ప్రభుత్వం విడుదల చేస్తుంది.

# బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**నేటి సాక్షి కుత్బుల్లాపూర్ నవంబర్ 22 :**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్ పల్లి: డబల్ బెడ్ రూమ్ సమీపంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది కిషోర్ రెడ్డి మాట్లాడుతూ. పేద మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. బి కే ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్ వైద్య బృందం చే శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్ పల్లి డబుల్ బెడ్ రూమ్ సమీపంలో ఉచిత వైద్య శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో అనేకమంది పేద మధ్యతరగతి ప్రజలు వైద్య పరీక్షలు నిర్వహించి ...ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొంగునూరి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలందించే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నట్లు తెలిపారు. నేటి సమాజానికి మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్ లాంటి సంస్థలు



ఎంతో ఉపయోగకరమని సూచించారు. వైద్య శిబిరాల్లో ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం వల్ల సకాలంలో వ్యాధి నిర్ధారణ జరుగుతుందని,తద్వారా సకాలంలో చికిత్స పొందవచ్చని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యక్తం చేశారు. అదేవిధంగా నియోజకవర్గ ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేటట్లు తన వంతు కృషి చేస్తున్నానని తెలియజేశారు. అనంతరం ఉచిత వైద్య సేవలు అందించిన మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్ వైద్యులకు బొంగునూరి కిషోర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మాజీ సర్పంచ్ బండ నరసింహ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏ ఆర్ సాదు యాదవ్, దుండిగల్ మాజీ సర్పంచ్ కావాలి గణేష్ వేణు, దుడ్డు నర్సింగ్ రావు,రంగయ్య, రచ్చ నాయక్, శ్రీనివాస్ చారి కృష్ణవేణి బృందం నరసింహారెడ్డి,శ్రీశైలం యాదవ్,పృధ్వి, కాలనీ వాసులు గ్రామ ప్రజలు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహణ

- ఈ నెల 24 నుండి డిసెంబర్ 3 వరకు రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహణ : జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

**నేటి సాక్షి తిరుపతి బాదూరు బాల తిరుపతి, నవంబర్ 22:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ మరియు ఇతర అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 24 నుండి డిసెంబర్ 3 వరకు రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, పశు సంవర్ధక శాఖ, మత్స్య శాఖ ల సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామ ఎనర్జీ అసిస్టెంట్, ఆదర్శ రైతు , ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సభ్యులు, నీటి వినియోగదారుల సంఘ సభ్యులు మరియు మార్కెట్ కమిటీ సభ్యులతో కలిసి ప్రతి రైతు ఇంటికి వెళ్లి ప్రభుత్వం



ద్వారా అందచేయబడుతున్న పథకాల గురించి వివరించడం జరుగుతుందని తెలిపారు. అలాగే గౌరవ ముఖ్య మంత్రి గారి పంచ సూత్రాలైన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ (సాంకేతిక సాగు), వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ప్రపంచ మార్కెట్ గురించి రైతులకు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. రబీ 2024 - 25 మరియు ఖరీఫ్ 2025 లో సాగు చేసిన పంటల గురించి రైతుల నుండి అభిప్రాయ సేకరణ, రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు రైతులని మొగ్గు చూపేలా వివరించడం , రైతులను నూతన సాంకేతిక విధానాలు ఆచరించేలా చర్యలు తీసుకోవడం, రైతులచే ఎపిఎఐఎంఎస్ ఫార్మర్స్ యాప్ నందు నమోదు చేయించడం మరియు రైతుల వద్ద ఉన్నటు వంటి వ్యవసాయ పనిముట్ల వివరాలు మరియు మార్కెటింగ్ సౌకర్యాల గురించి వివరాలు సేకరించడం మొదలగు కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. కావున ప్రతి రైతు ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ అమూల్యమైనటువంటి సూచనలు, అభిప్రాయాలు తెలియ పరచవలసినదిగా జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.